www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 13-7-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 88 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: తదియ రా.1-03 తదుపరి చవితి, నక్షత్రం: శ్రవణం ఉ.6-53 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: ఉ.10-52-12-28, దుర్ముహూర్తం: సా.5-06-5-57, అమృతఘడియలు: రా.8-26-10-02, రాహుకాలం: సా.4-30-6-00, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కిల్లర్ 'స్విచ్'

ఇంధన స్విచ్‌లు కటాఫ్‌కు.. ఆగిపోయిన 2 ఇంజన్లు

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఏఏఐబీ నివేదిక

'ఇంధన స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావు?.. నేను ఆఫ్ చేయలేదు..' పైలట్ల సంభాషణ

స్విచ్‌లను తిరిగి ఆన్ చేసినా ఇంజన్లు పుంజుకునేలోగా ఘోరం

- టేకాఫ్ అయిన 32 సెకన్లలోనే దుర్ఘటన
- ప్రస్తుత ఆధారాల మేరకు కుట్ర కోణమేదీ లేదని భావిస్తున్నట్లు ఏఏఐబీ వెల్లడి
- ఇంధన స్విచ్‌లు ఎలా కటాఫ్‌కు మారాయనే దానిపై సందేహాలు
- విమానాన్ని కావాలనే కూల్చివేసినట్టుందని పలువురు నిపుణుల ఆరోపణ

న్యూఢిల్లీ, జూలై 12: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించి ఇంధన స్విచ్‌లు కీలకంగా మారాయి. రెండు ఇంధన స్విచ్‌లు 'రన్' నుంచి 'కటాఫ్' మోడ్‌లోకి మారడంతో.. ఇంధన సరఫరా నిలిచిపోయి సెకన్ల వ్యవధిలోనే రెండు ఇంజన్లు నిలిచిపోయాయి. పైలట్లు దీన్ని గుర్తించి సరిచేసేందుకు ప్రయత్నించినా.. ఆలోపే ప్రమాదం జరిగిపోయింది. టేకాఫ్ తర్వాత 32 సెకన్లలోనే కుప్పకూలింది. 'విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ)' శనివారం విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలను వెల్లడించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి బయల్దేరిన ఎయిరిండియా ఏఐ171 విమానం (బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్).. ఎయిర్‌పోర్టు పక్కనే ఉన్న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై కుప్పకూలిన విషయం

మిగతా 9వ పేజీలో...

అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దు

ఇది ప్రాథమిక నివేదికే: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పైలట్లపైకి తప్పు నెట్టే యత్నం.. ఏఏఐబీ నివేదికను ఖండిస్తున్నాం

ఎయిర్‌లైన్ పైలట్ల అసోసియేషన్ మండిపాటు

భయమే జగన్ పెట్టుబడి



జగన్ ఐదేళ్ల పాలనను చూసిన ప్రజలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఆయనంటే వణుకు ఏర్పడింది. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే? అన్న భయం సామాన్య ప్రజల నుంచి వివిధ స్థాయిల్లో ఉన్నవారిలో ఏర్పడింది. ఇది గమనించిన జగన్ రెడ్డి భయపెట్టడాన్నే నమ్ముకున్నారు. అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో, అది కూడా 11 సీట్లకు పరిమితమై కూడా భయపెట్టగలగడం ఆయన ప్రత్యేకత.

> పిరికితనం అనేది తెలుగుదేశం పార్టీ నాయకుల డీఎన్ఏలోనే ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచీ ఇదే పరిస్థితి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటాలు చేయాలంటే భయం. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకైనా మంచిదని అవతలి పక్షంతో లాలూచీ పడటం పరిపాటి అయింది.

జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే తాము టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతోనే అధికారులు అతి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టు రాలేదన్న అభిప్రాయం ఏర్పడుతోంది. అధికారుల్లో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి.

> మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా ప్రతిపక్షంలో ఉండి కూడా ఇటు అధికారులను, అధికార పార్టీ నాయకులను భయపెట్టడంతో పాటు మరోవైపు మీడియాపై దాడులకు తెగబడుతున్న జగన్ అండ్ కో.. కూటమి ప్రభుత్వమే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని నిందిస్తున్నారు. కూటమి నాయకులు ఉత్తుత్తి ప్రకటనలు చేస్తుండగా ప్రతిపక్ష వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేసి చూపిస్తున్నారు.

చీకట్లో కన్ను కొట్టగానే పనై పోవాలి గానీ రప్పా రప్పా అంటూ గోల చేయడం ఏమిటి? అని పేర్ని నాని కార్యకర్తలను పరోక్షంగా రెచ్చగొడుతున్నారు. కార్మిక సంఘాల నాయకుడిగా, రాజకీయ నాయకుడిగా లబ్ధప్రతిష్ఠుడైన పేర్ని కృష్ణమూర్తి కుమారుడైన పేర్ని నాని ఇలా మాట్లాడటం శోచనీయం. సహవాస దోషం కాబోలు.


> అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, జగన్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి' సంస్థకు పైసా ప్రకటన కూడా ఇవ్వలేదు. అయినా వాటిని మేం ఖాతరు చేయలేదు. ఇప్పుడు అంతటితో ఆగకుండా మీడియాపై దాడులు చేయాలన్న నిర్ణయానికి కూడా రావడం ఆశ్చర్యంగా ఉంది. ఈ ధోరణి సమర్థనీయం అయితే కేసీఆర్, జగన్ రెడ్డి మీడియాలపై ఏ స్థాయిలో దాడులు చేయాలి?

తెలంగాణలో కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ప్రత్యర్థులు. అయినా కేసీఆర్, జగన్ రెడ్డిలు ఆ ఇరువురి కంటే నన్నే ప్రధాన ప్రత్యర్థిగా పరిగణిస్తున్నారు. ఒక జర్నలిస్టుగా ఇందుకు నేను గర్విస్తున్నాను.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

'గోదావరి - బనకచర్ల' చుట్టూ వివాదాలు ముసురుతున్నాయి. కానీ... ఇప్పటికే చేపట్టిన తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి తదితర ప్రాజెక్టులకు ఈ సమస్య లేదు. 'ఆన్ గోయింగ్' ప్రాజెక్టులపై తెలంగాణ కూడా అభ్యంతరం వ్యక్తం చేయబోదు. పైగా... ఈ ప్రాజెక్టులన్నింటినీ కొనసాగించవచ్చని రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. వీటికి నీటి కేటాయింపులూ చేయాలన్నారు. కేవలం రూ.4 వేల నుంచి 5వేల కోట్లు ఖర్చు పెట్టి కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, ఇతర నిర్మాణాలు పూర్తి చేస్తే... 'గోదావరి-బనకచర్ల'తో సమానమైన జలఫలాలు రాయలసీమకు అందే అవకాశముంది. అది కూడా... ఎలాంటి వివాదాలు లేకుండా... మూడు నాలుగేళ్లలోనే!

ఏది మేలు?



గోదావరి-బనకచర్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1) 811 టీఎంసీల కృష్ణా నికర జలాలు కేటాయించింది. ఏపీలోని ప్రాజెక్టులకు 512 టీఎంసీలు, తెలంగాణ ప్రాజెక్టులకు 299 టీఎంసీలు వినియోగంలో ఉన్నాయి. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుని... వరద జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయగలిగితే సీమకు నీటి కరువన్నదే రాదు. 'బనకచర్ల' కోసం ఎదురు చూడాల్సిన అవసరమూ ఉండదు. దీంతోపాటు వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవులు.. వంటి ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన అవసరముందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

కృష్ణా జలాలతోనే..

వరమా.. భారమా?

రూ.80 వేల కోట్ల అతి భారీ ప్రాజెక్టు

- పాతికేళ్లకూ పూర్తయ్యే అవకాశం లేదు!
- సీమకు 200 టీఎంసీల నీరివ్వడమే లక్ష్యం
- ఇప్పటికే ఉన్న సీమ ప్రాజెక్టుల మాటేమిటి?
- దశాబ్దాలుగా పూర్తికాని జలాశయాలు
- కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు పూర్తికాక నెరవేరని సాగునీటి పంపిణీ లక్ష్యాలు
- రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే అన్నీ పూర్తి
- 3-4 ఏళ్లలోనే లక్షల ఎకరాలకు నీరు
- ఎలాంటి వివాదాలూ లేకుండానే ఫలాలు
- రాష్ట్ర విభజన చట్టంలో వీటికి గ్రీన్‌సిగ్నల్
- 'బనకచర్ల'పై సీమ నిపుణుల్లో చర్చ

15, 16 తేదీల్లో సీఎం ఢిల్లీ పర్యటన


బనకచర్ల సహా పలు అంశాలపై వరుస భేటీలు

ఇలా చేస్తే.. తెలుగుగంగ, గాలేరు-నగరి, ఎస్సార్బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టుల మొత్తం ఆయకట్టు 14.42 లక్షల ఎకరాలు. కానీ... పంటకాల్వలు లేక, ఇతర నిర్మాణాలు పూర్తికాక కేవలం 3.55 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. ఆ పనులు పూర్తి చేస్తే మరో పదిలక్షల ఎకరాలకు నీరందుతుంది.

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

"బనకచర్లకు గోదావరి జలాలు తెస్తామంటున్నారు. కరువు సీమకు నీళ్లు తెచ్చే ఏ ప్రాజెక్టైనా మంచిదే! అయితే... బనకచర్ల కంటే ముందు రాయలసీమలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయండి. పంట కాలువలను తవ్వండి"... ఇదీ రాయలసీమ సాగునీటి నిపుణుల డిమాండ్! వారు ప్రభుత్వానికి చేస్తున్న వినతి! ముఖ్యమంత్రి చంద్రబాబు 'బనకచర్ల'ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో... దీనిపై రాయలసీమలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. సీమకు త్వరగా, గరిష్ఠంగా మేలు జరగాలంటే... పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి,

మిగతా 13వ పేజీలో...



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి వరద ఉధృతి

ఉరకలేస్తున్న గోదావరి

- గొమ్ముగూడెం చుట్టూ వరద.. ముంపు మండలాలకు పొంచి ఉన్న ముప్పు
- మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో.. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం

ట్రైబ్యునల్ పరిధిలోకి బనకచర్ల రాదు

- పూర్తి వరద జలాలతోనే పథకం..15 ఏళ్ల హైడ్రాలజీ డేటా సిద్ధం చేసిన వాప్కోస్
- మొత్తం 40 ఏళ్ల లెక్కలిస్తాం.. గోదావరి జలాలు పెన్నాలో విలీనమవుతాయి
- కాబట్టి కృష్ణాలోకి గోదావరి నీళ్లు వచ్చే ప్రశ్నేలేదు.. అందువల్ల పొరుగు రాష్ట్రాలకు వాటా ఇవ్వక్కర్లేదు.. కేంద్రానికి నివేదించనున్న జల వనరుల శాఖ 13

'లిక్కర్' సొమ్ముతో దుబాయ్‌లో 'టెక్కర్'



ఏ9 కిరణ్ కుమార్ రెడ్డి

150 కోట్లకు పైగా తరలించిన ఏ9 కిరణ్ రెడ్డి

- ఎన్నికల ముందే హవాలా మార్గంలో విదేశాలకు
- 2024లో వైసీపీ ఓడిపోయాక దుబాయ్‌కి జంప్
- లిక్కర్ స్కామ్ నిందితుల్లో ఆరుగురు అక్కడే
- ట్రేడింగ్, ట్రక్, ట్రాన్స్‌పోర్ట్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు
- లండన్, నెదర్లాండ్స్, యూఏఈలోనూ ప్రారంభం
- సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేరు... తుతేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఆయన ఐఐటీ పట్టభద్రుడు. దుబాయ్, లండన్, నెదర్లాండ్స్, యూఏఈలో పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. ఐఐటియన్ కావడంతో బహుళ జాతి సంస్థల్లో పనిచేసి కోట్లాది రూపాయలు సంపాదించాడని అనుకుంటే తప్పులో కాలేసినట్టే! జగన్ పాలనలో జరిగిన మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో ఆయన ఏ9 నిందితుడు. కిరణ్ తన 'తెలివితేటల'ను సక్రమ మార్గంలో గాక, లిక్కర్ స్కామ్‌లో దోచుకోవడం, దాచుకోవడంలో చూపించాడు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో తన వాటాతో పాటు పెద్దలు దోచుకున్న సొమ్ములో కిరణ్ దాదాపు 150 కోట్ల రూపాయల వరకూ తరలించినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గుర్తించింది. హవాలా మార్గంలో

మిగతా 12వ పేజీలో...

పని ఉంది.. పది రోజుల్లో వస్తా..



- సిట్ విచారణకు సాయిరెడ్డి డుమ్మా
- శరత్‌చంద్రారెడ్డి, రోహిత్‌రెడ్డి కూడా గైర్హాజరు

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి అరెస్టు

- మాజీ పీఏ హత్య కేసులో వినుతతో పాటు ఆమె భర్త, మరో ముగ్గురు కూడా..
- అదుపులోకి తీసుకున్న తమిళనాడు పోలీసులు
- రేణిగుంటలో చంపి.. శవాన్ని చెన్నైలోని ఓ కాలువలో పడేసిన నిందితులు
- హత్యకు కారణాలపై పలు అనుమానాలు.. వినుతపై జనసేన బహిష్కరణ వేటు

12



వినుత, చంద్రబాబు దంపతుల మధ్యలో మాజీ పీఏ శ్రీనివాసులు (ఫైల్)



టీటీడీలో అన్యమత ఉద్యోగులు నిజమే!

- ఎంతమంది ఉన్నారో నివేదిక కోరాం.. సర్వీసు రూల్స్ ప్రకారం బదిలీపై నిర్ణయం
- ఆగస్టులో 1,014 దేవాలయాలకు పాలకవర్గాలు: దేవదాయ మంత్రి ఆనం 14

రెండో దశ భూ సమీకరణపై హడావుడి వద్దు

- సీఆర్‌డీఏకు సీఎం చంద్రబాబు సూచన.. రైతుల అభ్యంతరాలపై క్యాబినెట్‌లో చర్చ
- మొత్తం 44 వేల ఎకరాల్లో ఇప్పటికిప్పుడు 20 వేల ఎకరాల సమీకరణకు యోచన 13
- ప్రభుత్వ ప్రణాళికలపై రాజధాని రైతులకు అవగాహన కల్పించకపోవడంతోనే సమస్య

రాష్ట్రానికి మరో 39,602 కోట్ల పెట్టుబడులు 11

- 31,399 మందికి ఉద్యోగాలు.. తిరుపతిలో ఒకటి, విశాఖలో 2 స్టార్ హోటళ్లు
- రూ.12,682 కోట్లతో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు.. ఎస్ఐపీసీ భేటీలో ఓకే



వైసీపీ సమావేశం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు 12

గుడివాడలో హైటెన్షన్

- పేర్ని ఉన్మాద వ్యాఖ్యలపై ఫైర్.. వైసీపీ సమావేశం ముట్టడి
- పేర్ని నాని వస్తే నిలదీయాలని నిర్ణయించిన టీడీపీ కార్యకర్తలు
- మచిలీపట్నంలో నాని గృహ నిర్బంధం.. ఉద్రిక్తత నేపథ్యంలో కొడాలి డుమ్మా
- కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్ హారిక కారుపై దేశం శ్రేణుల దాడి.. పగిలిన అద్దాలు



2 నెలల క్రితమే పెళ్లి 3

సెల్ఫీ దిగుదామని చెప్పి.. భర్తను

నదిలో తోసిన భార్య

- బ్రిడ్జి నుంచి పడి వరదలో కొట్టుకెళ్లిన బాధితుడు
- రాళ్లపైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్న వైనం

భారత్‌పై సుంకాలు..

20% లోపే!

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం 9
- తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సన్నాహాలు
- బ్రిటన్ తర్వాత మనతోనే ఈ తరహా అవగాహన

ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న

ముస్లిం జనాభా

- 2010-20 మధ్య 25.6 శాతానికి 9
- 14.9 శాతానికి తగ్గిన హిందువుల జనాభా
- క్రైస్తవుల జనాభాలోనూ తగ్గుదల నమోదు
- ప్యూ రిసెర్చ్ సెంటర్ అధ్యయనంలో వెల్లడి

నీట్-యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల 9

21 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

WE LEAD, OTHERS FOLLOW

WITH TOP SPOT IN MNC JOB PLACEMENTS

KITS Group, encompassing **KKR & KSR Institute of Technology and Sciences** and **KITS Akshar Institute of Technology**, stands as a premier destination for transformative engineering education. Spearheaded by **visionary Chairman Mr. Koye Subba Rao**, the group was established in 2008 to provide world-class technical education rooted in excellence and accessibility. Leading the way in Engineering, building the nations' future.



689* PLACEMENTS OFFERS 2024-2025 (ONGOING)

HIGHEST PACKAGE **13.0** LPA

65* COMPANIES VISITED

Proud Placements with

HCL 77 | Infosys 57 | cognizant 64 | TATA STRIVE Right Skills Bright Future 70

CADSYS 54 | Deloitte. | amazon | movate | WinWire

IBM | divami | iOPEX | tcs TATA CONSULTANCY SERVICES | hackdiva accenture | WILEY EDGE

digit | Qualys. | vtiger | elitronics | SNOVASYS

and more..

Our World-Class Infrastructure

- Advanced labs & state-of-the-art computer centers
- Expert, experienced faculty
- Wi-Fi enabled campuses
- Smart classrooms
- Fully air-conditioned internet zones
- Digitized, well-stocked libraries
- Strategic MoUs for Training, Development & Top Placements
- Strong support for extracurriculars & sports
- Comfortable hostels for boys and girls
- Safe, efficient transport connectivity
- All essential amenities within campus





Our Prestigious Accreditations & Affiliations

- UGC **AUTONOMOUS** STATUS
- PRESTIGIOUS **NBA** ACCREDITATION
- GRADE **'A'** ACCREDITATION BY **NAAC**
- PERMANENT **AFFILIATION** WITH JNTUK, KAKINADA
- APPROVAL FROM **AICTE,** NEW DELHI

nirf-Innovation 151-300 Rank band | Institution's Innovation Council | MHRD | PMKVY | AAA Rating by CAREERS 360 | Google Cloud | wipro TalentNext

KITS COURSES

B.Tech: CSE | CSE (AI&ML) | CSE (DS) | IT | ECE | EEE
M.Tech: CSE (AI&ML) | CSE (DS) | ECE (VLSI)

KITS AKSHAR COURSES

B.Tech: CSE | CSE (AI & ML) | CSE (DS) | ECE | IT
M.Tech: CSE | ECE (VLSI) | MCA

KITS CAMPUS



KITS AKSHAR CAMPUS



KITS EDUCATIONAL INSTITUTIONS

For Details: 99517 13366, 99089 78444

KITS KKR & KSR Institute of Technology and Sciences AUTONOMOUS
Vinjanampadu, Vatticherukuru(M), Guntur.
Ph: 0863-22 866 66 / 77
www.kitsguntur.ac.in
/kitsguntur
EAPCET CODE **KITS** | PGCET CODE **KITS1**

KITS AKSHAR INSTITUTE OF TECHNOLOGY AUTONOMOUS
(Formerly Guntur Engineering College)
NH-16, Opp. Katuri Medical College, Yanamadala, Guntur.
Ph: 0863-22 888 86 / 87
www.kitsakshar.ac.in
/kitsakshar
EAPCET CODE **KITG** | PGCET CODE **KITG1**

GreenFMCAdvertising.com

DISCIPLINE – QUALITY EDUCATION – SKILL DEVELOPMENT – QUALITY PLACEMENT



అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లికి చెందిన భీముని గౌరినాయుడు, సంధ్య దంపతులు తమ కుమార్తె పూజిత తొలి పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక చెరువు గట్టుపై 30 కొబ్బరి మొక్కలు నాటారు.

గంజాయి నుంచి రాజ్మా వైపు!

- ఏజెన్సీలో మారుతున్న సాగు విధానం
- సీఎం పిలుపుతో గిరిజన రైతుల్లో మార్పు
- వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు చొరవ
- నిరుడు 90% రాయితీతో విత్తనాల పంపిణీ
- ఎకరాకు రూ.25 వేల నికర ఆదాయం
- ఈ ఏడాదీ రాయితీ విత్తనాల సరఫరాకు ఏర్పాట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సమాజానికి హానికరమైన గంజాయి సాగుకు స్వస్తి పలికి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్న సీఎం చంద్రబాబు పిలుపుతో ఉత్తరాంధ్ర ఏజెన్సీ ప్రాంత రైతుల్లో పెనుమార్పు వచ్చింది. అల్లూరి జిల్లా పాడేరు ప్రాంతంలో నిరుడు గిరిజన రైతులు గంజాయికి బదులు రాజ్మా పంట సాగు చేసి, ఆర్థికాభివృద్ధి సాధించారు. ఈ ఏడాదీ రాజ్మా సాగు చేయడానికి ఏజెన్సీ ప్రాంత రైతులు ఉత్సాహం చూపుతున్నారు. రాయితీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో గంజాయి పంట విస్తారంగా సాగైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపడంతో గత ఏడాది నుంచి ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు గణనీయంగా తగ్గింది. దాని స్థానంలో రాజ్మా పంటను గిరిజనులు పండించడం ప్రారంభించారు. నిరుడు 22,500 ఎకరాల్లో రాజ్మా సాగు ద్వారా పొందిన దిగుబడి నికర ఆదాయ విలువ రూ.56.25కోట్లుగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో గిరిజన రైతులకు గత ప్రభుత్వంలో కొందరు డబ్బు ఆశ చూపి గంజాయి సాగుకు ఊతమిచ్చారు. దానివల్ల ఏజెన్సీ ప్రాంత పరువుకు విఘాతం కలుగుతుండటంతో గిరిజన రైతుల ఆలోచన విధానంలో మార్పు వస్తోంది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు రంగంలోకి దిగారు. శాస్త్రవేత్తలు, ఐటీడీఏ, క్షేత్రస్థాయి అధికారులతో అక్కడి నీటి వనరులు, వాతావరణ పరిస్థితులు, పంటల సాగుకు అనుకూలత అంశాలపై నివేదికలు తీసుకుని, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు చేస్తున్నారు. రాజ్మా పంట సాగుకు పూర్తి అనుకూలమైన పాడేరు డివిజన్‌లో 90శాతం రాయితీపై రాజ్మా విత్తనాలను పంపిణీ చేయించారు. గతేడాది రూ.6.11కోట్ల రాయితీతో 4,500 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలను 35,618 మంది రైతులకు అందించగా, 22,500 ఎకరాల్లో సాగు చేశారు. సాధారణంగా రాజ్మా ఖరీఫ్ చివరలో సెప్టెంబరులో వర్షాధారంగా పండించే అపరాల పంట. దీనిని కొన్ని ప్రాంతాల్లో ఫ్రెంచి చిక్కుడు అంటారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు అటవీ హక్కులున్న భూముల్లో రబీ పంటగా దీన్ని సాగు చేస్తారు. అధిక వర్షాన్ని తట్టుకోలేని ఈ పంటను నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోనే సెప్టెంబరు నుంచి సాగు చేస్తారు. డిసెంబరులో ఈ పంట కోతకకు వస్తుంది. హెక్టారుకు 9-10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రాజ్మా ఉత్పత్తికి అంతర్జాతీయంగా మంచి గిరాకీ ఉంది. మార్కెట్‌లో కిలో రూ.100దాకా పలుకుతోంది. గిరిజనులు దీనిని స్థానికంగా సంతల్లో అమ్ముతున్నారు. పంట ఉత్పత్తిలో 60శాతం ఉత్తర భారతదేశానికి ఎగుమతి అవుతోంది. విత్తన రాయితీ, మంచి ధర రావడం వల్ల ఎకరానికి రూ.25వేల నికర ఆదాయం వచ్చిందని అక్కడి రైతులు చెప్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా 4,900 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలను 90% రాయితీపై పాడేరు ప్రాంత గిరిజన రైతులకు వచ్చే నెల మొదటి వారంలోగా సరఫరా చేయనున్నట్లు డిల్లీరావు తెలిపారు. గంజాయి అనర్థాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించి, రాజ్మా సాగును ప్రోత్సహించిన అల్లూరి జిల్లా వ్యవసాయశాఖ సిబ్బందిని ఆయన అభినందించారు.

సెల్ఫీ దిగుదామని చెప్పి.. భర్తను కృష్ణా నదిలో తోసిన భార్య

2 నెలల క్రితమే పెళ్లి

- బ్రిడ్జిపై నుంచి పడి నీళ్లలో కొట్టుకెళ్లిన యువకుడు
- రాళ్లపైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్న బాధితుడు




తాతయ్య, సుమంగళ

కృష్ణ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దేవసూగూరు గ్రామానికి చెందిన తాతయ్యకు రెండు నెలల క్రితం లింగసూగూరుకు చెందిన సుమంగళతో వివాహమైంది. దంపతులు ద్విచక్ర వాహనంపై లింగసూగూరు నుంచి శనివారం ఉదయం దేవసూగూరు గ్రామానికి బయలుదేరాడు. రాయచూర్ జిల్లా కడలూరు గ్రామ శివారులోని కృష్ణానదిపై ఉన్న గుర్జాపూర్ రోడ్ కం బ్యారేజ్ వద్దకు రాగానే సెల్ఫీ దిగుదామని సుమంగళ కోరింది. దీంతో బైక్ ఆపి సెల్ఫీ దిగుతుండగా భర్తను నదిలోకి తోసింది. ఉధృతంగా పారుతున్న నీటిలో కొట్టుకుపోయిన తాతయ్యకు అదృష్టవశాత్తు నదిలో పెద్ద బండరాళ్లు కనిపించాయి. దీంతో అతను అటువైపు ఈదుతూ వెళ్లి ఆ రాళ్లపై నిలబడి సహాయం కోసం కేకలు వేశాడు. దీంతో బ్రిడ్జిపై వెళుతున్న యువకులు అతన్ని గమనించారు. సుమారు 100 మీటర్ల దూరంలో నది మధ్యలో రాళ్లపై ఉన్న తాతయ్యకు అందేలా బ్రిడ్జిపై నుంచి తాడు వేశారు. ఆ తాడును అతను నడుముకు కట్టుకోగా.. యువకులు బ్రిడ్జి పైకి లాగి రక్షించారు. సెల్ఫీ పేరిట భార్య చేసిన అఘాయిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. సెల్ఫీ దిగుదామని అనడంతో..భార్య తనను చంపడానికి సిద్ధంగా ఉందని అప్పటికే అనుమానం వచ్చిందని తాతయ్య ఆవేదన వ్యక్తంచేశాడు. ఆమె మాత్రం ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడని చెబుతోంది. ఈ ఘటన అనంతరం దంపతులు బైక్‌పై దేవసూగూరుకు వెళ్లిపోయారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందంటే అధికారుల్లోనూ ఈ భయం ఏర్పడింది. ఫలితంగా వారు చురుగ్గా వ్యవహరించలేకపోతున్నారు. జగన్ హయాంలో వలె ఇప్పుడు గుడ్డిగా పై నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే తాము టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతోనే అధికారులు అతి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టు రాలేదన్న అభిప్రాయం ఏర్పడుతోంది. అధికారుల్లో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి. ఏ ఉద్దేశంతో తమది మంచి ప్రభుత్వం అని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించుకున్నారో గానీ అధికార యంత్రాంగం సహాయ నిరాకరణ వల్ల మంచి ప్రభుత్వం నినాదం కాస్తా మెతక ప్రభుత్వం అన్న అభిప్రాయంగా మారిపోయింది! రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా? లేక జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నారా? అని తెలుగుదేశం కార్యకర్తలు ప్రశ్నించే వరకు పరిస్థితి వెళ్లింది.

భయమే జగన్ పెట్టుబడి!

పరామర్శల పేరిట ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జరుపుతున్న పర్యటనలు ఎందుకు వివాదాస్పదం అవుతున్నాయి? పరామర్శలతో బాధితులకు సాంత్వన కలిగించాలి గానీ బలప్రదర్శన జరపడం ఏమిటి? పరామర్శల పేరిట జగన్‌రెడ్డి బయలుదేరినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు ఉద్రిక్తతలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయి? పరామర్శ యాత్రలలో వైసీపీ కార్యకర్తలు, అభిమానులు అతిగా ఆవేశపడటం దేనికి సంకేతం? ఇంతకీ ఈ బలప్రదర్శనలు జగన్‌రెడ్డి బలుపా? వాపా? రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది మాత్రమే అయింది. ఇంతలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అంత వ్యతిరేకత ఏర్పడుతుందా? ఒకవేళ ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడినా ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. మరి ఇప్పటి నుంచే 'సీఎం సీఎం' అని కార్యకర్తలు, అభిమానులతో నినాదాలు ఇప్పించుకోవడం వల్ల జగన్‌రెడ్డి వెంటనే ముఖ్యమంత్రి అయిపోరు కదా? జగన్ పరామర్శ యాత్రలకు వస్తున్న జనం బలుపునకు సంకేతమని ఆయన మద్దతుదారులు సంబరపడిపోతుండగా, అదంతా వాపేనని, ఒక పథకం ప్రకారం కార్యకర్తలు, అభిమానులను పోగేసి గొడవ చేయిస్తున్నారని కూటమి నేతలు భావిస్తున్నారు. జగన్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేనివారు తమకు తోచిన విశ్లేషణలు చేస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అనూహ్య పరాజయాన్ని చవిచూసిన ఆయన తేరుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన తెలుగుదేశం పార్టీ కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. కొవిడ్ కూడా వచ్చి పడటంతో 2022 వరకు తెలుగుదేశం నాయకులు బయటకు రాలేదు. దానికితోడు ప్రభుత్వం వేధింపులు పెరిగిపోవడంతో ప్రతిపక్షాలు కకావికలం అయ్యాయి. తెలుగుదేశం నాయకులు పలువురు కలుగుల్లో దూరిపోయారు. దీంతో ఆ పార్టీ బలహీనత జగన్‌రెడ్డికి తెలిసిపోయింది. ప్రతిపక్షం నుంచి చెప్పుకోదగిన ప్రతిఘటన ఎదురుకాకపోవడంతో అంతా సవ్యంగా ఉందని జగన్ అండ్ కో భావించారు. ఫలితమే గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడం. తెలుగుదేశం నాయకుల బలహీనతలను గుర్తించిన జగన్‌రెడ్డి.. ఓటమి నుంచి కోలుకొని ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అధికార పక్షానికి కంటి మీద కునుకు లేకుండా చేయడం కోసం వ్యూహ రచన చేసుకున్నారు. ఫలితమే పరామర్శల సందర్భంగా కార్యకర్తలతో హడావిడి చేయడం. నాలుగేళ్ల తర్వాత జరిగే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే హడావిడి ఎందుకు? అన్న అనుమానం కలగడం సహజం. జగన్‌రెడ్డి తెలివితక్కువవాడు కాదు. రాజకీయంగా ఆయన ఎత్తుగడలు ప్రత్యేకంగా ఉంటాయి. నాలుగేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామన్న భరోసా, ఆత్మస్థైర్యాన్ని కార్యకర్తలు, అభిమానుల్లో నింపడం ప్రధాన ఉద్దేశం అయినప్పటికీ మరో లక్ష్యం కూడా ఇందులో ఉంది. కార్యకర్తల్లో భరోసా కల్పించడానికి మళ్లీ అధికారంలోకి వస్తామని ఏ రాజకీయ పార్టీ అయినా ప్రచారం చేసుకోవడం సహజం. జగన్‌రెడ్డి ఆలోచనలు మాత్రం అంతటితో ఆగిపోవు. ప్రతిపక్షంలో ఉండి కూడా అధికారపక్షాన్ని భయపెట్టడానికి ఆయన వినూత్న ఎత్తుగడలు ఎంచుకున్నారు. తెలుగునాట రాజకీయాలు ఇదివరకులా లేవు. ప్రతిపక్షంలో మనుగడ సాగించడం కష్టతరంగా మారింది. ఈ కారణంగానే 11 సీట్లకు మాత్రమే పరిమితమైనా అధికారపక్షంలో ఉన్న వారిని భయపెట్టే మార్గాన్ని జగన్‌రెడ్డి ఎంచుకున్నారు. ఆయన ఐదేళ్ల పాలనను చూసిన ప్రజలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఆయనంటే వణుకు ఏర్పడింది. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే? అన్న భయం సామాన్య ప్రజల నుంచి వివిధ స్థాయిల్లో ఉన్నవారిలో ఏర్పడింది. ఇది గమనించిన జగన్‌రెడ్డి భయపెట్టడాన్నే నమ్ముకున్నారు. ముందుగా సొంత పార్టీ కార్యకర్తల్లో భవిష్యత్తుపై నమ్మకం కలిగించడం ఎలా? ఆ తర్వాత అధికార కూటమి నాయకులు తన జోలికి, తమ వాళ్ల జోలికీ రాకుండా చేయడం ఎలా? అన్న దానిపై కసరత్తు చేశారు. ఈ కసరత్తు నుంచే భయపెట్టాలి అన్న ఆలోచన వచ్చింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తాడంటారా? అన్న ప్రశ్న ప్రతి ఇద్దరిలో ఒకరి నుంచి వస్తోంది. ఆయన మళ్లీ గెలిస్తే పరిస్థితి ఏమిటి? అన్న భయం కూడా వారిలో వ్యక్తమవుతోంది. రాజకీయాలతో సంబంధం లేనివారిలో అలాంటి భయాందోళనలు ఉంటే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నేతల్లో కూడా ఇలాంటి భయాందోళనలు ఉండటం ఆశ్చర్యంగా ఉంది. దీన్నిబట్టి జగన్‌రెడ్డి ఎత్తుగడ ఫలించినట్టే కదా! పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందంటే అధికారుల్లోనూ ఈ భయం ఏర్పడింది. ఫలితంగా వారు చురుగ్గా వ్యవహరించలేకపోతున్నారు. జగన్ హయాంలో వలె ఇప్పుడు గుడ్డిగా పై నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే తాము టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతోనే అధికారులు అతి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టు రాలేదన్న అభిప్రాయం ఏర్పడుతోంది. అధికారుల్లో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి. ఏ ఉద్దేశంతో తమది మంచి ప్రభుత్వం అని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించుకున్నారో గానీ అధికార యంత్రాంగం సహాయ నిరాకరణ వల్ల మంచి ప్రభుత్వం నినాదం కాస్తా మెతక ప్రభుత్వం అన్న అభిప్రాయంగా మారిపోయింది! రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా? లేక జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నారా? అని తెలుగుదేశం కార్యకర్తలు ప్రశ్నించే వరకు పరిస్థితి వెళ్లింది. అంటే, జగన్‌రెడ్డి ఎత్తుగడ సక్సెస్ అయినట్టే కదా? అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో, అది కూడా 11 సీట్లకు పరిమితమై కూడా భయపెట్టగలగడం ఆయన ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఈ పరిస్థితి ఏర్పడటం వింతగా ఉంది. అధికారంలో ఉండి కూడా భయం నీడలో బతకడం ఆశ్చర్యంగా ఉంది. ఈ భయం కారణంగా చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ వంటి వారిని మినహాయిస్తే, మిగతా నాయకులు ప్రస్తుతానికి అధికారం అనుభవిద్దాం, 2029 తర్వాత ఏం జరిగినా మనం సేఫ్‌గా ఉందాం అన్న ధోరణిని అలవర్చుకుంటున్నారు. భయపెట్టే ప్లాన్ సత్ఫలితాలు ఇస్తుండటంతో జగన్ అండ్ కో మరింతగా రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలోనే రప్పా రప్పా నరుకుతాం అన్న నినాదాన్ని అందుకున్నారు. వైసీపీ నాయకుల నుంచి కార్యకర్తల వరకు ఇప్పుడు ఈ పదాలే ఫ్యాషన్ అయ్యాయి. మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదంటూ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జగన్‌రెడ్డి చేపట్టిన తాజా పరామర్శ యాత్రలో కొంత మంది కార్యకర్తలు.. పోలీసు అధికారుల చేతులు నరుకుతామని హెచ్చరికలు చేశారు. పనిలో పనిగా 'ఆంధ్రజ్యోతి' ఫొటో గ్రాఫర్‌పై దాడి చేశారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా దాడులు చేయగలమని రుజువు చేసుకుంటున్నారు. పోలీసుల చేతులు నరుకుతామని రంకెలు వేసినవారు స్వేచ్ఛగా తిరగడం దేనికి సంకేతం? మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా ప్రతిపక్షంలో ఉండి కూడా ఇటు అధికారులను, అధికార పార్టీ నాయకులను భయపెట్టడంతో పాటు మరోవైపు మీడియాపై దాడులకు తెగబడుతున్న జగన్ అండ్ కో.. కూటమి ప్రభుత్వమే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని నిందిస్తున్నారు. కూటమి నాయకులు ఉత్తుత్తి ప్రకటనలు చేస్తుండగా ప్రతిపక్ష వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేసి చూపిస్తున్నారు.


భయం ఆసరాగా విజృంభణ

పిరికితనం అనేది తెలుగుదేశం పార్టీ నాయకుల డీఎన్‌ఏలోనే ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచీ ఇదే పరిస్థితి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటాలు చేయాలంటే భయం. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకైనా మంచిదని అవతలి పక్షంతో లాలూచీ పడటం పరిపాటి అయింది. క్రిమినల్ సైకాలజీలో ఆరితేరినవారు ముందుగా ప్రత్యర్థుల బలహీనతలను అధ్యయనం చేస్తారు. ఆ తర్వాత ఎవరిని ఎలా లొంగదీసుకోవాలో స్కెచ్ వేసి అమలుచేస్తారు. ఈ క్రమంలోనే జగన్ అండ్ కో తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు, మంత్రులలో గూడుకట్టుకుని ఉన్న భయాన్ని ఆసరాగా చేసుకొని విజృంభిస్తున్నారు. జనసైనికులు కూడా సోషల్ మీడియాలో ఉన్నంత చురుగ్గా క్షేత్ర స్థాయిలో ఉండటం లేదు. భారతీయ జనతా పార్టీ టచ్ మీ నాట్ అన్నట్టే ఉంటోంది. స్థూలంగా కూటమి పరిస్థితి ఇది. ఫలితంగా జగన్‌రెడ్డి పరామర్శ యాత్రలు సంచలనం అవుతున్నాయి. నిజానికి జగన్‌రెడ్డిది బలుపు కాదు.. వాపు మాత్రమే. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటే రోడ్ల మీదకు వచ్చి నరుకుతాం.. చంపుతాం అని రంకెలు వేయరు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభల్లో ఇలాంటి నినాదాలు వినపడలేదే? ఎన్నికల వరకు సైలెంట్‌గా ఉండే జనం పోలింగ్ రోజు బ్యాలెట్ పెట్టెల్లో మాత్రమే తమ అంతరంగాన్ని ఆవిష్కరిస్తారు. తెలంగాణలో కేసీఆర్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. 2024కు ముందు జగన్‌రెడ్డి పట్ల ఈ స్థాయిలో వ్యతిరేకత ఉందని తలపండిన రాజకీయ విశ్లేషకులు, సెఫాలజిస్టులు కూడా పసిగట్టలేకపోయారు. ఇప్పుడు జగన్ పర్యటనల్లో కనిపిస్తున్న హడావిడి 2024కు ముందు చంద్రబాబు సభల వద్ద కనిపించలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి సభల వద్ద కూడా ఈ హడావిడి ఉండేది కాదు. ఇప్పుడే ఎందుకు? కార్యకర్తలు, అభిమానులు మొదటిసారి జగన్‌ను చూస్తున్నారా అంటే అదేమీ కాదు. 2019కి ముందు పాదయాత్రల పేరిట నెలల తరబడి ఆయన జనంలోనే ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయి ఏడాది తిరగకముందే జగన్ పట్ల జనంలో ఎందుకు క్రేజ్ ఏర్పడుతుంది? తాము పిచ్చి పిచ్చిగా అభిమానించే నాయకుడు ఓడిపోయాడనే బాధ ఉంటే ఉండవచ్చు. అలాంటివారు ఇలా రెచ్చిపోయి నరుకుతామంటూ హెచ్చరికలు చేయరు. తమ నాయకుడికి సంఘీభావం చెప్పడానికి మాత్రమే బయటకు వస్తారు. పదిహేనేళ్లుగా రాజకీయాల్లో, అది కూడా జనాల్లో కలియదిరిగిన ఏ నాయకుడికైనా సినిమా స్టార్‌లాగా క్రేజ్ ఉండటం అసహజంగా అనిపించడం లేదా? పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ కూడబలుక్కున్నట్టుగా అధికారంలోకి వచ్చాక నరుకుతాం, చంపుతాం, సినిమా చూపిస్తాం అని హెచ్చరికలు చేయడం వెనుక కచ్చితంగా పకడ్బందీ వ్యూహమే ఉంది. జగన్‌రెడ్డి పాలనలో గ్రామస్థాయిలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు అనేక వేధింపులకు గురయ్యారు. కేసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు వారందరూ ప్రతీకారం తీర్చుకోవాలని కోరుకోవడం సహజం. ఈ కారణంగానే కింది స్థాయిలో తమ పార్టీ కార్యకర్తల జోలికి రావాలంటే భయపడే పరిస్థితిని కల్పించాలని జగన్‌రెడ్డి వ్యూహ రచన చేసినట్టుగా ఉంది. ఈ క్రమంలోనే అవతలి పక్షాన్ని ముందుగానే భయపెట్టడం అనే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాధలు పడిన కార్యకర్తల గోడును ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం గురించి ఇది వరకే చెప్పుకొన్నాం.

> **పదిహేనేళ్లుగా రాజకీయాల్లో, అది కూడా జనాల్లో కలియదిరిగిన ఏ నాయకుడికైనా సినిమా స్టార్‌లాగా క్రేజ్ ఉండటం అసహజంగా అనిపించడం లేదా? పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ కూడబలుక్కున్నట్టుగా అధికారంలోకి వచ్చాక నరుకుతాం, చంపుతాం, సినిమా చూపిస్తాం అని హెచ్చరికలు చేయడం వెనుక కచ్చితంగా పకడ్బందీ వ్యూహమే ఉంది.**

జగన్‌రెడ్డి చూపిస్తున్న వాపును చూసి కూటమి నాయకులు, కార్యకర్తలు భయపడే పరిస్థితి ఏర్పడింది. నిజంగా జగన్‌రెడ్డి బలపడ్డారా? అని ఆరా తీస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తమపై అధికారాన్ని ప్రయోగించకుండా కూటమిని కట్టడి చేయడంలో జగన్ అండ్ కో సఫలం అవుతున్నారు. పరామర్శ యాత్రల సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడ దాక్కుంటున్నారో కూడా తెలియదు. ప్రతిపక్ష నాయకుడికి వ్యతిరేకంగా కనీసం ప్రకటనలు చేయడానికి కూడా వారు సిద్ధపడటం లేదు. అంటే జగన్ జోలికి ఎవరూ రాకుండా కట్టడి చేయడానికి స్టెరాయిడ్స్ మాదిరిగా పరామర్శ యాత్రలను బలప్రదర్శన యాత్రలుగా మార్చుకుంటున్నారు. అధికార కూటమి నాయకులు, కార్యకర్తల్లో భయం నెలకొల్పిన జగన్ అండ్ కో ఇప్పుడు మీడియాను కూడా టార్గెట్‌గా ఎంచుకోబోతున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని శుక్రవారం నాడు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. చీకట్లో కన్ను కొట్టగానే పనై పోవాలి గానీ రప్పా రప్పా అంటూ గోల చేయడం ఏమిటి? మన శత్రువులను చెప్పకుండా వేసేయాలి అని పేర్ని నాని కార్యకర్తలను పరోక్షంగా రెచ్చగొడుతున్నారు. కార్మిక సంఘాల నాయకుడిగా, రాజకీయ నాయకుడిగా లబ్ధ ప్రతిష్ఠుడైన పేర్ని కృష్ణమూర్తి కుమారుడైన పేర్ని నాని ఇలా మాట్లాడటం శోచనీయం. సహవాస దోషం కాబోలు. అధికారంలోకి వస్తే నరుకుతామని వాగడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉందని, నరుకుదామనుకున్న వారిని చెప్పకుండానే నరకాలని, చీకట్లోనే పనైపోవాలని టిప్స్ ఇచ్చే స్థాయికి ఆయన దిగజారారు. తాజాగా జగన్‌ను వ్యతిరేకించే మీడియాను కూడా ముక్కలు ముక్కలుగా నరకాలని ఆయన కార్యకర్తలకు నూరి పోస్తున్నారు.

> **జగన్‌రెడ్డి పాలనలో గ్రామస్థాయిలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు అనేక వేధింపులకు గురయ్యారు. కేసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు వారందరూ ప్రతీకారం తీర్చుకోవాలని కోరుకోవడం సహజం. ఈ కారణంగానే కింది స్థాయిలో తమ పార్టీ కార్యకర్తల జోలికి రావాలంటే భయపడే పరిస్థితిని కల్పించాలని జగన్‌రెడ్డి వ్యూహ రచన చేసినట్టుగా ఉంది. ఈ క్రమంలోనే అవతలి పక్షాన్ని ముందుగానే భయపెట్టడం అనే వ్యూహాన్ని అమలుచేస్తున్నారు. ఫలితంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాధలుపడిన కార్యకర్తల గోడును ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. జగన్‌రెడ్డి చూపిస్తున్న వాపును చూసి కూటమి నాయకులు, కార్యకర్తలు భయపడే పరిస్థితి ఏర్పడింది. నిజంగా జగన్‌రెడ్డి బలపడ్డారా? అని ఆరా తీస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరామర్శ యాత్రల సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడ దాక్కుంటున్నారో కూడా తెలియదు. ప్రతిపక్ష నాయకుడికి వ్యతిరేకంగా కనీసం ప్రకటనలు చేయడానికి కూడా వారు సిద్ధపడటం లేదు.**



సరికొత్త దుస్సంప్రదాయం!


మీడియాను టార్గెట్‌గా ఎంచుకోవడంలో ఎవరికి ఎవరు ఆదర్శమో తెలియదు గానీ భారత రాష్ట్ర సమితి–వైసీపీలు అవిభక్త కవలలుగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రత్యర్థులతో తలపడాలి కానీ మీడియాను తమ ప్రత్యర్థులుగా ప్రకటించుకోవడాన్ని ఇప్పుడే చూస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక మీడియా సంస్థలు ఆయా ప్రభుత్వాలకు మద్దతునివ్వడం, విమర్శించడం చూశాం. తమ ప్రభుత్వాన్ని విమర్శించే మీడియాను ఇప్పటిలాగా రాజకీయ ప్రత్యర్థిగా ఎవరూ ప్రకటించలేదు. అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి అనేక పత్రికలు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని వ్యతిరేకించాయి. అప్పుడు ప్రభుత్వపరంగా సదరు పత్రికలకు ఇబ్బందులు సృష్టించారు గానీ ఆయా పత్రికల యాజమాన్యాలు, సిబ్బందిని ఇందిరాగాంధీ తన రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ధోరణికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి మీడియాను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నారు. తెలంగాణ శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన కొందరు సభ్యులు ప్రమాణస్వీకారం సందర్భంగా ఇబ్బంది పడటాన్ని 'ఏబీఎన్–ఆంధ్రజ్యోతి' చానల్ హేళన చేయకపోయినా చేసినట్టు ప్రచారం చేసి తెలంగాణలో చానల్ ప్రసారాన్ని అడ్డుకున్నారు. 2024 ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి కూడా ఎంపిక చేసిన కొన్ని మీడియా సంస్థలను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నారు. ఈ పని కేసీఆర్ చేసినా, జగన్‌రెడ్డి చేసినా అది వారి బలహీనతకు నిదర్శనం. ఈ ఇరువురు నాయకులకూ సొంత మీడియా సంస్థలు ఉన్నాయి. అధికారం కోల్పోగానే ప్రభుత్వాలపై వారి మీడియా సంస్థలు ఎంత దారుణంగా దుష్ప్రచారం చేస్తున్నాయో చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో 2014–19 మధ్య కాలంలోను, 2024 నుంచి నేటి వరకు జగన్ మీడియా కూటమి ప్రభుత్వంపై ఎంతలా విరుచుకుపడుతున్నదో చూస్తున్నాం. తెలంగాణలో కేసీఆర్ మీడియాదీ అదే ధోరణి. తమ దారికి రాని మీడియా సంస్థలకు ప్రభుత్వపరంగా ప్రకటనలు నిలిపివేయడం గతంలోనూ జరిగింది. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, జగన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' సంస్థకు పైసా ప్రకటన కూడా ఇవ్వలేదు. అయినా వాటిని మేం ఖాతరు చేయలేదు. ఇప్పుడు అంతటితో ఆగకుండా మీడియాపై దాడులు చేయాలన్న నిర్ణయానికి కూడా రావడం ఆశ్చర్యంగా ఉంది. ఈ ధోరణి సమర్థనీయం అయితే కేసీఆర్, జగన్‌రెడ్డి మీడియాలపై ఏ స్థాయిలో దాడులు చేయాలి? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా కేసీఆర్ మీడియాపై దూకుడు ప్రదర్శించలేదు. అధికారంలో ఉన్నవారు దాడులు చేయించాలనుకుంటే ఆపేది ఎవరు? ఆంధ్రప్రదేశ్‌లో కూడా జగన్‌రెడ్డి మీడియాపై కూటమి నేతలు దాడులు చేయించి, సిబ్బందిని కొట్టడం వంటి చర్యలకు పాల్పడలేదు. విచిత్రంగా ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ, బీఆర్ఎస్ నాయకులే దాడుల గురించి మాట్లాడుతున్నారు. మీడియాపై ఆధారపడి రాజకీయాలు చేసేవారు బలమైన నాయకులు కాలేరు. 2023 ఎన్నికలకు ముందు 'ఆంధ్రజ్యోతి' మినహా మిగతా మీడియా అంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని తలపై పెట్టుకొని మోసింది. అయినా ఎన్నికల్లో ఆయనను ప్రజలు తిరస్కరించారు. రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని ఎందుకు గుర్తించడం లేదో? ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు అనుకూలంగా ఆయన మీడియా ఎంత ప్రచారం చేసినా ఓటమిని తప్పించుకోలేకపోయారు కదా? ఇప్పుడు మీడియాపై దాడులు చేయాలనుకుంటున్నవారు అలా చేస్తే ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరుగుతుందని గుర్తించలేకపోవడం విషాదం. అటు జగన్ మీడియాకు, ఇటు కేసీఆర్ మీడియాకు నేను ఒక ముడిసరుకుగా మారాను. దాదాపు పదిహేను సంవత్సరాలుగా ఈ ఇరువురి మీడియా సంస్థలు నాపై పుంఖాను పుంఖాలుగా వార్తలు వండి వడ్డించాయి. అయినా ఇటు తెలంగాణలో గానీ, అటు ఆంధ్రప్రదేశ్‌లో గానీ మా సంస్థను ప్రజల నుంచి దూరం చేయలేకపోయారు. తెలంగాణలో కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ప్రత్యర్థులు. అయినా కేసీఆర్, జగన్‌రెడ్డిలు ఆ ఇరువురి కంటే నన్నే ప్రధాన ప్రత్యర్థిగా పరిగణిస్తున్నారు. ఒక జర్నలిస్టుగా ఇందుకు నేను గర్విస్తున్నాను. ఎక్కడో నిజామాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామంలో పుట్టి పెరిగిన నేను కేసీఆర్–జగన్‌కు టార్గెట్ అయ్యే స్థాయికి ఎదగడం నా మటుకు నాకు గర్వకారణం. మా సంస్థలకు దురుద్దేశాలు ఆపాదించాలని ఎంతగా ప్రయత్నించినా మాకు ఉన్న విశ్వసనీయత మిగిలే ఉంది. నన్ను రాజకీయ ప్రత్యర్థిగా టార్గెట్ చేసుకున్నంత మాత్రాన ప్రజాక్షేత్రంలో వారి బలం పెరగదు. తమ చర్యల ద్వారా నన్ను పెంచుతూ తమను తాము తక్కువ చేసుకుంటున్న వాస్తవాన్ని కేసీఆర్, జగన్‌రెడ్డి గుర్తిస్తే వారికే మంచిది. కొంత మంది రాజకీయ మరుగుజ్జులు, విదూషకులు చేసే ప్రకటనలకు స్పందించవద్దని, అలా చేస్తే వారి స్థాయి పెరుగుతుందని భారత రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ముఖ్యులు నాకు సలహా కూడా ఇచ్చారు. ఈ సలహాను పాటించాలనే నేను నిర్ణయించుకున్నాను. తమకు వ్యతిరేకంగా ఉంటున్న మీడియా సంస్థలను ముక్కలు ముక్కలుగా చేయాలని కార్యకర్తలను పేర్ని నాని వంటి వారు రెచ్చగొట్టినంత మాత్రాన భయపడేంత బలహీనంగా మీడియా సంస్థలు ఉండవు. తాత్కాలికంగా ఇబ్బందులు ఏర్పడినా తట్టుకోగలవు. దుష్ట సంప్రదాయాలను నెలకొల్పాలనుకుంటే అవి రేపటి రోజున మనల్నే మింగేస్తాయి అని ఇలాంటి వారు గుర్తుంచుకోవాలి!

మన వీధికి వచ్చిన నాటకం

సాంస్కృతిక దార్శనికుడు బాదల్ సర్కార్. నాటకం అంటే పుక్కిటి పురాణం కాదనీ, జనజీవన ప్రతిబింబమని నమ్మిన బాదల్ సర్కార్ భారతీయ రంగస్థలాన్ని విప్లవీకరించారు. అభివ్యక్తికి ఒక మౌలిక లక్ష్యం నిర్దేశించారు. అసమానతల గోడల్ని కూల్చడం కోసమే కళ అంటూ నినదించారు. ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితమైన రంగస్థలానికి స్వేచ్ఛను ప్రసాదించి, ప్రజా రంగస్థలంగా మలిచారు. కల్పిత కథలు, నిజ జీవితంతో సంబంధం లేని పాత్రలను కాలదన్ని పీడిత ప్రజలకు అండనిచ్చే హృద్యమైన మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు. నాటక ప్రయోక్తగా ఎన్నో భిన్నమైన ప్రయోగాలు చేశారు. సగటు మనిషి ప్రసక్తి లేని పౌరాణిక నాటకాన్ని, కులీన వర్గానికి మాత్రమే నవీన నాటకం రెంటినీ అధిగమించి మొట్టమొదటిసారిగా సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించారు. అందుకే ప్రపంచ రంగస్థలం ఆయన్ని 'ఫాదర్ ఆఫ్ థర్డ్ థియేటర్'గా గౌరవిస్తోంది.

జూలై 15, 1925న కలకత్తాలో సుధీంద్ర సర్కార్‌గా పుట్టిన బాదల్ ఇంజనీరింగ్ చదివారు. ఇంగ్లాండ్, నైజీరియా మొదలైన దేశాలలో ఉద్యోగాలు చేశారు. యాభై వరకు నాటకాలు రచించిన బాదల్ సర్కార్ భారతదేశంలో పీడిత ప్రజల పక్షాన ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని లోతుగా అధ్యయనం చేసిన మొదటి వ్యక్తి. సంప్రదాయక నాటక రంగాన్ని కాదని సమిష్టి కృషితోనే కళ సంపూర్ణ వికాసం పొందుతుందని ఆయన నిరూపించారు. అందుకే, నాటక ప్రదర్శనకి ఆయన సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ప్రదర్శనశాలలకు పరిమితమైన నాటకాన్ని ఏకంగా నాలుగు వీధుల కూడలిలోకి తీసుకువచ్చి మొదటిసారిగా 'వీధి నాటకాన్ని' నిర్మించారు. భారతీయ రంగస్థల చరిత్రలో అదో అసాధారణ విప్లవం. నాటకం అంటే గంటలకొద్దీ సాగే కథనం కాదని, అది ఒక నిరంతర చైతన్య ప్రవాహమని బాదల్ చాటారు. వీధి నాటకాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు. ఆ ప్రక్రియలో నిత్య ప్రయోగశీలిగా నిలిచారు. ఈనాటికి కూడా స్ట్రీట్ ప్లే (వీధి నాటకం), అది ఏ ప్రాంతంలో, ఏ స్థాయిలో ప్రదర్శితమౌతున్నా దానికి ఆద్యుడు మాత్రం బాదల్ సర్కారే.

> **బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే సమాజంలో భాగం, జీవితానికి ప్రతిబింబం, సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలని ఆయన విశ్వసించారు. సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించి మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు.**



బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే జీవితాన్ని వినూత్నంగా దర్శింపజేసే విశిష్టమైన కళాత్మక సాధనం. అదేదో అలౌకికమైనది కాదు. సమాజంలో భాగం. జీవితానికి ప్రతిబింబం. సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలి. అందుకే, అసలు వీధి నాటకం కళే కాదన్న వారికి దీటుగా జవాబిస్తూ, 'ప్రధాన స్రవంతి నాటకం ఆధిపత్య రూపమైతే, ప్రత్యామ్నాయ నాటకం మార్పుకు మాధ్యమం' అని బాదల్ నిరూపించారు. నక్సల్బరి ప్రభావితులయిన సగటు బెంగాల్ యువత సంక్లిష్ట మనస్తత్వాన్ని చిత్రించే అనేక విలువైన నాటక రచనలు బాదల్ చేశారు. 'అవర్ స్ట్రీట్ థియేటర్ (మన వీధి నాటకం) అన్న తన పుస్తకంలో పాలకుల నిర్బంధంలో వీధినాటకం, 'గెరిల్లా నాటకం'గా రూపాంతరం చెందుతుందని బాదల్ అన్నారు. ప్రశ్నను సహించలేని పాలక వర్గాలు, ధిక్కారాన్ని ఓర్చుకోలేని ప్రభుత్వాలు కళలను కట్టడి చేయడానికి, అణచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజా నాటకం మరింత బలోపేతం కావాలని బాదల్ అన్నారు. నాటక కళా తాత్వికతను పునర్ నిర్వచించిన బాదల్, నాటకం అంటే కేవలం కల్పిత వినోద 'ప్రదర్శన' కాదని, అది వ్యవస్థలోని నిజాలను 'నిదర్శనం'గా చూపే శక్తిమంతమైన వాహకమని అన్నారు.

అందుకు అనుగుణంగానే చివరి వరకు ఆయన జీవితం సాగింది. దశాబ్దాల పాటు ప్రత్యామ్నాయ నాటక కళా ఉద్యమానికి నేతృత్వం వహించిన బాదల్ సర్కార్ ఎన్నడూ పాలకుల మెప్పు కోసం పాకులాడలేదు. మొదట్లో పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారాల్ని అంగీకరించినా తర్వాత కాలంలో చైతన్యం పెంపొంది ప్రభుత్వం ఇస్తానన్న పద్మభూషణ్ అవార్డును రెండుసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 1967లో 'శతాబ్ది' అనే రంగస్థల సంస్థను స్థాపించిన బాదల్, ఈబాంగ్ ఇంద్రజిత్, బాసి ఖబర్, సారీ రాత్, పగల ఘోడా, స్పార్టకస్, భోమా వంటి అనేక వైవిధ్య నాటకాలు రచించారు.

అతి తక్కువ ఖర్చుతో, తక్కువ మందితో ఎక్కడికక్కడ సొంతంగా ప్రదర్శించగలిగేది వీధి నాటకం. అందుకనే, పౌరసమాజంపై వెన్వెంటనే గాఢమైన ముద్రవేసే ఈ ప్రక్రియ త్వరలోనే ప్రజల్లోకి లోతుగా వెళ్ళిపోయింది. అనేక సాంస్కృతిక సంఘాలు వీధి నాటకాన్ని ఆయుధంగా ప్రయోగించడం పెరిగిపోయింది. 80వ దశకంలో కేరళలో ప్రారంభమై దేశ వ్యాప్తంగా కొనసాగిన వైజ్ఞానిక కళాజాతా మొదలుకుని జాతీయ స్థాయిలో జరిగిన మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం, తెలుగు రాష్ట్రాల్లో ఉవ్వెత్తున ఎగిసిన అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక ఉద్యమం తదితర ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తి నింపిన వివిధ కళా రూపాలు, వీధి నాటకాలకు మూలం నాడు బాదల్ సర్కార్ రూపొందించిన రంగస్థల కార్యాచరణ ప్రభావితాలే. అదక్కడితో ఆగలేదు, అటు ఆదివాసి దళిత బహుజన సాంస్కృతిక సంస్థల నుండి, ఇటు ప్రగతిశీల మహిళా, గాంధేయవాద, సోషలిస్టు, వామపక్ష శక్తుల వరకు ప్రతి ప్రజాసంఘమూ వీధి నాటకాన్ని, భావజాల ప్రచార పనిముట్టుగా ఆశ్రయించాల్సి రావడం, బాదల్ సర్కార్ భావోద్యమాలలో సాధించిన అరుదైన విజయం. ప్రత్యామ్నాయ కళా రూపకంగా వీధి నాటకానికి మాత్రమే దక్కిన అపూర్వ గౌరవం. ప్రత్యామ్నాయ నాటకం ప్రజాచైతన్య పూరకం. మనిషి జీవితానికి సంబంధించిన ఉన్నత విలువలను ప్రమాణీకరించేది నాటకం. అది అనాదిగా అభివృద్ధి చెందుతున్న మానవాళి అభివ్యక్తికి ఆదర్శాత్మక చిహ్నం.

కళాకారుడిగా, ప్రయోక్తగా, రచయితగా, సాంస్కృతిక కార్యకర్తగా, నిత్య చైతన్యశీలిగా బతికిన బాదల్ సర్కార్ 2011, మే 11న కేన్సర్‌తో చనిపోయారు. భారతీయ రంగస్థల చరిత్రలో మహత్తరమైన మార్పుకి సారథ్యం వహించిన ప్రజాపక్ష మేధావిగా బాదల్ సర్కార్ శాశ్వతంగా నిలిచిపోతారు. ఆయన దిశానిర్దేశం చేసిన ప్రత్యామ్నాయ రంగస్థలాన్నీ, అందులో ప్రధానమైన వీధి నాటకాన్ని మరింత బలోపేతం చేసుకుని సమసమాజ నిర్మాణం దిశగా సాగడమే బాదల్ సర్కార్ ఆశయ స్ఫూర్తికి మనం ఇవ్వాల్సిన బాధ్యతాయుతమైన నివాళి.

▪ గౌరవ్
సాంస్కృతిక కార్యకర్త (90320 94492)

(జూలై 15: బాదల్ సర్కార్ శతజయంతి)



● మైలవరంలో భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆ కోపాన్ని ఇద్దరు పిల్లలపై చూపించాడు. భార్య దుబాయిలో పనిచేస్తుండగా, ఇక్కడ ఉంటున్న పిల్లలిద్దరినీ క్రూరంగా హత్య చేశాడు. భార్యాభర్తల మధ్య కోపానికి ముక్కుపచ్చలారని ఇద్దరి చిన్నారులు చనిపోయారు.

● ఏడాది క్రితం సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత హత్య నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అనుమానంతో భర్తే చిత్రహింసలకు గురిచేసి హతమార్చాడని మృతురాలి సోదరుడు ఫిర్యాదు చేశాడు. సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఇంటికి పిలిపించి మరీ హత్య చేశాడు.

● మద్యం, గంజాయికి బానిసైన తన కుమారుడు తమపై దాడి చేసి గాయపరుస్తున్నాడని న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన దంపతులు సింగ్‌నగర్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. డిగ్రీ చదివి ఎలాంటి ఉద్యోగం చేయకుండా నిత్యం వేధిస్తున్నాడని, తరచూ ఇంట్లోని కత్తులతో గాయపరుస్తున్నాడని చెప్పిన ఆ తల్లిదండ్రులు.. కేసు నమోదు చేయకుండా కుమారుడిని మార్చాలని కోరుకున్నారు.

బ్లడ్ రిలేషన్

కుటుంబాల్లో తగాదాల అగాధాలు

మానవత్వం మాయమైపోతోంది. పగలు ప్రతీకారాలకు ప్రేమలు మంటగలిసిపోతున్నాయి. అనుమానాలు, అవమానాలు, ఆర్థిక ఇబ్బందులు, మత్తు పదార్థాలు, అత్యధికంగా సెల్‌ఫోన్ వినియోగం.. వల్ల కన్నవారే కాదు.. కట్టుకున్నవారు, కన్నబిడ్డలను కూడా చంపుకొనే పరిస్థితులు ఎక్కువవుతున్నాయి. గత ఏడాదిలో జిల్లాలోని కీలక కేసులను పరిగణనలోకి తీసుకోగా, ఎక్కువ శాతం కుటుంబ కలహాలే ఉండటం మారుతున్న నేర ప్రవృత్తిని తెలియజేస్తోంది.



- అయినవారినే అంతం చేస్తున్న జీవనశైలి
- చాలా కుటుంబాల్లో కానరాని సత్సం'బంధాలు'
- కన్నవారు, కట్టుకున్న వారు, కన్నబిడ్డలపైనా కక్ష
- గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు, హత్యలు
- తాజాగా పిల్లలను చంపే వరకు కలహాలు
- గత ఏడాది జిల్లాలో 1,450 కేసుల నమోదు
- ఈ ఏడాది ఆరు నెలల్లోనూ ఇవే ఎక్కువ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : 2024 సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 1,450 కుటుంబ కలహాల కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదీ ఆ తరహా కేసులే అత్యధికంగా నమోదవుతున్నాయి.

మిగతా 6లో..

అమరావతిలో మలివిడత భూసమీకరణ అవసరమే

● క్వాంటం ఫలాలు అందుకునేందుకు సిద్ధంగా ఉందాం ● మాజీ మంత్రి వసంత పిలుపు 6

గుడివాడలో జడ్పీ చైర్‌పర్సన్ కారును అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) పేర్ని నాని ఫ్లెక్సీ చింపేసిన టీడీపీ కార్యకర్తలు



'నోటికి ఏదొస్తే అది మాట్లాడితే ఒళ్లు జాగ్రత్త.. మీరు నరుకుతామంటే మేము గాజులు తొడుక్కోలేదు.. రప్పా.. రప్పా అని ఎవరిని నరుకుతారు? కన్ను కొడితే చీకట్లో ఎవరిని నరుకుతారు?.. మీ దగ్గరికే వస్తున్నాం.. ఎవరిని నరుకుతారో నరకండి.. బస్తీమే సవాల్.. నానీలూ.. ఖబడ్దార్' అంటూ గుడివాడ టీడీపీ శ్రేణులు వైసీపీ ఉన్మాదపు నాయకులపై తిరుగుబాటు చేశాయి. కొద్దిరోజులుగా టీడీపీ వాళ్లను చంపేయండంటూ కార్యకర్తలను రెచ్చగొడుతున్న మాజీమంత్రి పేర్ని నానీకి బుద్ధి చెప్పాలని నిర్ణయించారు. విషయం పసిగట్టిన కొడాలి నాని గుడివాడలోని సమావేశానికి డుమ్మా కొట్టారు. మచిలీపట్నం నుంచి నేనొస్తున్నానంటూ.. పేర్ని రెచ్చిపోగా, పోలీసులు గృహ నిర్బంధం చేయటంతో టీడీపీ శ్రేణుల ఆగ్రహాన్ని తప్పించుకున్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టిన వ్యాఖ్యల నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల పేర్నిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

నానీలూ.. ఖబడ్దార్!

గుడివాడలో పెల్లుబికిన టీడీపీ శ్రేణుల ఆగ్రహం

నరుకుడు వ్యాఖ్యలు చేసిన పేర్ని నానీకి దేహశుద్ధి చేయాలని నిర్ణయం

- సమావేశానికి వస్తున్నట్టు తెలిసి కే కన్వెన్షన్ దగ్గర చుట్టుముట్టిన టీడీపీ శ్రేణులు
- సమావేశానికి డుమ్మాకొట్టి తప్పించుకున్న మాజీ మంత్రి కొడాలి నాని
- నేనొస్తున్నా.. అంటూ బందరులో పేర్ని నాని రెచ్చిపోగా.. పోలీసుల గృహ నిర్బంధం

మచిలీపట్నం, అవనిగడ్డలో పేర్నిపై పోలీసులకు ఫిర్యాదు



టీడీపీ శ్రేణులను బెదిరిస్తున్న ఉప్పాల రాము

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గుడివాడ/మచిలీపట్నం) : గుడివాడలో సుపరిపాలనలో ఏడాది కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం నిర్వహించారు. పేర్ని నాని ఉన్మాదపు వ్యాఖ్యలు పత్రికల్లో ప్రచురితం కావటంతో కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా పలు నియోజకవర్గాల్లో ఉన్మాదులను రెచ్చగొడుతున్నారని, ప్రశాంతంగా ఉన్న గుడివాడ నియోజకవర్గంలో కూడా సమావేశం పెడుతున్నారని, ఇక్కడికి వచ్చే నానీలను అడ్డుకుని తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే వెనిగండ్లపై ఒత్తిడి తెచ్చారు. మరోవైపు పేర్ని నానిపై జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కూడా టీడీపీ నాయకులు ఖండిస్తున్నారు.

మిగతా 6లో..

గుడివాడ సమావేశంలోనూ అదే ఉన్మాదం

● కొడాలి నాని బూట్లు నాకిస్తామంటూ హెచ్చరికలు

వైసీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో కొందరు నాయకులు అదే ఉన్మాదం ప్రదర్శించారు. కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారు. లింగవరంలోని కె-కన్వెన్షన్‌లో వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ మాట్లాడుతూ నెహ్రూచౌక్ సెంటర్‌లో ఫ్లెక్సీ పెట్టిన వ్యక్తి గతంలో నాని వెంట ఉన్నాడని, తర్వాత మాజీ ఎమ్మెల్యే రావి, నేడు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వెంట తిరుగుతున్నాడని, వైసీపీ అధికారంలోకి రాగానే సదరు వ్యక్తితో మాజీ మంత్రి కొడాలి నాని బూట్లను నాకిస్తానని హెచ్చరించారు.



● గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ

పట్టిసీమ నుంచి గోదావరి నీరు కృష్ణానదికి విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజీ నిండుకుండను తలపిస్తూ కళకళలాడుతోంది. బ్యారేజీ వద్ద ఒకవైపు గోదావరి నీరు ఎర్రగా, మరోవైపు కృష్ణానది నీరు పచ్చగా కనిపించి కనువిందు చేశాయి.

సూపర్ సిటీ

విజయవాడకు కేంద్ర ప్రభుత్వ 'సూపర్ స్వచ్ఛ్ లీగ్' అవార్డు

10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన కేటగిరీలో..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ/కార్పొరేషన్) : దేశంలోని అందమైన నగరాలకు కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసే 'సూపర్ స్వచ్ఛ్ లీగ్' అవార్డుకు విజయవాడ నగరం అర్హత సాధించింది. పది లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల కేటగిరీలో దీనిని ఎంపిక చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు చేసిన శ్రమకు ఫలితంగా ఈ అవార్డు దక్కింది. ఈ నెల 17న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానోత్సవం జరుగుతుంది. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అందుకుంటారని సమాచారం. కాగా, స్వచ్ఛ భారత్ లీగ్‌లో నగరానికి స్థానం దక్కడం పారిశుధ్య కార్మికుల ఘనతేనని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర ప్రశంసించారు. అవార్డు రావడానికి కారణమైన ప్రజలు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి వారు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఇండోర్, నవీ ముంబై, సూరత్ నగరాల జాబితాలో విజయవాడ చేరిందని కొనియాడారు.

కుమారుడి మృతదేహం వద్ద తండ్రి నాగిరెడ్డి



ఆడుకుంటూ అనంతలోకాలకు..

- కారు ఢీకొని ఏడేళ్ల బాలుడి మృతి
- కంకిపాడులోని అంకమ్మతల్లి గుడి రోడ్డులో ప్రమాదం

కంకిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని కారు రూపంలో మృత్యువు కబళించిన ఘటన కంకిపాడులో శనివారం జరిగింది. అదనపు ఎస్సై తాతాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడులోని అంకమ్మతల్లి గుడి రోడ్డులో నివాసముంటున్న పడాల నాగిరెడ్డి కుమారుడు మోక్షిత్‌రెడ్డి (7) రెండో శనివారం పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి వద్ద సైకిల్‌తో ఆడుకుంటున్నాడు. ఇంతలో అటుగా వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోక్షిత్ రెడ్డి కుప్పకూలిపోయాడు. వెంటనే కంకిపాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించాలని వైద్యులు సూచించారు. విజయవాడ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ భూపతి వెంకట శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బరువును బట్టే డోస్

మెథాన్‌ఫెటమైన్ కేసులో కొత్త కోణం

- కొనుగోలు చేసే వారి బరువును బట్టి డ్రగ్ డోస్
- డోస్‌ల లెక్కనే అమ్మకాలు.. విద్యార్థులే టార్గెట్
- బెంగళూరు నుంచి బెజవాడకు సరఫరా
- అంబాపురంలో ముగ్గురు అరెస్టు
- బెంగళూరు బాస్ లెక్క తేల్చే పనిలో పోలీసులు

ఏ పదార్థాన్నైనా గ్రాములు, కిలోల్లో లెక్కిస్తాం. కానీ, కిక్ ఇచ్చే డ్రగ్‌ను మాత్రం డోస్‌ల లెక్కన విక్రయిస్తున్నాడు ఓ ఇంజనీరింగ్ విద్యార్థి. మనిషి బరువును బట్టి డ్రగ్‌ను ఇవ్వడంతో పాటు ఇంజనీరింగ్‌లో ఒత్తిడిని తట్టుకోడానికే మత్తు అలవాటు చేసుకున్నామని చెప్పడం గమనార్హం.



మెథాన్‌ఫెటమైన్ స్వాధీనం చేసుకున్న ప్రదేశంలో నిందితులను విచారిస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెథాన్‌ఫెటమైన్ డ్రగ్ కేసులో కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం కేదారిలంక గ్రామానికి చెందిన గవర శ్రీరామ వెంకట మణికంఠ సూత్రధారి అని పోలీసులు తేల్చారు. అంబాపురం గ్రామంలోని ఓ తాటాకు పాకలో శుక్రవారం అర్ధరాత్రి డ్రగ్‌ను విక్రయిస్తుండగా, మణికంఠతో పాటు దేశబోయిన ఆకాశ్, శివకుమార్ కౌశిక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అమరావతిలో ఉన్న విట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా మణికంఠ, ఆకాశ్‌కు పరిచయం ఏర్పడింది. వీరిద్దరికీ కామన్ ఫ్రెండ్ కౌశిక్. అంబాపురానికి చెందిన కౌశిక్ ఇంటర్మీడియెట్ ఫెయిలై టీవీ రిపేర్ల షాపులో పనిచేస్తున్నాడు.

డోస్ లెక్కేంటి?

ఇప్పటి వరకు పోలీసులకు చిక్కిన కేసుల్లో నిందితులు డ్రగ్స్‌ను, గంజాయిని గ్రాముల్లో విక్రయిస్తున్నట్టు గుర్తించారు. మెథాన్‌ఫెటమైన్ డ్రగ్ కేసులో డోస్‌ల లెక్క బయటపడింది. ఈ మెథాన్‌ఫెటమైన్‌ను 'ఎం' అని, 'మెథ' అని పిలుస్తుంటారు. ఈ ముగ్గురు నిందితుల నుంచి పోలీసులు ఐదు గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని విచారణ చేస్తున్నప్పుడు మణికంఠ కొత్త లెక్క చెప్పాడు. తాను గ్రాముల లెక్కన డ్రగ్‌ను విక్రయించనని, డోస్‌ల లెక్కన విక్రయిస్తానన్నాడు. కొనుగోలు చేసే వ్యక్తి శరీర బరువును బట్టి డోస్ ఉంటుందని తెలిపాడు. కొనుగోలు చేసే వ్యక్తి బరువు 70 కిలోలు ఉంటే, ఒక డోస్ ఇస్తాడు. ఇందుకు రూ.9 వేల నుంచి రూ.10 వేలు వసూలు చేస్తాడు. డ్రగ్స్‌ను తీసుకునే వారి బరువును బట్టి

మిగతా 6లో..



ఆషాఢ సందడి

ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తూ అమ్మవారికి సారెలు సమర్పిస్తున్నారు. శనివారం భక్తులు అధికంగా తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

నిధుల స్వాహా

- గడ్డమణుగు పంచాయతీలో రూ.లక్షల్లో కుంభకోణం
- పీజీఆర్ఎస్ ద్వారా వెలుగులోకి
- తేలు కుట్టిన దొంగలా మండలాధికారి తీరు

6

తోడుదొంగలు దొరికారు..!

- విశ్రాంత ఇంజనీర్ హత్య కేసులో చిక్కిన నిందితులు
- శ్రీకాళహస్తిలో పట్టుబడిన అనూష, ఉపేందర్‌రెడ్డి
- నేడు నగరానికి..





అనూష, ఉపేందర్‌రెడ్డి (ఫైల్ ఫొటోలు)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ కాలనీలో ఆర్అండ్‌బీ విశ్రాంత ఇంజనీర్ రామారావు హత్య కేసులో నిందితులు పోలీసులకు చిక్కారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో ఇద్దరు నిందితులను శనివారం పోలీసులు పట్టుకున్నారు. రామారావును అనూష, వేమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి ఊపిరాడకుండా చేసి చంపేసిన విషయం తెలిసిందే. వారిని పట్టుకోవడానికి పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. మాచవరం పోలీస్‌స్టేషన్ నుంచి రెండు, సీసీఎస్ నుంచి ఒక బృందం నిందితుల వేటలో ఉన్నాయి. రామారావును హత్య చేశాక అనూష, ఉపేందర్‌రెడ్డి ఆటోలో నులకపేట వెళ్లారు. అక్కడి నుంచి అదే ఆటోలో పీఎన్‌బీఎస్‌కు చేరుకుని, తిరుపతి బస్సెక్కి వెళ్లిపోయారు. నెల్లూరు బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడి ఫోన్ తీసుకుని మాజీ భర్తకు అనూష ఫోన్ చేసింది. తన గురించి పోలీసులు అడిగితే ఎలాంటి వివరాలు చెప్పొద్దని సలహా ఇచ్చింది. తిరిగి ఆ నెంబర్‌కు ఫోన్ చేయొద్దని తెలిపింది. ఆ తర్వాత తిరుపతి చేరుకుని ఓ లాడ్జిలో బస చేశారు. ఈ విషయం తెలుసుకుని పోలీసులు అక్కడికి వెళ్లేసరికి లాడ్జి ఖాళీచేసి వెళ్లిపోయారు. చెన్నై వెళ్లిపోయినట్టు పోలీసులు

మిగతా 6లో..



జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపికి స్వాగతం పలుకుతున్న బార్ అధ్యక్షుడు సుందరరావు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి
కోర్టు, సబ్‌జైలు సందర్శన

జగ్గయ్యపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలు, సివిల్ కోర్టులను జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి శనివారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య, నందిగామ న్యాయమూర్తి రియాజ్‌తో కలిసి సందర్శించారు. కోర్టులో కేసులు, వాటి పురోగతిని తెలుసుకున్నారు. సబ్‌జైలును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. వారికందే సౌకర్యాలను పరిశీలించారు. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు జిల్లా జడ్జిని కలిసి సబ్‌కోర్టు త్వరగా మంజూరుకు నివేదికను హైకోర్టుకు సమర్పించాలని కోరారు. వారితో పాటు బార్ ప్రతినిధులు గండికోట శ్రావణ్‌కుమార్, దాసరి నాగేశ్వరరావు, దామాల సంతోష్, కారుపాటి వీరాస్వామి, డీ రత్నబాబు, మన్నెం మురళీ ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు రేపు

విజయవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల కోసం ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని విద్యార్థులకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల సమన్వయ అధికారి ఏ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు బాలికలకు వీరపనేనిగూడెం, బల్లిపర్రు, చల్లపల్లి, మోటూరు పాఠశాలల్లో, బాలురకు రుద్రవరం, పామర్రు గురుకుల పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్ అధికారి ఉత్తర్వుల మేరకు ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ-1, ఎకనామిక్స్ (ఉర్దూ మీడియం) - 1, తెలుగు- 2, కెమిస్ట్రీ-2, కామర్స్-1, ఫిజిక్స్-1 పోస్టులకు ఆయా సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆధార్, పాన్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మూడు సెట్ల దరఖాస్తులను ఈనెల 16లోగా ప్రిన్సిపాల్, ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల, విజయవాడలోని కార్యాలయానికి అందజేయాలన్నారు. తరగతుల డెమోతో పాటు ఇంటర్వ్యూ ఈ నెల 18న నిర్వహిస్తామన్నారు. అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అధ్యాపకుల వేతనం గంటకు రూ.375 ఉంటుందని, గరిష్టంగా నెలకు రూ.27వేల గౌరవ వేతనం ఉంటుందన్నారు.

నేడు రోటాఫిన్ ఎక్స్‌పో

విజయవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులో ఉన్న శేషసాయి కల్యాణ మండపంలో ఆదివారం రోటా ఫిన్‌ఎక్స్‌పో 2025 ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు రోటరీ మిడ్‌టౌన్ చైర్మన్ సతీష్‌కుమార్, అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి వసంతకుమార్ తెలిపారు. అన్ని ఫైనాన్స్ కార్పొరేషన్లు, బ్యాంకులు, బీమా కంపెనీలు పాల్గొంటాయన్నారు. ప్రజలకు అవసరమైన రుణ సహాయాన్ని అందజేయడానికి ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు.

గడ్డమణుగు పంచాయతీలో
రూ.లక్షల్లో స్వాహా..!
- పీజీఆర్‌ఎస్ ద్వారా వెలుగులోకి



జి.కొండూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డమణుగు పంచాయతీలో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయినట్టు తెలుస్తుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సుమారు రూ.10 లక్షల వరకు బొక్కేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పంచాయతీ నిధులపై పీజీఆర్‌ఎస్‌లో నివేధిక కోరడంతో అసలు విషయం బట్టబయలైంది. గ్రీన్ అంబాసిడర్ల పేరుతో రూ.10 లక్షలు నొక్కేశారని తెలుస్తోంది. నిధుల గోల్‌మాల్ వెనకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరో నిగ్గు తేల్చాలని, ప్రజాధనాన్ని కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా అధికారులకు నివేదిక ఇస్తాం.. కొత్త శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో

గడ్డమణుగు పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై వచ్చిన ఆరోపణలతో రికార్డులు తనిఖీ చేశాం. రికార్డులో తేడాలు గమనించాం. నిధులు గోల్‌మాల్ చేసిన ఉద్యోగులపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపుతాం.

గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

తిరువూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను ఎస్సై-1 కేవీజీవీ సత్యనారాయణ దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. పట్టణం శివారు కోకిలంపాడు రోడ్డులోని శనివారం శిరివెంచర్ వద్ద యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై-1 సత్యనారాయణ తహసీల్దార్ ఉదయభాస్కరరావుతో కలిసి దాడిచేశారు. నిందితుల నుంచి అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్‌వోలు గుండేపల్లి శ్రీనివాసరావు, మునిగంటి కృష్ణకుమారి పంచనామా నిర్వహించిన అనంతరం దాడుల్లో పట్టుబడిన సుందరయ్యకాలనీకి చెందిన గుంజి వెంకటేశ్వరరావు, మొగిలిపువ్వు ఆనంద్‌కుమార్, భగత్‌సింగ్ కాలనీకి చెందిన గందసిరి ఉపేంద్ర, మండలంలోని కాకర్ల శివారు రామన్నపాలెంకు చెందిన కంభంపాటి సింహాద్రిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

తోడుదొంగలు దొరికారు..!

(5వ పేజీ తరువాయి)

అనుమానించారు. రామారావును హత్య చేసింది అనూష, ఉపేందర్‌రెడ్డి అని తేలాక పోలీసులు వారికి సంబంధించిన మొ త్తం చరిత్రను తెలుసుకున్నారు. ఉపేందర్‌రెడ్డి మే నెలలో శ్రీకాళహస్తిలో రెండు కొత్త సిమ్‌కార్డులను కొన్నాడు. అతడు ఉపయోగించిన సెల్ నెంబర్లను సాంకేతికంగా తెలుసుకున్న పోలీసులు వాటిని ఎక్కడ కొన్నారో కనుగొన్నారు. అతడితో పోలీసు లు టచ్‌లోకి వెళ్లారు. అనూష, ఉపేందర్‌రెడ్డి మళ్లీ సిమ్‌లు కొనడానికి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని నిఘా పెట్టారు. మూడు పోలీసు బృందాలు వేర్వేరు చోట్ల నిందితుల వేటలో ఉండగా, అనూష, ఉపేందర్‌రెడ్డి వచ్చారని శ్రీకాళహస్తి డిస్ట్రిబ్యూటర్ పోలీసులకు ఉప్పందించాడు. ఇదే విషయాన్ని పోలీసులు సీపీ రాజశేఖరబాబుకు చెప్పారు. వెంటనే ఆయన తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో మాట్లాడి నిందితులు ఉన్న చిరునామాకు ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని పంపాలని అడిగారు. దీంతో ఆయన ఒక డీఎస్పీతో పాటు ముగ్గురు, నలుగురు సిబ్బందిని అక్కడికి పంపారు. అక్కడే ఉన్న అనూష, ఉపేందర్‌రెడ్డిని పట్టుకున్నారు. నిందితుల వేటలో ఉన్న ప్రత్యేక బృందా లు శ్రీకాళహస్తికి బయలుదేరి వెళ్లాయి. ఆదివారం మధ్యాహ్నానికి వారిని విజయవాడకు తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

ఉపేందర్‌రెడ్డిపై రెండు కేసులు

అనూష అసలు పేరు పల్లపు మంగ. వరుస పెళ్లిళ్ల కోసం ఆమె తన పేరును అనూషగా మార్చుకుంది. ఈమెకు ఉపేందర్‌రెడ్డిలో హైదరాబాద్‌లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఉపేందర్‌రెడ్డిపై పల్లాడ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులున్నాయి. ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోవడంతో అదృశ్యం కేసులు నమోదయ్యాయి. ఉపేందర్‌రెడ్డి అన్నయ్య హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన ఉపేందర్‌రెడ్డి జీవనోపాధి కోసం ఓ కారు కొనిచ్చాడు. దీన్ని అమ్మేసి అనూషతో కలిసి ఉంటున్నాడు. అంతకుముందు అనూష రెండు, మూడు వివాహాలు చేసుకుందని సమాచారం. ఉపేందర్‌రెడ్డితో సహజీవనం చేస్తూనే మాజీ భర్తలతో టచ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఉపేందర్‌రెడ్డికి తన అన్నయ్య హైదరాబాద్‌లో ఐదు ఉద్యోగాలు చూపించాడు. వాటిలో చేరిన కొద్దిరోజులకే మానేసి బయటకు వచ్చాడు.

దుర్గమ్మకు విశేషంగా ఆషాఢ సారె



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన భక్తులు

ఇంద్రకీలాద్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో దుర్గగుడి కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ పెరగడంతో ఈవో శీనానాయక్ స్వయంగా పర్యవేక్షించి, సిబ్బందికి సూచనలు చేశారు. రద్దీ పెరగటంతో రూ.500 అంతరాలయ దర్శనం రద్దు చేసి సామాన్య భక్తులకు వేగంగా దర్శనం కల్పించారు. ఆషాఢ సారె సమర్పణకు విచ్చేసిన బృందాలు పాత మెట్లు, మహామండపం మెట్లు, లిఫ్ట్, ఘాట్ రోడ్డు ద్వారా కొండపైకి చేరుకున్నాయి. ఉత్తరాంధ్ర భవానీ దీక్షా సేవా పీఠం అధ్యక్షుడు పులపా మల్లేశ్వరరావు గురుభవానీ ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు ఆషాఢ సారె సమర్పణకు వన్‌టౌన్ వినాయక టెంపుల్ నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. మహామండపం ఆరో అంతస్తులో సారె సమర్పణ బృందాలకు ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం ఏర్పాటు చేశారు. ప్రధాన ఆర్జిత సేవలైన చండీహోమం, లక్ష కుంకుమార్చన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

సులభ మార్గాలకు అన్వేషణ

భక్తులు సులభంగా కొండపైకి చేరుకోవడానికి సమన్వయంతో ముందుకు సాగుతున్నామని ఈవో శీనానాయక్ అన్నారు. దేవస్థానం కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులు, దేవస్థానం సిబ్బంది, వైదిక కమిటీతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నుంచి కొన్ని గంటల్లోనే విజయవాడ చేరుకుని కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ఇంద్రకీలాద్రికిపైకి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని భక్తులు చెప్పారని, ప్రత్యామ్నాయ దారులు, టోల్‌గేట్ మార్పు గురించి చర్చించారు. మునిసిపల్ ఆఫీస్ వద్ద హోల్డింగ్ ఏరియా అభివృద్ధి, కనకదుర్గానగర్, దుర్గాఘాట్‌లో ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం పాలన వికేంద్రీకరణ కింద కొండ దిగువనే పలు సౌకర్యాల ఏర్పాటు గురించి పోలీసు అధికారులకు ఈవో వివరించారు. కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిబింబేచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసు అధికారులు జీ రామకృష్ణ, దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

సమస్యల పరిష్కారానికి
కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

విజయవాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ శాసనమండ సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవన్‌లో శనివారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ మొదటి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులను మానసికంగా వేధించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'మెగా పేరెంట్ టీచర్స్' మీటింగ్‌లో తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని బెనిఫిట్లు ఈ ప్రభుత్వంలో ఖచ్చితంగా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మరో ఎమ్మెల్సీ పీ అశోక్‌బాబు మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శాఖలు ఏర్పాటుచేసి ఒక బలమైన సంఘంగా ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు తమ సొంత మండలాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు పీఆర్‌సీ కమిటీని వేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విద్యా, ఆర్థిక, సామాజిక అంశాలపై పలు తీర్మాణాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మలివిడత భూసమీకరణ అవసరమే: వసంత



నందిగామ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): భావితరాల విశాల ప్రయోజనాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మలివిడత భూసమీకరణ చేపట్టడం అభినందనీయమని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు అన్నారు. మలివిడత 42వేల ఎకరాల భూసమీకరణపై ప్రతిపక్షాలు, రిటైర్డ్ రాజకీయ నేతలు చేస్తున్న విమర్శలపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజధాని పటిష్ఠంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌కు ఐటీని ఆకర్షించేందుకు చంద్రబాబు అప్పట్లో సిద్ధం చేసిన ల్యాండ్ బ్యాంక్ నేటికీ ఆ రాష్ట్ర ప్రయోజనాలకు కాపాడుతూ వస్తుందన్నారు. ఐటీ తెలియని రోజుల్లోనే చంద్రబాబు హైటెక్ సిటీ నిర్మించారన్నారు. అక్కడ భూమిని అభివృద్ధి పరిచి కంపెనీలకు ఇవ్వడం వల్లే హైదరాబాద్ ముందంజలో ఉండి రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టాయన్నారు. లాగే ప్రపంచం కళ్లు తెరవకముందే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణం చేపట్టారన్నారు. భవిష్యత్ మొత్తం క్వాంటమ్ వ్యాలీపైనే ఉంటుందన్నారు. క్వాంటమ్ తొలి దశ ఫలితాలను అందుకొనేందుకు చంద్రబాబు సిద్ధంగా ఉన్నాడన్నారు. అభివృద్ధి జరిగితే రాష్ట్రంలో ఉనికి ఉండదన్న భావనతో మాజీ సీఎం జగన్ పర్యటనల పేరుతో అరాచకం సృష్టిస్తున్నాడన్నారు. తాను మళ్లీ వస్తానన్న భావన కల్పించి రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయాలన్న ఆలోచన చేస్తున్నాడన్నారు. జగన్ వంటి విధ్వంస నేతలను ముందే గమనించిన చంద్రబాబు రాజధానికి భూములిచ్చిన రైతుల రక్షణకు పటిష్ఠమైన చట్టం తెచ్చాడన్నారు. మలివిడత ఇంకా పటిష్ఠమైన చట్టంతో రైతుల హక్కులకు భంగం వాటిల్లకుండా చూస్తాడన్నారు. రాజధానికి భూములివ్వద్దంటూ కొందరు సీనియర్ నేతలు చేస్తున్న ప్రకటనలు బాధ కలిగిస్తున్నాయని పరోక్షంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావును విమర్శించారు.

వాహనాల ఖర్చెంత..?: మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో అతి పెద్ద శాఖైన వైద్యారోగ్యశాఖ పరిధిలో వాడుతున్న వాహనాల సంఖ్య, వాటి ఖర్చుల వివరాలను వెంటనే పంపించాలని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. శాఖలో కొన్ని చోట్ల అవసరాల మేరకు వాహనాల లభ్యత లేకపోవడం, మరికొన్ని చోట్ల వాహనాల దుర్వినియోగంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో మంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. అధికారులు, ఇతర సిబ్బందికి వాహనాల కేటాయింపు, వినియోగానికి సంబంధించిన నియమాలేంటి? మొత్తం ఎన్ని వాహనాల్ని వాడుతున్నారో చెప్పాలని కోరారు. వాటిపై సాలీనా ఎంత ఖర్చవుతోందన్న వివరాల్ని వారం రోజుల్లోగా తెలపాలని ఆదేశించారు. 2023-24, 2024-25 సంవత్సరాల వ్యయ వివరాలనూ తెలపాలని కోరారు. వీటితో పాటు వాహనాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి అమలులో ఉన్న నియమాలు, దుర్వినియోగాన్ని గుర్తించిన సంఘటనలు, తీసుకున్న చర్యల వివరాల్ని కూడా పంపించాలని కోరారు.

గ్రీన్ అమరావతే లక్ష్యంగా పనిచేయాలి

శిక్షణ పూర్తిచేసుకున్న గార్డెనర్లకు సర్టిఫికెట్లు అందజేత



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి

కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిని పచ్చని తోరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గార్డెనర్లు పనిచేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి సూచించారు. అమరావతి గ్రీనింగ్ ప్రాజెక్టులో పనిచేయడానికి 29 గ్రామాల నుంచి ఎంపిక చేయబడిన మహిళలకు ఏపీ జీబీసీ ఆధ్వర్యంలో పచ్చదనం పెంపకంలో 21 రోజులపాటు శిక్షణ ఇచ్చి శనివారం రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలోని ఏపీ సీఆర్‌డీఏ నర్సరీలో సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రాజధాని గ్రీన్ అమరావతిగా తీర్చిదిద్దడానికి 3 లక్షల మొక్కలు అవసరమన్నారు. శిక్షణ పూర్తిచేసుకొన్న మీరంతా మీ గ్రామాల్లోని చెట్లను గుర్తించి అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం సీఎండీ వారి చేతుల మీదుగా గార్డెనర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంకేవీ శ్రీనివాసులు, ఏపీ సీఆర్‌డీఏ హార్టికల్చర్ అదనపు డైరెక్టర్ ఎం హరిప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ బీ జాన్ బెన్ని, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద నివారణకు పటిష్ఠ చర్యలు

రాజధాని నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న కార్మికులు, సాధారణ ప్రజలకు ప్రమాద పరిస్థితులు తలెత్తకుండా గుత్తేదారు సంస్థలు చర్యలు చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆర్‌వీఆర్ సంస్థ చేపడుతున్న ఎన్-14, ఈ-8, ఈ-6, ఎన్-7,10,11 రహదార్ల నిర్మాణ పనులను పరిశీలించారు. తొలుత తుళ్లూరులోని ఆర్‌వీఆర్ క్యాంపును పరిశీలించి ప్రపంచ బ్యాంకు నిబంధనలను పాటిస్తూ కార్మికులకు ఆహారం, వసతి సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఏడీసీ చీఫ్ ఇంజనీర్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, ఎస్‌ఈలు నరసింహామూర్తి, నర్సింహారావు, వీ శ్రీనివాస్, ఈఈలు బసవేశ్వరరావు, రమేష్, వైకుంఠరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బరువును బట్టి డోస్

(5వ పేజీ తరువాయి)

దాని మత్తు పరిమాణం ఉంటుందని వివరించాడు. సాధారణంగా మాదకద్రవ్యాల అలవాటు ఉన్నవారు ముందుగా కొంత పరిమాణంలో డ్రగ్ తీసుకుంటారు. అది మత్తును ఇవ్వకపోతే మరికొంత తీసుకుంటారు. అది కూడా చాలకపోతే ఇంకొంత తీసుకుంటారు. తీసుకున్న వెంటనే కిక్ ఎక్కడానికి మణికంఠ డోస్‌ల లెక్కను ఎంచుకున్నాడు. బెంగళూరు నుంచి గ్రాము మెథను రూ.4 వేల కొంటాడు. ఇక్కడికి తీసుకొచ్చాక దానిని డోస్‌ల లెక్కన విక్రయిస్తాడు. ఒక డోస్ అంటే గ్రాములో పదోవంతు అని పోలీసులకు లెక్కలు చెప్పాడు.

బెంగళూరు బాస్ ఎవరు?

మణికంఠకు మెథాను సరఫరా చేస్తున్న బెంగళూరు బాస్ ఎవరన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ వ్యక్తితో మణికంఠ, ఆకాశ్ ఇన్‌స్టా ద్వారా చాటింగ్ చేసినట్టు గుర్తించారు. ఈ ఇద్దరు విట్ కళాశాలలో చదువుతున్నప్పటి నుంచే మెథాకు అలవాటు పడ్డారు. తమకు జర్మనీలో ఉంటున్న హేమంత్ అనే యువకుడి ద్వారా ఈ డ్రగ్ అలవాటైనట్టు పోలీసుల విచారణలో వెల్లడించారు. అతడు ఎవరో వివరాలను బయటకు లాగే పనిలో పోలీసులు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొంతమంది ఇంజనీరింగ్ పట్టభద్రులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ ఎండీఎంఏ వంటి డ్రగ్‌ను తయారు చేసి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం ఉంది. ఇలా బెంగళూరు నుంచి ఎండీఎంఏను తీసుకొస్తూ ఇద్దరు, ముగ్గురు యువకులు విజయవాడ పోలీసులకు చిక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక్కడ డ్రగ్స్‌తో దొరికిన వారికి ప్రతి కేసులోనూ బెంగళూరుతో లింక్‌లు ఉంటున్నాయి. మణికంఠ బెంగళూరులో ఉన్న వ్యక్తితో ముందుగా ఇన్‌స్టాలో చాటింగ్ చేసి ఎంత మొత్తంలో డ్రగ్ కావాలో చెబుతాడు. దానికి సంబంధించిన డబ్బును ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లిస్తాడు. తర్వాత ఆ వ్యక్తి డ్రగ్‌ను ఒకచోట ఇచ్చి ఆ ప్రదేశం పేరు చెబుతాడు. అక్కడి నుంచి డ్రగ్‌ను తీసుకుని మణికంఠ విజయవాడ చేరుకుంటాడు. ఈవిధంగా మణికంఠ ఏడాది నుంచి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ డ్రగ్‌ను ఎందుకు అలవాటు చేసుకున్నారని పోలీసులు అడిగినప్పుడు మణికంఠ, ఆకాశ్ విచిత్రమైన సమాధానం చెప్పారు. ఇంజనీరింగ్‌లో ఉన్న ఒత్తిడిని తట్టుకోవడానికి, రాత్రి పూట ఎక్కువసేపు మేల్కొని చదవడానికి అలవాటు చేసుకున్నామని చెప్పినట్టు తెలిసింది.

బ్లడ్ రిలేషన్

(5వ పేజీ తరువాయి)

జనవరి నుంచి జూన్ 31 వరకు సుమారు 600 కుటుంబ కలహాల కేసులు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. వీటిల్లో భార్యాభర్తల కలహాలే అధిక. రెండో స్థానంలో వరకట్నం, గృహహింస కేసులున్నాయి. ఆస్తుల పంపకాల్లో కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన వివాదాలు.. దాడుల వరకు వెళ్లిన ఘటనలపైనా కేసులు ఎక్కువగానే నమోదయ్యాయి. భార్యాభర్తలు గొడవపడి ఆ కోపాన్ని పిల్లలపై చూపిస్తున్న వైనంపైనా ఇటీవల ఫిర్యాదులు అందుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే, ఈ తరహా కేసులను కౌన్సెలింగ్‌కు పంపి పరిష్కరిస్తున్నారు.

వ్యక్తిత్వంలో లోపాలే కారణం

అన్ని వయసుల వారిలో వ్యక్తిత్వంలో లోపాలు (కాంజుగల్ ఐడెంటిటీ) ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని మానసిక వైద్యులు చెబుతున్నారు. చిన్న వయసులో పెరిగిన వాతావరణం, భరించిన అవమానాలు, బాధలు, శిక్షలు, ఆకలి కష్టాలు యుక్త వయసు నుంచి ప్రభావం చూపిస్తుంటాయి. చిన్న వయసులో శారీరక శక్తి చాలక ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారని, వయస్సుకు వచ్చాక సాధించే శారీరక శక్తి, ఆర్థిక భరోసా, సమాజంలో పలుకుబడితో ఎదుటి వ్యక్తిపై ఆధిపత్యం చెలాయించేలా చేస్తోందంటున్నారు. జీవిత భాగస్వామిపైనే ఆధిపత్య ధోరణి ప్రదర్శించాలనే భావన ఎక్కువగా వస్తోందని, నేటి రోజుల్లో ఈ తరహా మనస్తత్వం అందరిలోనూ సర్వసాధారణమైందనేది వైద్యుల మాట. 'నేను చేసేది మాత్రమే కరెక్ట్ (సెల్ఫ్ రైటీస్) అనే భావనతో భాగస్వామిని చులకనతో చూడటంతో పరస్పర వివాదాలు తలెత్తుతున్నాయి. భాగస్వామి తన మాటను ఖాతరు చేయడం లేదనే కోపాన్ని పెంచుకుని, ఆ కోపాన్ని పిల్లలపై చూపిస్తున్న జంటలు నగరంలో ఎన్నో ఉన్నాయని కౌన్సెలింగ్ కేంద్రాల్లోని వైద్యులు చెబుతున్నారు. డిప్రెషన్‌లో క్షణికావేశానికి గురైై పర్సనాలిటీ డిజార్డర్ అనే వ్యాధికి గురైన వ్యక్తులే అత్యధికంగా ఇలాంటి దుస్సాహసాలకు దిగుతారని వైద్యులు చెబుతున్నారు.

మత్తు ప్రభావమూ ఎక్కువే..

కుటుంబ హత్యల వెనుక మత్తు పదార్థాల ప్రభావం ఉందనేది ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. నిత్యం మత్తులో ఉంటున్నాడనే ఉద్దేశంతో ఓ వివాహిత తన భర్తను చంపేసింది. మద్యం మత్తులో గృహిణులపై జరుగుతున్న దాడులు ఎక్కువయ్యాయి. గంజాయికి బానిసైన యువత.. తల్లిదండ్రులపై దాడులకు దిగుతున్న ఉదంతాలు ఇటీవల కాలంలో అత్యధికంగానే చోటుచేసుకుంటున్నాయి.

కాపురాల్లో 'స్మార్ట్' చిచ్చు

కాపురాల్లో సోషల్ మీడియా సైతం తనదైనశైలిలో చిచ్చు పెడుతోంది. నిత్యం ఫోన్‌లో తన భార్య ఉంటోందని, ఇంటి పని, పిల్లలను పట్టించుకోవడం లేదంటూ ఎంతోమంది భర్తలు పోలీస్ స్టేషన్ల మెట్లెక్కుతున్నారు. అయితే, ఈ తరహా కేసులను పోలీస్ శాఖ కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరిస్తోంది. దీనికోసం నగరంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద, మహిళా పోలీస్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చే కొన్ని స్వచ్ఛంద సంస్థలను పోలీస్ శాఖ తరచూ సంప్రదిస్తోంది.

స్వీయనియంత్రణ పెంచుకోవాలి

భాగస్వామి/ఇతర కుటుంబ సభ్యులపై ప్రతీకారం తీర్చుకోవాలనే కోరికతోనే కుటుంబ హత్యలు జరుగుతుంటాయి. దీనిలో నేరస్తుడు నిందను బాహ్యంగా చూపిస్తూ, ఇతర కుటుంబ సభ్యుల అవసరాలను విస్మరిస్తూ ప్రవర్తిస్తుంటాడు. భావోద్వేగ క్రమ రాహిత్యంతో కోపాన్ని, శత్రుత్వాన్ని నియంత్రించుకోలేని సందర్భంలోనే కుటుంబ హత్యలు జరుగుతుంటాయి. వీటి నిర్మూలన మన చేతుల్లోనే ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని జయించేందుకు రోజూ యోగా, వ్యాయామం చేయాలి. సత్సంబంధాలను బలపర్చుకోవాలి. కోపం, ఆవేశం వంటి వాటిని స్వీయ నియంత్రణ చేసుకోగలగాలి. పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. సాధ్యమైనంత వరకు ఉమ్మడి కుటుంబంలోనే ఉండాలి. మితిమీరిన వ్యక్తిగత స్వేచ్ఛ కొన్ని సందర్భాల్లో చేటు తెస్తుంది. కుటుంబంతో కలిసి విహార యాత్రలకు, వేడుకలకు వెళ్తుండాలి. పెద్దల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

\- పి.రమాదేవి, సైకాలజిస్ట్, విజయవాడ

నానీలూ.. ఖబడ్దార్

(5వ పేజీ తరువాయి)

దీంతో వెనిగండ్ల రాము వైసీపీ నేతల సమావేశాన్ని అడ్డుకోవాలని నిర్ణయించారు. దీంతో కార్యకర్తలంతా రెట్టించిన ఉత్సాహంతో మధ్యాహ్నం నుంచే కే కన్వెన్షన్ ప్రాంతాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. వైసీపీ ఫ్లెక్సీలను చించివేశారు. ఇద్దరి కార్యక్రమాలు ఒకే చోట ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. టీడీపీ శ్రేణులు, వైసీపీ సమావేశం వేదిక వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు బ్యారికేడ్లు పెట్టడంతో టీడీపీ శ్రేణులు, పోలీసుల నడుమ మాటల యుద్ధమే జరిగింది. సాయంత్రం వరకు టీడీపీ శ్రేణులు అక్కడి నుంచి కదలలేదు.

పేర్ని నాని వచ్చాడని కారుపై దాడి..

ఈలోపు కృష్ణా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక తన అధికారిక కారులో వైసీపీ సమావేశానికి వచ్చారు. దీంతో పేర్ని నాని వచ్చారేమోనని భావించిన టీడీపీ కార్యకర్తలు కారు అద్దాన్ని ధ్వంసం చేశారు. ఆ తర్వాత కారులో హారిక ఉందని తెలుసుకుని వదిలేశారు. హారిక భర్త, వైసీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము టీడీపీ కార్యకర్తలకు వేలు చూపిస్తూ మీ సంగతి చూస్తానంటూ హెచ్చరించటంతో .. టీడీపీ నాయకులు రాముపైకి దూసుకెళ్లారు. ఈ దశలో పోలీసులు అడ్డుకోవటంతో గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు సర్దిచెప్పి ఆమెను పంపించేసినా.. వెళ్లినట్టే వెళ్లి ఆమె మళ్లీ వచ్చారు. దీంతో మరింతగా ఉద్రిక్తలు చోటు చేసుకున్నాయి. అగ్రనాయకులు ఎవరూ సమావేశానికి రాకపోవటంతో నిరాశ చెందిన నియోజకవర్గ నాయకులే బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ సమావేశాన్ని నిర్వహించుకున్నారు. బయట టీడీపీ శ్రేణులు ముట్టడించాయని, తమ నాయకులకు బుద్ధి చెప్పటానికి వచ్చారన్న కసితో .. నాయకులదొక దారి అయితే తమదొక దారి అంటూ రెచ్చిపోయి ప్రసంగాలు చేశారు.

సమావేశానికి నాయకులంతా డుమ్మా!

స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు ఉత్తర్వుల మేరకు సంతకాలు చేసేందుకు వచ్చిన మాజీ మంత్రి కొడాలి నాని అటు నుంచి అటే వెళ్లిపోయారు. సమావేశం జరిగే వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. స్థానికంగానే ఉన్న ఆయన సమావేశానికి రాకపోవడం పట్ల వైసీపీ శ్రేణులు అసహనం వ్యక్తం చేశాయి. మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలతో పాటు జిల్లా ముఖ్య నాయకులెవ్వరూ సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం. వైసీపీ మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురున్నాథం ఒక్కరే సమావేశానికి హాజరు కావడం విశేషం. కొందరు నాయకుల ప్రసంగాలు కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా సాగాయి. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో గుడివాడలో భారీ బందోబస్తుగా ఏర్పాటు చేశారు.

వివాదాస్పదంగా మారిన కొడాలి నాని ఫ్లెక్సీ

స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారింది. గత ఎన్నికలకు ముందు కుప్పంలో చంద్రబాబు గెలిస్తే రాజకీయాలు వదిలేసి చంద్రబాబు బూట్‌లను పాలిష్ చేస్తానని చేసిన వాగ్దానాన్ని కొడాలి నాని నేరవేర్చాలంటూ టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పట్టణంలో పలుచోట్ల మాజీ మంత్రి నానిని ట్రోల్ చేస్తూ ఫ్లెక్సీలు వెలిశాయి.

పేర్ని నానిపై పోలీసులకు ఫిర్యాదులు

మాజీ మంత్రి పేర్ని నానిపై టీడీపీ నాయకులు శనివారం మచిలీపట్నంలోని రాబర్ట్‌సన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణాజిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే వైసీపీ సమావేశాల్లో పాల్గొంటున్న పేర్ని నాని వైపీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా, హింసను ప్రేరేపించేలా మాట్లాడుతున్నారని తెలిపారు. దీంతో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, విచారణ చేసి చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. "రప్పా..రప్పా అంటూ వ్యాఖ్యలు చేయడంకాదని, చెప్పకుండా నరికేయాలని, చీకట్లో కన్నుకొడితే పని అయిపోయేలా ఉండాలని" వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా పేర్ని నాని వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. పేర్ని నాని వ్యాఖ్యలు తెలుగుదేశం, జనసేన నాయకులు, సానుభూతిపరులపై దాడులు చేయాలనే విధంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు లొగిశెట్టి వెంకటస్వామి, టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, కుంచేనాని తదితరులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు. మాజీ మంత్రి పేర్నినాని వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లోనూ టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పేర్నినానిపై ఫిర్యాదు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103,111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో ఉన్న కళావేదిక మీద శనివారం రాజమండ్రికి చెందిన శ్రీలలిత కళాప్రియ నృత్య నికేతన్ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. శ్రీలలిత కళాప్రియ నృత్య గురువు కె.నవ్య ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు 20 మంది కళాకారులు లయబద్ధంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సమరం

రోటరీతో సమాజానికి సేవ చేసే అవకాశం: సమరం

పటమట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రోటరీ ద్వారా సమాజానికి దగ్గరగా ఉండి సేవ చేసే అవకాశం విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు దొరుకుతుందని ప్రముఖ వైద్యులు రొటేరియన్ డాక్టర్ జి.సమరం తెలిపారు. పటమట ఆదిత్య కళాశాలలో రొటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఆటోమా, రొటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం జరిగింది. అధ్యక్షులుగా కె. అభిషేక్, లలితలు, కార్యదర్శులుగా రేణుక, అబ్బాస్‌లు ఎన్నిక య్యారు. ప్రిన్సిపాల్ వీర్రాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం రక్తదానం, ప్లాస్టిక్‌పై అవగాహన అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీలకు కళాశాల యాజమాన్యం, డైరెక్టర్ నాయుడు అభినందనలు తెలియజేశారు. రోటరీ సభ్యులు ఎస్. బాలగోపాల్, రామ్‌గోపాల్, రాము, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

- రాణిగారితోట, కృష్ణలంక ప్రాంతాల్లో సమయపాలన లేకుండా మద్యం అమ్మకాలు
- కళ్లు మూసుకున్న ఎక్సైజ్ శాఖ
- ముడుపుల మత్తులో అధికారులు
- లబోదిబోమంటున్న మహిళలు

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి : రాణిగారితోట, కృష్ణలంక ప్రాంతాల్లో నివసించే పేదలే టార్గెట్‌గా ఈ ప్రాంతాల్లో ఉన్న బార్‌లు 24గంటలు వ్యాపారం చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన సమయాలకు విరుద్ధంగా సంబంధిత శాఖ సిబ్బందిని ముడుపుల మత్తులో ముంచి ఈ ప్రాంతాల్లోని బార్‌ల నిర్వాహకులు మద్యాన్ని అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు.

ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అన్ని విధాల అండదండలు ఉన్నాయని బెదిరింపులకు దిగుతున్నారు. ముఖ్యంగా రాణిగారితోట ప్రాంతంలోని రెండు బార్లలో తెల్లవార్లు మద్యం అమ్ముతూ పేదలను నిలువుదోపిడి చేస్తున్నారు. ఇక్కడ చాలా మంది కూలిపనులు చేసేవారే. వారి కష్టాన్ని మద్యం అమ్మకాలతో బార్ల నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. దీంతో తమ భర్తల కష్టాన్ని మద్యం మింగేయడంతో రోజు గడవడం కష్టంగా ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల నుంచి అమ్మకాలు విపరీతంగా పెరిగాయని స్థానికులు చెబుతున్నారు.



రాణిగారితోటలోని ఆర్‌కె బార్, లక్కీ బార్‌లలో ఉదయం మద్యం అమ్మకాలు

ఈ ప్రాంతంలో ఉన్న ఒక బార్ అయితే మద్యం బాబులు దర్జాగా కూర్చుని తాగే ఏర్పాట్లు చేశారంటే వారికి ఎవరి అండదండలు ఉన్నాయో ఎక్సైజ్ అధికారులే చెప్పాలి. కృష్ణలంక ప్రాంతంలో ఉన్న మిగిలిన బార్ల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది.

ఇక్కడ కూడా ఎప్పుడూ మద్యం అందుబాటులో ఉంటుంది. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు ముడుపుల మత్తు వదిలించుకుని చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

63 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె, నాగుల్ మీరా, చెన్నుపాటి గాంధీ

గుణదల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 5వ డివిజన్లో అనారోగ్యంతో బాధపడుతున్న 63 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 71.03 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం క్రీస్తురాజపురం పార్టీ కార్యాలయం వద్ద శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో కూటమి భాగస్వాములవుతుందన్నారు. ఈ డివిజన్లో నిర్మాణదశలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను కూడా త్వరగా పూర్తి చేసి వాడుకలోకి తీసుకొచ్చి మంచినీటి కొరత లేకుండా చేస్తామని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు నాగుల్ మీరా మాట్లాడుతూ సమస్య ఉన్నచోట గద్దె ఉంటారని, దానిని పరిష్కరించే వరకు పట్టుదలగా నిలబడే తత్వం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పేరేపి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనలో భాగం కావాలి


మాట్లాడుతున్న ఏసీపీ కె.దామోదర్, చిత్రంలో సీఐలు తదితరులు

బెంజిసర్కిల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనలో భాగం కావాలని, కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటులో సురక్ష సభ్యులు అవగాహన కల్పించాలని ఏసీపీ కె.దామోదర్ తెలిపారు. శనివారం ఆటోనగర్‌లోని ఓ హోటల్‌లో సెంట్రల్ డివిజన్ సురక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ డివిజన్‌లోని సురక్ష సభ్యులు యాక్టివ్‌గా ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని పోలీసులకు తెలియజేయాలన్నారు. శాంతి భద్రతలకు ఇబ్బంది కలిగే ప్రాంతాలను, కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పోలీసు శాఖకు తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీఐలు వల్లభనేని పవన్ కిషోర్, ప్రకాష్, శ్రీనివాస్, ఎస్.ఐలు దుర్గాభవాని, జి.రేవతి, కృష్ణవర్మ, సురక్ష సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి లక్ష్యం

- గద్దె క్రాంతికుమార్


ఆర్థికసాయం చేస్తున్న గద్దె క్రాంతికుమార్

పటమట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందించారని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. శనివారం 13వ డివిజన్‌లో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్‌తో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కరపత్రాలను పంపిణీ చేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పలువురికి ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రవికిరణ్, శ్రీను, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్లస్ స్కూల్‌లో పెరిగిన అడ్మిషన్లు

- పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్న ప్రభుత్వం
- దాతల సహాయంతో కేఎస్ఆర్‌లో ల్యాబ్ ఏర్పాటుకు సన్నాహాలు

(బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి)

శ్రీకొమ్మా సీతారామయ్య పాఠశాల (కేఎస్ఆర్) ప్లస్‌లో జూనియర్ కళాశాల విద్యార్థినీల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థినులు ఎంపీసీ, బైపీసీతో కలిపి 68 మంది ఉన్నారు. గతంలో ఇంటర్ రెండేళ్లు కలిపి 40 మంది మాత్రమే ఉండేవారు. వీరిలో మార్చిలో నిర్వహించిన పరీక్షల్లో ఎంపీసీలో 12 మంది, బైపీసీలో 14 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగతా విద్యార్థినులు ఒకటి, రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్ అడ్మిషన్లల్లో సుమారు 68 మంది చేరారు. గత వైసీపీ పాలనలో వీరికి మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించేది కాదు. దీంతో పాఠశాల నిర్వాహకులు దాతల సహాయంతో ఆయా విద్యార్థినులకు పుస్తకాలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్లస్ స్కూల్స్‌లో చదివే వారికి పుస్తకాలతోపాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తుంది.


శ్రీ కొమ్మా సీతారామయ్య పాఠశాల

అందుబాటులో బోధన లెక్చరర్లు

గతంలో ఒక లెక్చరర్ రెండు, మూడేసి సబ్జెక్టులు బోధించే వారు. నేడు ప్రతి సబ్జెక్టుకు ఒక్కో లెక్చరర్ అందుబాటులో ఉన్నారు. సబ్జెక్టు టీచర్లను కేటాయించడం ఇదే ప్రథమమని చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది విద్యార్థినీల సంఖ్య పెరిగిందని చెబుతున్నారు.

ల్యాబ్‌ల కొరత

సెంకడియర్ విద్యార్థినులను ల్యాబ్‌ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పదో తరగతి ల్యాబ్‌లనే సెంకడియర్ ల్యాబ్‌లకు వినియోగిస్తున్నారు. ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం సహకారంతో పరీక్షల చివరి ఐదు నెలల సమయానికి ముందు వారి కళాశాలలో ల్యాబ్‌లో ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశమిచ్చారు. సొంతంగా ల్యాబ్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వ సహాయం అందిస్తే బావుంటుందని చెబుతున్నారు. ల్యాబ్ నిర్మాణానికి ఆయ్యే ఖర్చును భరించేందుకు దాతల సహాయం కోరగా వారు ఆయా మొత్తాన్ని అందించేందుకు ముందుకొచ్చారని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

వన్‌టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కబేళాసెంటర్ చనమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక కల్యానా ప్రింట్స్ రోడ్డు రెహమాన్ వీధిలో మహమ్మద్ ఆసిఫ్‌ఖాన్(25) కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ఇతను ఆటోనగర్‌లోని ఓ షెడ్‌లో కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.

ఇతను శనివారం గొల్లపూడి బైపాస్ రోడ్డులోని ఓ కారు షెడ్డు వద్దకు వచ్చి కారు రిపేరు చేసి బైక్‌పై ఆటోనగర్ బయలుదేరాడు. కబేళాసెంటర్ చనమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడి వద్ద ఉన్న ఫోన్‌లో కుటుంబసభ్యులకు సమాచార మిచ్చారు. కుటుంబసభ్యులు వచ్చి బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆర్థిక ప్రోత్సాహాలు, టీషర్టులు అందుకున్న క్రీడాకారులతో ట్రస్టు సభ్యులు

క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం

విజయవాడ స్పోర్ట్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాదెళ్ల బసవ పూర్ణయ్య ట్రస్టు ప్రతిభ గల క్రీడాకారులను ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని మేనేజింగ్ ట్రస్టీ నాదెళ్ల బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. శనివారం ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, బాక్సింగ్, కబడ్డీ క్రీడల్లో ప్రతిభ గల పేద క్రీడాకారులకు 75 టీషర్టులు అందజేయటంతో పాటు, ఇటువంటి వారికి ట్రస్టు ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మెంబర్ నాదెళ్ల శ్రీనివాస్‌రావు, డాక్టర్ గుమ్మడి దేవేంద్ర రాజా, మాగంటి శ్రీనివాసరావు, నాదెళ్ల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26/27 విద్యా సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్స్ పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఈనెల15లోగా దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. 8వ తరగతి, పదో తరగతి ఉత్తీర్ణులయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468 కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ఉపాధ్యక్షుడు సాంబశివరావు




భారతీనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు తక్షణమే ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ఉపాధ్యక్షుడు వడ్డేల్లి సాంబశివరావు కోరారు. మహానాడు రోడ్డులోని అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం కార్యాలయంలో శనివారం వడ్డేల్లి సాంబశివరావు, మన్నే సోమేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు గల ఉమ్మడి 13జిల్లాలకు చెందిన ఎన్టీఆర్ అభిమానులు హాజరయ్యారు. ఈ సమావేశంలో వడ్డెల్లి సాంబశివరావు మాట్లాడుతూ విజయవాడ విమానాశ్రయానికి ఎన్టీఆర్ విమానాశ్రయంగా పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు ఎస్ఎల్ఎన్ స్వామి, డాక్టర్ ఎ.ప్రభాకరరావు, ఎం.సాంబశివరావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పవర్‌ఫుల్ పాత్రలో



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేసింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ చిత్రంలో 'గౌర్నాయుడు' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా విడుదల కానుంది.

కథ విని ఉద్వేగానికి లోనయ్యా

- సెంథిల్ కుమార్



'ఒక సినిమా అంగీకరించే ముందు కథలో ప్రేక్షకులను కదిలించే బలమైన భావోద్వేగాలు ఉన్నాయా, లేవా? అని చూస్తాను. 'జూనియర్' సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. బలమైన భావోద్వేగాలతో పాటు ప్రేమ, కుటుంబ విలువలతో సినిమా ఆద్యంతం హృద్యంగా ఉంటుంది' అని సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ అన్నారు. గాలి జనార్ధన్‌రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న 'జూనియర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన సెంథిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'దర్శకుడు రాధాకృష్ణ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కొత్త హీరోకు ఇలాంటి సినిమా చేయడం కొంచెం కష్టమే. కానీ కిరీటి ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమా కోసం కష్టపడిన తీరు నాకు నచ్చింది. ఈ సినిమాలో పాటలతో పాటు కిరీటీ, శ్రీలీల జంట చేసిన డాన్స్‌లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. కిరీటి మంచి నటుడు, అద్భుతమైన డాన్సర్. సెట్స్‌లో చాలా కష్టపడ్డాడు. తొలి చిత్రం 'జూనియర్'తోనే ఆయన ప్రేక్షకులను ఆకట్టుకుంటాడనే గట్టి నమ్మకం ఉంది. ఒక మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మాతలు ఈ సినిమా తీశారు' అని చెప్పారు.

బ్యూటిఫుల్ మెలోడీ



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. 'చి ల సౌ'తో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నెల 16న సినిమా నుంచి 'నదివే' అంటూ సాగే పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ బ్యూటిఫుల్ మెలోడీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్.

యాక్టర్స్‌ని తిట్టాను.. కొట్టాను..



ప్రవీణ పరుచూరి

'మా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాలో రెండు పాత్రల మధ్య నడిచే సన్నివేశాలు కీలకంగా నిలుస్తాయి. వారి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా రాకపోతే సినిమా సాదాసీదాగా ఉంటుంది. అందుకే వారి నుంచి మంచి నటన రాబట్టాలనుకన్నాను. సెట్‌లో వారిని తిట్టాను, కొట్టాను, వారిపై రాళ్లు విసిరాను. మనం చేసే పాత్రలో జీవించడమే నటన అని నమ్ముతాను. అందుకే సినిమా కోసం ఏదైనా సరే తప్పదు. అందుకే వారిపట్ల అలా ప్రవర్తించినందుకు క్షమాపణలు చెప్పలేదు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. రానా సమర్పణలో మనోజ్ చంద్ర, మోనికా జంటగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'ప్రవీణ చేసే సినిమాల్లో నటిస్తే సరిపోదు, పాత్రల్లో జీవించాలి. అలా రామకృష్ణ పాత్రకు నేను ప్రాణం పోశానని నమ్ముతున్నాను' అని చెప్పారు.

స్నేహితులే రాజకీయ ప్రత్యర్థులు



ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో 'ప్రస్థానం' ఫేమ్ దేవా కట్టా, జయకిరణ్‌కుమార్ సంయుక్తంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మయసభ. రైజ్ ఆఫ్ ద టైటాన్స్' ట్యాగ్‌లైన్. విజయ్‌కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఆగస్టు 7న ఓటీటీ వేదిక సోనీ లైవ్ ద్వారా అందుబాటులోకి రానుంది. తాజాగా, టీజర్‌ను విడుదల చేశారు. సంభాషణలు, ప్రధాన పాత్రధారుల మధ్య ఉన్న సంఘర్షణ, భావోద్వేగాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు స్నేహితులు కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయ ప్రత్యర్థులుగా మారితే ఎలా ఉంటుందనేది కథాంశం. అయితే వీరిద్దరి పాత్రలు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిని పోలి ఉంటాయని సమాచారం.

చెన్నైలో తెలుగు అబ్బాయి కథ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చెన్నైలో జీవనం కొనసాగిస్తున్న మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తున్నారు. చెన్నై నగరం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని చిత్రబృందం పేర్కొంది.

'సెమిస్టర్'కు కనీస హాజరు ఉండాల్సిందే!

- పరీక్షలకు సంబంధించిన నిబంధన సరైందే
- బీటెక్‌పై హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీస హాజరుశాతం తప్పనిసరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జేఎన్‌టీయూ కాకినాడ, జీఎంఆర్‌ఐటీ రూపొందించిన నిబంధనలను సమర్థించింది. కనీస హాజరు నిబంధన సహేతుకం కాదని, ఏకపక్షం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టం ముందు నిలబడవని పేర్కొంది. సింగిల్ జడ్జి తీర్పులోని ఈ భాగాన్ని రద్దు చేసింది. అయితే, ప్రస్తుత కేసులో కోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి కౌశిక్ తన 4, 5వ సెమిస్టర్‌ను కొనసాగించారని గుర్తు చేసింది. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను రద్దు చేసి, తిరిగి ఆయనను 3వ సెమిస్టర్‌కు పంపించడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఇలా చేయడం వల్ల కౌశిక్ అకడమిక్ ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అకడమిక్ రెగ్యులేషన్ 9(ఐ)(జే) ప్రకారం మేకప్ క్లాస్‌లకు హాజరుకావడం ద్వారా తగిన హాజరుశాతం సాధిస్తే పరీక్ష రాసేందుకు అర్హత సాధించవచ్చని గుర్తు చేసింది. హాజరులోపాన్ని సరిదిద్దుకునేందుకు వీలుగా మేకప్ క్లాస్‌లకు హాజరయ్యేందుకు కౌశిక్‌ను అనుమతించింది. ఈ తీర్పుని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్తున్నామని, భవిష్యత్తులో ఈ ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్‌లో బీటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) అభ్యసిస్తున్న బీవీకే కౌశిక్ అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేక పోయాడు. హాజరుశాతం 65% కన్నా తక్కువగా ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం ఆయనను మూడవ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా, పరీక్షలు రాసేందుకు అనుమతించిన కళాశాల యాజమాన్యం, ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. దీంతో మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించడంతో పాటు నాలుగవ సెమిస్టర్ క్లాసులకు హాజరయ్యేందుకు అనుమతించేలా కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ కౌశిక్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

ఉపాధి కోసం వెళ్లారు... ఉగ్ర మూకల బారిన పడ్డారు

- ఇన్‌స్టా ఉద్యోగ ప్రకటనతో మోసపోయిన ఇంజనీరింగ్ నిరుద్యోగులు
- థాయ్‌ల్యాండ్ వచ్చిన వారిని మయన్మార్‌కు తరలింపు
- డ్రగ్స్ తీసుకోవాలంటూ చిత్రహింసలు
- రక్షించాలని తల్లిదండ్రులకు ఫోన్
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను కలిసిన తల్లిదండ్రులు

విజయనగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన యువత ఉగ్ర, డ్రగ్స్ ముఠాల చేతుల్లో చిక్కుకోవడంతో స్థానికంగా వారి తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారు. తమ పిల్లలను రక్షించి, సురక్షితంగా స్వస్థలాలకు రప్పించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మే నెలలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఆకర్షణీయమైన ప్యాకేజీ కావడంతో విశాఖపట్నం నుంచి ముగ్గురు, విజయనగరం నుంచి ఇద్దరు, కడప జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్ నుంచి ముగ్గురు... మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన థాయ్‌ల్యాండ్ ప్రతినిధులతో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత... ప్రకటనదారులు చెప్పిన తీయని, ఆకర్షణీయమైన కబుర్లను నమ్మారు. వారు సూచించినట్లుగా వారివారి ప్రాంతాల నుంచి బయలుదేరి మే 9న థాయ్‌ల్యాండ్‌కు చేరుకున్నారు. థాయ్‌ల్యాండ్‌లో మొదటి రోజు చక్కగా చూసుకున్న ప్రకటనదారులు... ఆ మరుసటి రోజునే ఉద్యోగం కోసం వచ్చిన వారికి ముసుగులు వేసి మయన్మార్ తరలించారు. వారి కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు... ఉద్యోగార్థులందరినీ మయన్మార్‌లో ఒక నది ఒడ్డున ఉన్న క్యాంప్‌లో ఉంచారు. చిత్రహింసలు పెట్టారు. డ్రగ్స్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేశారు. నిరాకరించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వెళ్లిన 12 మందిలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు... వారి చెర నుంచి తప్పించుకొని స్వస్థలాలకు చేరుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడే ఉన్నారు. ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు ఫోన్‌లో తమ పరిస్థితిని బాధితులు వివరించారు. తామున్న ప్రాంతం లోకేషన్‌ను షేర్ చేశారు. తమను రక్షించాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో బెంబేలెత్తిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలను బాధితుల కుటుంబ సభ్యులు కలిశారు. స్పందించిన పవన్ కల్యాణ్, లోకేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖతో మాట్లాడారు. ఆ ఉగ్రమూకల చెరలో మనదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. తాము చేసుకున్న విన్నపాలపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ లేకపోవడంతో బాధితుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాలతో తమ పిల్లలను ఇళ్లకు చేర్చాలని వారు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు

- 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న మంత్రి నారాయణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు నగరాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయి. 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్' విభాగంలో 10 లక్షల జనాభాపైబడిన నగరాల్లో విజయవాడ, 3-10 లక్షలకు మధ్య ఉన్న నగరాల్లో గుంటూరు, 50 వేలు - 3 లక్షల మధ్య ఉన్న నగరాల్లో తిరుపతి అవార్డులు గెలుచుకున్నాయి. 'మినిస్టీరియల్ అవార్డ్ ప్రత్యేక కేటగిరి'లో జీవీఎంసీ విశాఖపట్టణం, మినిస్టీరియల్ అవార్డు రాష్ట్ర స్థాయి కేటగిరిలో రాజమండ్రికి అవార్డులు వచ్చాయి. ఈనెల 17న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంత్రి పొంగూరు నారాయణ ఈ అవార్డులను అందుకోనున్నారు. అవార్డుల రాకపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమ ఫలితంగానే జాతీయ స్థాయిలో రాష్ట్రంలోని ఐదు నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించాయని అన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ అవార్డులు సాధించడంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి నగర ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. అవార్డులు రావడానికి శ్రమించిన అధికారులు, పారిశుధ్య సిబ్బందికి పట్టాభి అభినందనలు తెలిపారు.

కిల్లర్ స్విచ్



(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. విమానంలోని మొత్తం 242మందిలో 11ఏ సీట్లో కూర్చున్న ఒక్కరు తప్ప మిగతా వారంతా మృతిచెందిన ఈ దుర్ఘటన భారత విమానయాన చరిత్రలోనే అతి పెద్ద విషాదాల్లో ఒకటి. ఏఏఐబీ ఈ ప్రమాదంపై సుమారు నెల రోజులపాటు యూకే విమాన ప్రమాదాల దర్యాప్తు విభాగం, అమెరికా జాతీయ రవాణా భద్రత బోర్డుల సహకారంతో క్షుణ్నంగా పరిశీలన జరిపింది. తాజాగా 15పేజీలతో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. విమానం బ్లాక్‌బాక్స్‌లో నమోదైన సాంకేతిక అంశాలు, పైలట్ల వాయిస్ రికార్డుల వివరాలనూ అందులో వెల్లడించింది.

అంతా 32 సెకన్లలోనే..

● జూన్ 12 మధ్యాహ్నం 13.38 గంటల 39 సెకన్ల సమయంలో (24 గంటల విధానం) విమానం రన్‌వే పైనుంచి గాల్లోకి ఎగిరింది. సుమారు గంటకు 333 కిలోమీటర్ల (180 నాట్స్) వేగాన్ని అందుకుంది. ఆ సమయంలో 54,200 కిలో ల ఇంధనం ఉంది. విమానం మొత్తం బరువు కూడా అనుమతించిన పరిమితిలోపు 2,13,401 కిలోలు ఉంది. వాతావరణం అనుకూలంగా ఉంది. పక్షులేవీ ఢీకొన్న ఆనవాళ్లు లేవు. విమానం రెక్కలకు ఉండే ఫ్లాప్స్ (టేకాఫ్‌కు తోడ్పడే భాగాలు), ల్యాండింగ్ గేర్ సరిగానే ఉన్నాయి.

● 13.38 గంటల 42 సెకన్ల సమయంలో విమానంలోని మొదటి ఇంజన్‌కు ఇంధనం సరఫరా చేసే స్విచ్ 'రన్' మోడ్ నుంచి 'కటాఫ్' మోడ్‌లోకి మారింది. తర్వాత ఒక్క సెకన్‌లోనే రెండో ఇంజన్ ఇంధన సరఫరా స్విచ్ కూడా 'కటాఫ్' మోడ్‌లోకి మారింది. ఇంధన సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 10సెకన్ల పాటు రెండు ఇంజన్లు ఆగిపోయి.. విమానం కిందికి పడిపోవడం మొదలైంది. దీంతో పైలట్లు అప్రమత్తం అయ్యారు. ఒక పైలట్ 'ఇంధన స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావు' అని ప్రశ్నించగా... 'నేనేమీ ఆఫ్ చేయలేదు' అని మరో పైలట్ సమాధానం ఇచ్చారు.

● 13.38గంటల 52సెకన్ల సమయంలో మొదటి ఇంధన స్విచ్, 56 సెకన్ల సమయంలో రెండో స్విచ్ 'రన్' మోడ్‌లోకి మారాయి. రెండు ఇంజన్లకు ఇంధన సరఫరా మొదలైంది. మొదటి ఇంజన్ ఆన్ అయి వేగం అందుకోవడం మొదలైంది. రెండో ఇంజన్ ఆన్ అయినా వేగం పుంజుకోలేదు.

● 13.39గంటల 5సెకన్ల సమయంలో పైలట్లలో ఒకరు 'మేడే.. మేడే..' అంటూ ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్)కి అత్యవసర సందేశం పంపారు. ఏటీసీ తిరిగి పైలట్లతో మాట్లాడటానికి ప్రయత్నించినా.. అప్పటికే సిగ్నల్స్ నిలిచిపోయాయి. తర్వాత ఆరు సెకన్లకే విమానం కూలిపోయింది. మొత్తంగా 32 సెకన్లలోనే అంతా ముగిసిపోయింది.

● విమానం వెనుకభాగంలో 'రామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్)'గా పిలిచే చిన్నపాటి ఇంజన్ ఉంటుంది. విమానం రెండు ఇంజన్లు ఆగిపోయిన పరిస్థితి ఎదురైతే.. అది ఆటోమేటిగ్గా ఆన్ అయి కీలక భాగాలు, కమ్యూనికేషన్ పరికరాలకు విద్యుత్ అందిస్తుంది. ఎయిరిండియా విమానం కూలే ముందు ఈ ర్యాట్ ఆన్ అయింది. దీనితో రెండు ఇంజన్లు ఒక్కసారిగా ఆగిపోయినట్టు నిర్ధారణ అయింది.

● ప్రమాదానికి గురైన విమానం పైలట్లలో సుమిత్ సభర్వాల్ (56) కు 15,638 గంటలు విమానం నడిపిన అనుభవం ఉంది. రెండో పైలట్ క్లైవ్ కుందర్ (32)కు 3,403 గంటల అనుభవం ఉంది. ఆరోగ్యంగా ఫిట్‌గా ఉన్నారు. విమానంలోకి వెళ్లే ముందు వారికి బ్రీత్ అనలైజర్, ఇతర పరీక్షలు కూడా చేశారు.

● కూలిపోవడానికి ముందు విమానంలో ఇంధనం నింపిన ట్యాంకులు, పైపుల నుంచి శాంపిళ్లను సేకరించి పరీక్షించారు. ఇంధనం నాణ్యంగానే ఉందని, లోపమేమీ లేదని తేల్చారు.

● ఇప్పటివరకు లభించిన ఆధారాల మేరకు ప్రమాదం వెనుక కుట్ర కోణమేదీలేదని భావిస్తున్నట్టు ఏఏఐబీ నివేదికలో పేర్కొంది. మరిన్ని ఆధారాలను, రికార్డులను పరిశీలించాక స్పష్టత వస్తుందని తెలిపింది.

ఆ స్విచ్‌లు అంత సులువుగా కదలవు!

విమానంలోని బ్లాక్‌బాక్స్‌లో 'ఎన్‌హాన్స్‌డ్ ఎయిర్‌బార్న్ ఫ్లైట్ రికార్డర్ (ఈఏఎఫ్ఆర్)', 'కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్)' పరికరాలు ఉంటాయి. విమానానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఈఏఎఫ్ఆర్ ఎప్పటికప్పుడు నమోదు చేస్తే పైలట్ల మధ్య సంభాషణలను సీవీఆర్ నమోదు చేస్తుంది. విమానం టేకాఫ్ తీసుకోగానే రెండు ఇంజన్ల ఇంధన స్విచ్‌లు 'రన్ మోడ్' నుంచి 'కటాఫ్' కు మారినట్టు 'ఈఏఎఫ్ఆర్' డేటా ఆధారంగా గుర్తించారు. 'స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ అంటే.. నేనేమీ చేయలేదంటూ' పైలట్లు గందరగోళానికి లోనవడం 'సీవీఆర్'లో నమోదైంది. పైలట్ల సంభాషణను బట్టి.. వారు ఆఫ్ చేసినట్టు కనిపించడం లేదు. పొరపాటున చేయిగానీ, ఏదైనా వస్తువుగానీ తగిలి ఇంధన స్విచ్‌లు కదిలే అవకాశమూ లేదు. పైకి కిందికి కదిలే మోడల్‌లోని ఈ స్విచ్‌లలో స్టాప్‌లాక్ ఏర్పాటు ఉంటుంది. నేరుగా వేలితో నొక్కినంత మాత్రన కదలవు. స్విచ్‌ను పట్టుకుని, లాగి.. పైకిగానీ, కిందకుగానీ జరిపాక వదిలేయాల్సి ఉంటుంది. ఇక ల్యాండింగ్ తర్వాత విమానం ఇంజన్లను ఆఫ్ చేయడానికి, గాల్లో ఎగురుతున్నప్పుడు ఇంజన్‌లో మంటలురావడం లేదా ఏదైనా సమస్య తలెత్తడం వంటివి జరిగితే ఇంజన్లను ఆపడానికి, తిరిగి ప్రారంభించడానికి ఇంధన స్విచ్‌లను వినియోగిస్తారు. ఈ స్విచ్‌లు స్వతంత్ర విద్యుత్ వ్యవస్థతో అనుసంధానమై ఉంటాయని.. ఇంజన్లకు విద్యుత్ సరఫరాను, ఇంధన వాల్వ్‌లను నియంత్రిస్తాయని అమెరికా విమానయాన నిపుణుడు జాన్ కాక్స్ తెలిపారు. ఈ స్విచ్‌లు ఎలా కటాఫ్ మోడ్‌కు మారాయో ఏఏఐబీ నివేదికలో పేర్కొనలేదు.

దర్యాప్తుకు సహకరిస్తాం: బోయింగ్

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తి సహకారం కొనసాగిస్తామని విమాన తయారీ సంస్థ బోయింగ్ ప్రకటించింది. ప్రమాదంపై ఏఏఐబీ ప్రాథమిక నివేదికను విడుదల చేసిన నేపథ్యంలో బోయింగ్ శనివారం ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని ఏఏఐబీకి అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. 'దర్యాప్తునకు, మా కస్టమర్లకు మా మద్దతును కొనసాగిస్తాం. ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఏఐ171 విమానానికి సంబంధించిన సమాచారాన్ని ఏఏఐబీకి అందజేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని పేర్కొంది.

జవాబులు లేని ప్రశ్నలెన్నో..

ఇంధన స్విచ్‌లు ఎలా కటాఫ్ అయ్యాయి? మొదటి పైలట్ అలా ఎందుకు అడిగారు? వారి నియంత్రణలో లేని పరిస్థితి ఏదైనా నెలకొందా? ఇంధన స్విచ్‌లలో సాంకేతిక, నిర్మాణపరమైన లోపాలున్నాయా? వంటి ప్రశ్నలెన్నో వెల్లువెత్తుతున్నాయి.

● విమాన 2 ఇంజన్లు ఒక్కసారిగా ఆగిపోవడానికి, ఒక ఇంజన్ ఆన్ అయినా, మరొకటి మొరాయించడానికి కారణా లు ఏఏఐబీ నివేదికలో పేర్కొనలేదు.

● ప్రమాదానికి గురయ్యే ముందు ఏఐ423 సర్వీసు కింద ఈ విమానం నడిచింది. అప్పటి విమాన సిబ్బంది స్టెబిలైజర్ సెన్సర్‌లో సమస్యని గుర్తించి రిపోర్టు చేశారు. ఎయిరిండియా ఇంజనీర్లు దాన్ని పరిష్కరించి ప్రయాణానికి సిద్ధం చేశారు. అదే సమస్య మళ్లీ ఉత్పన్నమైందా? అన్న ప్రస్తావన నివేదికలో లేదు.

● మానవ తప్పిదాన్ని కూడా నివేదిక ధ్రువీకరించలేదు. కాక్‌పిట్‌లో ఏం జరిగిందన్న దానిపై ఇంకా పరిశీలన కొనసాగుతోందని ఏఏఐబీ తెలిపింది.

● కాక్‌పిట్‌లోని పైలట్లలో ఇంధన స్విచ్ గురించి ఎవరు ఎవరిని అడిగారనేది వెల్లడించలేదు. 32 సెకన్ల పాటు విమానం గాలిలో ఉంటే.. కేవలం ఒక్కో వాక్యాన్నే బహిర్గతం చేసింది. మిగతా వివరాలు ఏమయ్యాయి?

అమెరికా ముందే హెచ్చరించిందా?

బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌ల వ్యవస్థలో లోపాలున్నాయని అమెరికా పౌర విమానయాన సంస్థ (ఎఫ్ఏఏ) 2018లోనే హెచ్చరించింది. ఈ అంశాన్ని ఎయిరిండియా దృష్టికీ తెచ్చింది. బోయింగ్ 737, 787 విమానాల్లోని ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థలో లోపం ఉందని, ఆ లాక్ సులువుగా వదులయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ ఎఫ్ఏఏ 2018 డిసెంబర్‌లో ప్రత్యేక వైమానిక సమాచార బులెటిన్ (ఎస్ఏఐబీ)లో పేర్కొంది. అయితే అది సమాచారం మాత్రమే. తప్పనిసరిగా పాటించాల్సిన సూచనగానీ, ప్రమాదకరమనే హెచ్చరికగానీ కాదు. దీనితో ఎయిరిండియా తమ విమానాల్లో ఈ ఇంధన స్విచ్‌ల వ్యవస్థకు సంబంధించిన తనిఖీలు నిర్వహించలేదని తెలిపింది. ఇంధన స్విచ్‌లలో ఇప్పటివరకు ఎలాంటి లోపాలు బయటపడలేదని, పైలట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొంది.

పైలట్ కావాలనే కూల్చేశాడా?

ఇది కావాలని చేసిన మానవ చర్యే

ప్రముఖ నిపుణుడు కెప్టెన్ మోహన్ రంగనాథన్

న్యూఢిల్లీ, జూలై 12: విమానంలో ఒక్కసారిగా ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోవడం.. దీనిపై కాక్‌పిట్‌లోని పైలట్ల మధ్య సాగిన సంవాదం గమనిస్తే, విమానాన్ని పైలట్ కావాలనే కూల్చివేసినట్టు అనిపిస్తోందని ప్రముఖ విమానయాన నిపుణుడు, కెప్టెన్ మోహన్ రంగనాథన్ అభిప్రాయపడ్డారు. ఏఏఐబీ ప్రాథమిక నివేదికపై ఓ ఆంగ్ల చానల్ ప్రతినిధితో ఆయన మాట్లాడారు. 'కచ్చితంగా మానవ చర్యే విమాన ప్రమాదానికి కారణం. దాని అంతట అది ఆటోమేటిక్‌గానో లేక పవర్ ఫెయిల్యూర్ అయిన కారణంగానో ఈ ప్రమాదం జరిగే చాన్స్ లేదు. దీని ఇంధన స్విచ్‌లు స్లైడింగ్ తరహావి. ఇంధన సెలక్టర్లను కిందకు, మీదకు కదిలించాలంటే వాటిని బలంగా పట్టుకుని లాగాలి. అనుకోకుండా వాటంతటవే 'ఆఫ్' అయ్యే అవకాశమే లేదు. ఇంధన సెలక్టర్లను కావాలనే ఆఫ్' మోడ్‌లోకి తెచ్చారు" అని పేర్కొన్నారు. ఇక ఏఏఐబీ నివేదికలో పస లేదని, మరింత లోతుగా విచారణ సాగాల్సిన అవసరం ఉందని నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ అన్నారు.

అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దు

ఇది ప్రాథమిక నివేదికే: రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, జూలై 12: ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రస్తుతం వచ్చింది ప్రాథమిక నివేదిక మాత్రమేనని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. తుది నివేదిక వెలువడే వరకు ఒక నిర్ణయానికి రావొద్దని కోరారు. ఈ దుర్ఘటనపై దర్యాప్తును సవాలుతో కూడుకున్నదన్నారు. ఇందులో ఎన్నో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయని, అందువల్ల ఈ నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. "ఈ నివేదికను పౌర విమానయాన శాఖ క్షుణ్నంగా విశ్లేషిస్తోంది. ఇప్పుడే ఎలాంటి నిర్ణయాలకు రాకూడదు. తుది నివేదిక వెలువడిన తర్వాత మాత్రమే ఒక నిర్ణయానికి రాగలం' అని మంత్రి తెలిపారు. కాగా, చాలా తక్కువ సమయం మాత్రమే జరిగిన పైలట్ల సంభాషణ ఆధారంగా విమాన ప్రమాదంపై ఒక నిర్ణయానికి రాలేమని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



పైలట్లపైకి తప్పు నెట్టే యత్నం!

▸▸ పైలట్ల అసోసియేషన్ మండిపాటు

న్యూఢిల్లీ, జూలై 12: అహ్మదాబాద్ దుర్ఘటనపై ఏఏఐబీ విడుదల చేసిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆల్పా) ఖండించింది. ప్రమాదానికి సంబంధించి పైలట్లపైకి తప్పు నెట్టేసే ప్రయత్నంలా ఉందని మండిపడింది. ఈమేరకు ఆల్పా అధ్యక్షుడు శామ్ థామస్ ఓ ప్రకటన విడుదల చేశారు. "విమాన ఇంధన నియంత్రణ స్విచ్‌ల అంశం ప్రమాదానికి కారణమని అమెరికాలోని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జూలై 10నే కథనం ప్రచురించింది. ఏఏఐబీ దర్యాప్తులోని రహస్య అంశం ముందే ఎలా బయటికి వెళ్లింది? నివేదికపై సంబంధిత అధికారుల సంతకాలు కూడా లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. దర్యాప్తు బృందంలో సరైన నిపుణులు కూడా లేరు. ఇవన్నీ దర్యాప్తు విశ్వసనీయతపై సందేహాలు కలిగిస్తున్నాయి"అని పేర్కొన్నారు. విమాన ప్రమాద దర్యాప్తులో పైలట్లనూ భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కనీసం పరిశీలకులుగానైనా పైలట్లకు అవకాశమిస్తే దర్యాప్తులో పారదర్శకత ఉంటుందన్నారు. ఈ డిమాండ్‌పై ఎయిరిండియా స్పందించింది. ఏఏఐబీ నివేదికపై సమీక్షించేందుకు పైలట్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని సంస్థ ఫ్లైట్ ఆపరేషన్స్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మనీష్‌ఉప్పల్ ప్రకటించారు.

పాశ్చాత్య మీడియా తీరు దారుణం: బీజేపీ

బోయింగ్ 787 విమానంలో లోపమేమీ లేదని, పైలట్ ఇంజన్‌కు ఇంధన సరఫరా ఆపేయడంతోనే ప్రమాదం జరిగిందని పాశ్చాత్య మీడియా ప్రచా రం చేయడం దారుణమని బీజేపీ మండిపడింది. దీనిపై ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఏఏఐబీ నివేదికలోని ఒక అంశాన్ని పట్టుకుని పాశ్చాత్య మీడియా వార్తలు ప్రచురిస్తున్న తీరు అగౌరవకరం. మరణించిన పైలట్లపై అపనిందలు వేస్తున్న తీరు దారుణం" అని పేర్కొన్నారు.

ఉపాధి కల్పనకు కట్టుబడి ఉన్నాం: మోదీ

▸▸ రోజ్‌గార్ మేళాలో 51వేల మందికి ఉద్యోగ పత్రాలు

న్యూఢిల్లీ, జూలై 12: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత 11ఏళ్లలో దేశం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందని ప్రధాని మోదీ అన్నారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా.. ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఎంపికైన 51వేల మందికి శనివారం ప్రధాని వర్చువల్‌గా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ప్రసంగించిన మోదీ.. ప్రైవేట్ రంగంలో మొదటిసారి ఉద్యోగం పొందినవారికి మొదటి నెల జీతానికి తోడ్పాటుగా.. రూ.15 వేలు ప్రోత్సాహకంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇందుకోసం ఉద్యోగుల ప్రోత్సాహక పథకం కింద బడ్జెట్‌లో లక్ష కోట్లు కేటాయించామన్నారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 10 లక్షల నియామక పత్రాలు పంపిణీ చేశామని ప్రధాని తెలిపారు.

నిమిష ప్రియను కాపాడండి: కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, జూలై 12: యెమెన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొంటున్న కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియను కాపాడాలని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. ఆమెను ఈ నెల 16న ఉరి తీయనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇదే విషయపై సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. నిమిషకు క్షమాభిక్ష లభించేలా కేంద్రం కృషి చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ డిమాండ్ చేశారు.

భూమికి తిరిగొచ్చాక వారం పాటు.. వైద్యుల పర్యవేక్షణలోనే శుభాంశు

న్యూఢిల్లీ, జూలై 12: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రా(ఐఎస్ఎస్)నికి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఈ నెల 15న(భారత కాలమానం ప్రకారం) తిరిగి భూమిపై కాలు మోపనున్నారు. ఆ తర్వాత ఆయన ఏడు రోజులపాటు వ్యోమగాముల పునరావాస కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో గడుపుతారు. ఆయనతో పాటు.. ఇతర వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ, టిబర్ కపులపైనా వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. శుభాంశు, ఇతర వ్యోమగాములు గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే.! దాదాపు రెండు వారాల పాటు ఐఎస్ఎస్‌లో ఉన్నారు.

నీట్-యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

అమరావతి జూలై 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన నీట్-యూజీ 2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఆలిండియా కోటా, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్ తేదీలను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) శనివారం విడుదల చేసింది. నీట్ 2025లో అర్హత సాధించిన వారు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. తొలుత అఖిల భారత కోటాకు కౌన్సెలింగ్ జరగనుంది. వారం వ్యవధిలో రాష్ట్ర స్థాయిలో కౌన్సెలింగ్‌ను ఆయా రాష్ట్రాల పరిధిలోని ఆరోగ్య యూనివర్సిటీలు నిర్వహిస్తాయి. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ఎంపిక అనంతరం సీటు అలాట్‌మెంట్ జరిగాక ఫిజికల్‌గా రిపోర్టు చేయాలని ఎంసీసీ వెబ్‌సైట్‌లో పేర్కొంది. జూలై 21 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొంది. గతనెల 14న నీట్ ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం రాష్ట్రస్థాయి ర్యాంకుల వివరాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసింది. రాష్ట్రంలో ఈ నెల 30 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమై అక్టోబరు 3 నాటికి ముగియనుంది. ఇందుకు సంబంధించి హెల్త్ వర్సిటీ త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రాష్ట్రంలోని 16 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 3,385 ఎంబీబీఎస్ సీట్లు, 20 ప్రైవేటు వైద్య కళాశాలల్లో 3,400 సీట్లున్నాయి. అలాగే రెండు ప్రభుత్వ బీడీఎస్ కాలేజీల్లో 140 సీట్లు, 15 ప్రైవేటు బీడీఎస్ కళాశాలల్లో 1,300 సీట్లు ఉన్నాయి. ఇక సెప్టెంబరు 1 నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమవుతాయని ఎంసీసీ పేర్కొంది. కాగా, ఆలిండియా కోటా కింద దేశంలోని అన్ని ఎయిమ్స్, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, జిప్‌మర్ (పుదుచ్చేరి, కరైకల్)లో ఉన్న యూజీ సీట్లను భర్తీ చేస్తారు. మొత్తం నాలుగు రౌండ్ల కౌన్సెలింగ్ ఉంటుంది. మూడు విడతల కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత ఇంకా మిగిలిపోయిన సీట్లను నాలుగో విడత (స్ట్రే వెకెన్సీ) ద్వారా భర్తీ చేస్తారు.

ప్రపంచంలో వేగంగా పెరుగుతున్న ముస్లిం జనాభా

న్యూఢిల్లీ, జూలై 12: ప్రపంచ వ్యాప్తంగా ముస్లింల జనాభా అత్యంత వేగంగా పెరుగుతోందని 'ప్యూ రిసెర్చ్ సెంటర్' నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. అదే సమయంలో ఏ మతాన్ని పాటించని వారి సంఖ్య పెరుగుతోందని, క్రైస్తవులు, హిందువుల సంఖ్య తగ్గుతోందని తెలిపింది. ఈ సంస్థ 2010-20 మధ్య కాలంలో నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ప్రపంచంలోనే అతిపెద్ద మతంగా ఉన్న క్రైస్తవంలో జనాభా ఈ పదేళ్లలో 1.8% మేర తగ్గి.. ప్రపంచ జనాభాలో 28.8శాతానికి పడిపోయింది. అయినా.. అతిపెద్ద మత సముదాయంగా క్రైస్తవం కొనసాగుతోంది. అదే సమయంలో ముస్లింల జనాభా 23.9% నుంచి 25.6శాతానికి పెరిగింది. ఇంచుమించుగా క్రైస్తవ జనాభాకు సమానంగా ఎదుగుతోంది. ఇక ఏ మతంతో సంబంధం లేదని చెప్పుకొనే వారి సంఖ్య కూడా 23.3% నుంచి 24.2శాతానికి పెరిగినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. హిందువులు 15% నుంచి 14.9శాతానికి తగ్గిపోయారని.. అయితే.. వారి సంఖ్య పెరిగిందని వివరించింది. 2010లో ప్రపంచంలో 110 కోట్ల మంది హిందువులు ఉండగా.. 2020లో ఆ సంఖ్య 120 కోట్లకు పెరిగింది. బౌద్ధులు, యూదులు, ఇతర మతస్థుల జనాభా కూడా తగ్గుతోందని పేర్కొంది. కాగా.. మతమార్పిడి అనేది హిందువులు, ముస్లింలలోనే అతి తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది.

భారత్‌లో..

ప్రపంచంలోని హిందువుల్లో 95%మంది భారత్‌లోనే ఉంటున్నారు. 2010లో భారత్‌లో హిందువుల జనాభా 80% కాగా.. 2020కి ఇది 79 శాతానికి పడిపోయింది. అదే సమయంలో భారత్‌లో ముస్లింల జనాభా14.3% నుంచి 15.2 శాతానికి పెరిగినట్లు అధ్యయనం పేర్కొంది

భారత్‌పై 20% లోపే సుంకాలు!



ట్రంప్ సర్కారు నిర్ణయం

తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సన్నాహాలు

వాషింగ్టన్, జూలై 12: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యాక ట్రంప్ సుంకాల బాదుడుకు పలు దేశాలు విలవిల్లాడుతున్నాయి. ప్రపంచ షేర్ మార్కెట్లు 'బేర్'మంటున్నాయి. చైనా లాంటి దేశాలపై పదుల్లో కాకుండా.. వందల శాతాల మేర సుంకాల బాదుడుతో ట్రంప్ దూసుకుపోతున్నారు. ఇటీవల బ్రిక్స్ దేశాలకు 50శాతానికి పైగా సుంకాలు తప్పవని, భారత్ కూడా మినహాయింపు కాదని హెచ్చరించిన సంగతి తెలిసిందే..! అయితే.. త్వరలో భారత్‌తో కుదరనున్న తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ప్రకారం అమెరికా దిగుమతి చేసుకునే భారతీయ ఉత్పత్తులపై సుంకాలను 26%(ముందుగా ప్రకటించినది) కాకుండా.. 20% కంటే తక్కువగా ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపినట్లు పలు వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. ఈ ఒప్పందంతో ట్రంప్ పాలనలో వాణిజ్య ఒప్పందం చేసుకున్న ఆరు దైన దేశాల జాబితాలో భారత్ చేరనుంది. ఇప్పటికే బ్రిటన్ ఈ జాబితాలో ఉంది. ఇక ఆసియా దేశాలైన మయన్మార్‌పై 40%, వియత్నాం, ఫిలిప్పీన్స్‌లపై 20% మేర అమెరికా సుంకాలు కొనసాగుతున్నాయి. భారత్ మాత్రం అధిక సుంకాల జాబితాలో చేరకపోవచ్చని బ్లూమ్‌బెర్గ్ కూడా ఓ నివేదికలో పేర్కొంది. మరోవైపు అమెరికాతో వాణిజ్య చర్చలకు భారత్ వడివడిగా అడుగులు వేస్తోంది. ఓ ప్రతినిధి బృందం అమెరికాకు చేరుకుని, అక్కడి అధికారులతో చర్చలు జరపనుంది. ఇప్పటికే భారత్ తన తుది ప్రతిపాదనను అమెరికాకు అందజేసింది. జన్యు మార్పిడి(జీఎ) పంటలకు భారత్ వ్యతిరేకంగా ఉన్న విషయం తెలిసిందే.! అయితే.. అమెరికా తన తాత్కాలిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత్‌పై జీఎ పంటల విషయంలో ఒత్తిడి చేసే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి భారత్ అంగీకరించకపోవచ్చని తెలుస్తోంది. ఇటు ఔషధ రంగ నియంత్రణ సమస్యలు కూడా ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. ప్రస్తుత చర్చల తర్వాత తాత్కాలిక ఒప్పందం కుదురుతుందని, ఈ ఏడాది చివరికి తుది ఒప్పందంపై ప్రకటన ఉంటుందని సమాచారం.

నిబంధనలు పాటించకుంటే వీసా రద్దు

న్యూఢిల్లీ, జూలై 12: అమెరికా చట్టాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు ఉల్లంఘిస్తే వారిని అగ్రరాజ్యం నుంచి పంపించి వేయనున్నట్టు శనివారం భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది. వీసా జారీ చేసినా యూఎస్ వీసా స్క్రీనింగ్ ముగిసిపోదని, అన్ని అమెరికా చట్టాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు పాటిస్తున్నదీ లేనిదీ ఒక కంట కనిపెడుతూనే ఉంటామని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. అగ్రరాజ్యం చట్టాలు, నిబంధనలను పాటించకుంటే వారి వీసాలను రద్దు చేయడమేకాకుండా దేశం నుంచి వారిని పంపించివేయనున్నట్టు స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక ఇమ్మిగ్రేషన్ విధానాలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే.

కౌన్సెలింగ్ అని పిలిచి.. డ్రగ్స్ ఇచ్చి అత్యాచారం

▸▸ ఐఐఎం కోల్‌కతా విద్యార్థినిపై సహచర విద్యార్థి అఘాయిత్యం.. నిందితుడి అరెస్టు

▸▸ రేప్ జరగలేదన్న బాధితురాలి తండ్రి

కోల్‌కతా, జూలై 12: పశ్చిమ బెంగాల్‌లో న్యాయ కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన మరవక ముందే.. తాజాగా మరో విద్యార్థిని అఘాయిత్యానికి గురైంది. కోల్‌కతాలోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై.. సహచర విద్యార్థే అత్యాచారానికి పాల్పడ్డాడు. కౌన్సెలింగ్ ఇస్తానని ఆమెను క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌కు రప్పించుకున్న అతడు.. డ్రగ్స్ కలిపిన శీతల పానీయం ఇచ్చి దారుణానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడితో ఆమెకు ముందు నుంచే పరిచయముంది. కౌన్సెలింగ్ సెషన్ అని చెప్పి శుక్రవారం ఆమెను క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌కు ఆహ్వానించడంతో నమ్మి అక్కడికి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే డ్రగ్స్ కలిపిన శీతల పానీయం, పిజ్జా ఇవ్వడంతో అవి తీసుకున్న కాసేపటికే ఆమె స్పృహ కోల్పోతున్నట్లు అనిపించి.. తనను రెస్ట్ రూమ్‌కు తీసుకెళ్లాలని కోరింది. అయితే అతడు తనపై దాడి చేసి.. అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మత్తు నుంచి కోలుకునేందుకు సాయంత్రమైందని.. హాస్టల్ గది నుంచి బయటకు వచ్చి మరో విద్యార్థి సాయంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నట్లు వెల్లడించింది. దీంతో పోలీసులు నిందితుడిని మహావీర్ తోప్పన్నవార్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. శనివారం అతడిని అలీపోర్ కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయమూర్తి ఈనెల 19 వరకు రిమాండ్ విధించారు. అయితే తన కూతురిపై అత్యాచారం జరగలేదని బాధితురాలి తం డ్రి చెప్పారు. 'నా కూతురు ఆటో నుంచి కింద పడటంతో స్పృహ కోల్పోయినట్లు ఫోన్ వచ్చింది. పోలీసులు ఆమెను రక్షించి ఆస్పత్రికి తరలించారన్నారు. ఆమెను నేరుగా వెళ్లి కలిశాను. ఎలాంటి లైంగికదాడి జరగలేదని చెప్పింది' అని వెల్లడించారు.

గోకర్ణ అడవి గుహలో రష్యా మహిళ

▸▸ ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నట్టు గుర్తింపు

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉత్తర కన్నడ జిల్లా గోకర్ణ అటవీ ప్రాంతంలోని రామతీర్థకొండ గుహ వద్ద రష్యాకు చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో ఆవాసాన్ని ఏర్పరచుకున్నారు. పర్యాటకుల రక్షణ కోసం ఏర్పాటైన పోలీసు పెట్రోలింగ్ టీం వీరిని గుర్తించింది. అటవీ ప్రాంతంలో ఒక చోట దుస్తులు కనిపించడంతో ఎవరో ఉన్నట్టు అనుమానించి, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. గుహ సమీపంలోని ఓ కుటీరంలో రష్యాకు చెందిన నీనా కుటీనా(40), ఆమె పిల్లలు ప్రేమ(6), అమా(4) ఉన్నట్టు గుర్తించారు. దేవుడి పూజ, ధ్యానం పట్ల ఆసక్తితో తాను ఇక్కడ ఉంటున్నానని నీనా పోలీసులకు వివరించారు. ఆధ్యాత్మిక చింతన కోసం గోవా నుంచి పిల్లలతో కలిసి గోకర్ణకు వచ్చానని తెలిపారు. వారు ఉంటున్న గుహ ప్రాంతం అత్యంత ప్రమాదకరమైనది. అక్కడ పాములతోపాటు వన్యప్రాణులు ఉంటాయి. తరచూ మట్టి చరియలు విరిగి పడుతుంటాయి. దీంతో పోలీసులు ఆమెకు నచ్చజెప్పి కుమట తాలూకా బంకికొడ్ల గ్రామంలో ఉన్న శంకర ప్రసాద్ ఫౌండేషన్‌కు చెందిన సరస్వతి స్వామీజీ ఆశ్రమానికి తరలించారు. కాగా.. ఆమె పాస్‌పోర్ట్ గడువు 2017 ఏప్రిల్ 17న ముగిసినట్టు గుర్తించారు. తాత్కాలికంగా ఆశ్రమంలో ఉంచిన పోలీసులు, ఈ నెల 14న బెంగళూరు శాంతినగర్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓ కార్యాలయంలో హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కమలాలు పూసే.. కాశ్మీరం మురిసె!

బండిపోరా, జూలై 12: ఉత్తర కశ్మీర్‌లోని వులర్ మంచినీటి సరస్సు తామర పువ్వులతో కళకళలాడుతోంది! ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సరస్సులో కమలాలు విరబూశాయి. బండిపోరా జిల్లా హరముఖ్ పర్వత శ్రేణి నుంచి బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణం దాకా దాదాపు 24 కి.మీ మేర పొడవుతో, 200 చ.కి.మీ మేర విస్తరించి ఉన్న వులార్ సరస్సు 1992 దాకా తామరలతో తళుకులీనిన సరస్సే. అయితే ఆ ఏడాది వచ్చిన వరదల కారణంగా బురద పేరుకుపోయి.. సరస్సు సోయగమే దెబ్బతింది. ఆ తర్వాత అక్కడ పద్మాలు కనిపించలేదు. స్థానికులు తామర విత్తనాలు చల్లినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు అక్కడ నీళ్ల మీద పచ్చని పాన్పు పరిచినట్లుగా తామర తీగలు.. వాటి మధ్యలో గులాబీ రంగులో పూసిన తామరలు వీక్షకులను కనువిందు చేస్తున్నాయి.

సెంజి కోటకు యునెస్కో గుర్తింపు

చెన్నై, జూలై 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు విల్లుపురం జిల్లాలోని చారిత్రక ప్రాంతం సెంజి కోటను ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది. దేశంలో మహారాష్ట్రీయులు నిర్మించిన 12 కోటలకు ఈ మేరకు గుర్తింపునిస్తూ శుక్రవారం ప్రకటన వెలువరించింది. గతంలో తంజావూరు బృహదీశ్వరాలయం, కుంభకోణం ఐరావతేశ్వర ఆలయం, జయంకొండం గంగ కొండ చోళపురం ఆలయం, మహాబలిపురంలోని శిల్ప కళాఖండాలు, నీలగిరి కొండ రైలును ఆ సంస్థ ప్రపంచ వారసత్వ సంపదలుగా ప్రకటించింది. దీంతో తమిళనాట యునెస్కో గుర్తింపు పొందిన ప్రాంతాల సంఖ్య ఆరుకు పెరిగింది. యునెస్కో ప్రతినిధి హవాజంగ్ జగామస్ నేతృత్వంలోని బృందం సెంజి కోటను గతేడాది సెప్టెంబర్‌లో క్షుణ్ణంగా పరిశీలించింది.

యువ భారత్ 450/7

ఇంగ్లండ్ అండర్-19తో యూత్ టెస్టు

బెకెన్‌హామ్: ఆయుష్ మాత్రే (102) శతకంతో పాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో.. ఇంగ్లండ్ అండర్-19తో తొలి అనధికార యూత్ టెస్టులో భారత యువ జట్టు భారీ స్కోరు చేసింది. శనివారం మొదలైన టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న భారత అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 450 పరుగులు చేసింది. ఆట చివరకు అంబ్రిష్ (31), హనీల్ పటేల్ (6) క్రీజులో ఉన్నారు. అభిజ్ఞాన్ కుందు (90), రాహుల్ కుమార్ (85), విహాన్ మల్హోత్రా (67) హాఫ్ సెంచరీలు సాధించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (14) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు.

హంపి, హారికకు డ్రా

బటూమి (జార్జియా): ఫిడే మహిళల చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికకు డ్రాలే ఎదురయ్యాయి. శనివారం జరిగిన మూడో రౌండ్ తొలి గేమ్‌లో కులోన్ క్లాడియా (పోలెండ్)తో హంపి, స్త్రవేలా (గ్రీస్)తో హారిక పాయింట్ పంచుకొన్నారు. ఇంజాక్ (సెర్బియా)పై దివ్య దేశ్‌ముఖ్, కేటరీనాపై వంతిక అగర్వాల్ నెగ్గగా.. యప్ కరీసా (అమెరికా)తో గేమ్‌ను వైశాలి డ్రాగా ముగించింది. ఆదివారం మూడో రౌండ్ రెండో గేమ్ జరగనుంది.

సెలీసియా డైమండ్ లీగ్‌లో

నీరజ్, అర్షద్ అమీతుమీ

సెలీసియా (పోలెండ్): క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య పోటీ ఎప్పుడూ ఆసక్తికరమే. అది ఇప్పుడు జావెలిన్ త్రో క్రీడకు కూడా పాకింది. వచ్చే నెల 16న పోలెండ్‌లోని సెలీసియాలో జరిగే డైమండ్ లీగ్‌లో వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ (పాకిస్థాన్) తలపడనున్నారు. పారిస్ విశ్వక్రీడల తర్వాత వీరిద్దరూ పోటీపడడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది గాయంతో అర్షద్ కొన్నాళ్లు టోర్నీలకు దూరం కాగా.. నీరజ్ వరుస టైటిళ్లతో ఫుల్‌ఫామ్‌లో ఉన్నాడు. నిరుడు పారిస్ విశ్వక్రీడల్లో అర్షద్ స్వర్ణం గెలిస్తే, నీరజ్ రజతంతో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.

ఏపీకి మరో రెండు పతకాలు

ఇండియన్ పారా అథ్లెటిక్స్



బెంగళూరు: ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు మరో రెండు పతకాలు సాధించారు. శనివారం ఇక్కడ ముగిసిన చివరిరోజు పోటీల్లో భవాని 200 మీటర్లలో రజతం, వెంకటేశ్వర్లు లాంగ్ జంప్‌లో రజతం నెగ్గారు.



పంత్ (74)

జడేజా (72)

రాహుల్ (100)

1 ఇంగ్లండ్‌పై టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (35) బాదిన ప్లేయర్‌గా వివ్ రిచర్డ్స్ (34)ను అధిగమించిన రిషభ్ పంత్. అలాగే ఇంగ్లండ్‌లో ఎక్కువ (8) 50+ స్కోర్లు సాధించిన పర్యాటక జట్టు వికెట్ కీపర్‌గా ధోనీతో సమంగా నిలిచిన పంత్.

విదేశాల్లో జరిగిన టెస్టు సిరీస్‌లో ఎక్కువ సిక్సర్లు (36) బాదిన జట్టుగా భారత్.

2 లార్డ్స్‌లో ఎక్కువ శతకాలు (2) బాదిన రెండో భారత ఆటగాడిగా రాహుల్. దిలీప్ వెంగ్‌సర్కార్ (3) ముందున్నాడు.

సమంగా నిలిచారు

- భారత్ తొలి ఇన్నింగ్స్ 387
- రాహుల్ శతకం
- రాణించిన పంత్, జడేజా
- ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (సి) బ్రూక్ (బి) బషీర్ 100; కరుణ్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; గిల్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ (రనౌట్/స్టోక్స్) 74; జడేజా (సి) స్మిత్ (బి) వోక్స్ 72; నితీశ్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 30; సుందర్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 23; ఆకాశ్ (సి) బ్రూక్ (బి) కార్స్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) వోక్స్ 0; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 119.2 ఓవర్లలో 387 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-13, 2-74, 3-107, 4-248, 5-254, 6-326, 7-376, 8-385, 9-387, 10-387. **బౌలింగ్:** వోక్స్ 27-5-84-3; ఆర్చర్ 23.2-6-52-2; కార్స్ 24-5-88-1; స్టోక్స్ 20-4-63-2; బషీర్ 14.5-2-59-1; రూట్ 10.1-0-35-0.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బ్యాటింగ్) 2; డకెట్ (బ్యాటింగ్) 0; **మొత్తం: ఒక ఓవర్‌లో 2/0. బౌలింగ్:** బుమ్రా 1-0-2-0.

లండన్: ఐదు టెస్టుల సిరీస్‌లో లార్డ్స్ మ్యాచ్ అత్యంత రసవత్తరంగా సాగుతోంది. మూడో టెస్టులో శనివారం కేఎల్ రాహుల్ (100) శతకంతో సత్తా చాటగా.. రిషభ్ పంత్ (74), జడేజా (72) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. అయితే ఆఖర్లో ఇంగ్లండ్ పేసర్లు దెబ్బతీయడంతో గిల్ సేన పైచేయి సాధించే అవకాశాన్ని కోల్పోయింది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులే చేయగలిగింది. ఇంగ్లండ్ కూడా తమ ఇన్నింగ్స్‌లో ఇంతే స్కోరు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇరు జట్లలో ఎవరికీ ఆధిక్యం లభించలేదు. పేసర్లు వోక్స్‌కు మూడు.. స్టోక్స్, ఆర్చర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక రెండో సెషన్‌లో కేవలం ఒకే ఓవర్ ఆడిన ఇంగ్లండ్ మూడో రోజును వికెట్ నష్టపోకుండా 2 పరుగులతో ముగించింది. అయితే మరో ఓవర్‌కు వెళ్లకూడదనే ఉద్దేశంతో ఓపెనర్లు క్రాలే (2 బ్యాటింగ్), డకెట్ (0 బ్యాటింగ్) సమయాన్ని వృథా చేయడంతో భారత్ ఆటగాళ్లు వారిని గేలి చేయడం కనిపించింది.

నొప్పిని భరిస్తూనే..: 145/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా, రాహుల్-పంత్ జోడీ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. సెషన్ తొలి ఓవర్‌లోనే పంత్ రెండు ఫోర్లు సాధించాడు. కానీ ఆ తర్వాత అర్ధగంట సేపు ఇద్దరూ ఆచితూచి ఆడడంతో మరో బౌండరీ రాలేదు. ఓ దశలో వరుసగా ఐదు ఓవర్లలో సింగిల్ రన్ కూడా తీయలేదు. చివరకు పేసర్ కార్స్ ఓవర్‌లో రాహుల్ హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఇక డ్రింక్స్ తర్వాత స్టోక్స్ వేసిన ఓవర్‌లో బంతి పంత్ చేతివేలికి తాకడంతో ఫిజియోతో చికిత్స తీసుకున్నాడు. నొప్పిని భరిస్తూనే అదే ఓవర్‌లో పంత్ సిక్సర్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. స్టోక్స్ తర్వాతి ఓవర్‌లోనూ పంత్ గ్లోవ్స్‌కు బంతి తాకడంతో మరోసారి ఫిజియో రావాల్సి వచ్చింది. అయినా బషీర్ ఓవర్‌లోనూ తను సిక్సర్ బాదాడు. ఇక సెషన్ ఆఖరి ఓవర్‌లో పంత్ అనవసర రన్ కోసం వెళ్లగా, షార్ట్ కవర్స్ నుంచి స్టోక్స్ సూపర్ త్రో కారణంగా రనౌటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

ఎవరికీ దక్కని ఆధిక్యం

నిదానంగా..: టీ బ్రేక్ సమయానికి 98 రన్స్‌తో ఉన్న రాహుల్ ఈ సెషన్ రెండో ఓవర్‌లోనే టెస్టు కెరీర్‌లో పదో శతకం పూర్తి చేశాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే స్లిప్‌లో బ్రూక్‌కు క్యాచ్ ఇవ్వడంతో తన నిలకడైన ఇన్నింగ్స్ ముగిసింది. స్పిన్నర్ బషీర్ ఈ వికెట్ తీశాడు. ఆ తర్వాత జడేజా-నితీశ్ (30) వికెట్ కాపాడుకునేందుకే ప్రాధాన్యం ఇవ్వడంలో పరుగులు నెమ్మదించాయి. దీనికి తోడు ఇద్దరి మధ్య సమన్వయలోపం కారణంగా మూడుసార్లు నితీశ్ రనౌటయ్యే ప్రమాదం నుంచి బయటపడడం గమనార్హం. ఆర్చర్ బౌన్సర్లతో ఈ జోడీని ఇబ్బందిపెట్టాడు. కొత్త బంతిని తీసుకున్నా బౌలర్లు వికెట్‌ను తీయలేకపోయారు. అయితే స్టోక్స్ ఓవర్‌లో బౌన్సర్ నితీశ్ హెల్మెట్‌కు బలంగా తాకడంతో ఫిజియో వచ్చి పరిశీలించాడు. ఈ సెషన్‌లో 68 పరుగులే సమకూరాయి.

వికెట్లు టపటపా: ఆఖరి సెషన్‌లో భారత్ 71 పరుగులు సాధించినా మిగిలిన ఐదు వికెట్లను కోల్పోయింది. దీంతో సరిగ్గా ప్రత్యర్థి స్కోరు దగ్గరే ఆగిపోవాల్సి వచ్చింది. నితీశ్‌ను ఆరంభంలోనే స్టోక్స్ అవుట్ చేయగా ఆరో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత జడ్డూకు సుందర్ (23) జత కలవడంతో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. కార్స్ ఓవర్‌లో జడేజా రెండు ఫోర్లు బాదగా, రూట్ ఓవర్‌లో సుందర్ 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే సెంచరీ వైపు సాగుతున్న జడేజాను వోక్స్ అవుట్ చేయడంతో ఏడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే అదే ఓవర్‌లో ఆకాశ్ (7)ను ఎల్బీగా అంపైర్ రెండుసార్లు ప్రకటించినా రివ్యూ ద్వారా బతికిపోయాడు. కానీ, రెండు పరుగుల వ్యవధిలోనే ఆకాశ్, బుమ్రా (0), సుందర్ పెవిలియన్ చేరడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

సురేఖ 'ట్రిపుల్'

- రెండు రజతాలు, ఓ కాంస్యం కైవసం
- ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4



మాడ్రిడ్: కీలక తరుణంలో ఒత్తిడికి చిత్తయిన భారత స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖ త్రుటిలో రెండు స్వర్ణాలను చేజార్చుకొంది. ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4 పోటీల్లో కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజతం సొంతం చేసుకొన్న విజయవాడ ఆర్చర్ జ్యోతి.. టీమ్ ఈవెంట్‌లో మరో రజతం సాధించింది. అయితే, మిక్స్‌డ్ కాంస్య పోరులో జ్యోతి ద్వయం విజయం సాధించింది. మొత్తంగా జ్యోతి సురేఖ ఒక్కరోజే రెండు రజతాలు, ఓ కాంస్యంతో కలిపి మూడు పతకాలు కొల్లగొట్టింది. ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4లో శనివారం జరిగిన కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగం ఫైనల్లో సురేఖ 147-148తో ఎల్లా గిబ్సన్ (బ్రిటన్) చేతిలో పరాజయం పాలై రజతంతో సరిపెట్టుకుంది. ఇక, మహిళల టీమ్ ఈవెంట్ టైటిల్‌పోరులో జ్యోతి, పర్ణీత్ కౌర్, ప్రీతిక ప్రదీప్‌ల త్రయం 225-227తో చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓటమిపాలై రజతానికి పరిమితమైంది. మిక్స్‌డ్ కాంస్య పతక పోరులో జ్యోతి-రిషభ్ జంట 156-153తో ఎల్ సాల్వడార్‌కు చెందిన పౌలా-వ్లాదిమిర్ జోడీపై గెలిచింది.



సినర్ X అల్కారజ్

వింబుల్డన్ పురుషుల ఫైనల్ నేడు

రాత్రి 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..





స్వియటెక్ సూపర్

- తొలిసారి వింబుల్డన్ టైటిల్ కైవసం
- ఏకపక్ష ఫైనల్ విజయంతో చరిత్ర
- తేలిపోయిన అనిసిమోవా



వావ్.. స్వియటెక్‌ది ఏం ఆట! క్లే, హార్డ్ కోర్టులపై తప్ప పచ్చిక కోర్టులపై రాణించలేదన్న అపప్రథను పటాపంచలు చేసేలా ఆడింది.. ప్రత్యర్థికి ఒక్కటంటే ఒక్క గేమ్ ఇవ్వకుండా చెలరేగింది..ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో చరిత్ర తిరగ రాసింది.. ఫైనల్ మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షం చేసేసి గంటలోపే ముగించింది.. తద్వారా కెరీర్‌లో తొలి ఆల్ ఇంగ్లండ్ టైటిల్‌ను ముద్దాడింది..సెమీఫైనల్లో టాప్ ర్యాంకర్ సబలెంకాపై సంచలన విజయం సాధించిన అమండా అనిసిమోవా తుదిపోరులో పూర్తిగా తేలిపోయింది.

లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్ ట్రోఫీని ఎనిమిదో సీడ్ ఇగా స్వియటెక్ సొంతం చేసుకుంది. శనివారంనాటి ఫైనల్లో పోలెండ్ భామ 6-0, 6-0తో 13వ సీడ్ అమెరికన్ అమండా అనిసిమోవాను చిత్తు చేసింది. ఓపెన్ ఎరాలో వింబుల్డన్ ఫైనల్లో డబుల్ బాగెల్ (ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా మ్యాచ్ గెలవడం) అందుకున్న తొలి క్రీడాకారిణిగా స్వియటెక్ చరిత్ర సృష్టించింది. అలాగే 1911 తర్వాత ఆల్ ఇంగ్లండ్ క్లబ్ తుదిపోరులో ఈ ఘనత సాధించిన మొదటి క్రీడాకారిణిగా నిలిచింది. ఇక..స్వియటెక్ ఓవరాల్‌గా కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ ఖాతాలో వేసుకుంది. ఇంతకుముందు ఆమె నాలుగుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2020, 2022, 2023, 2024), ఒకసారి యూఎస్ ఓపెన్ (2022) విజేతగా నిలిచింది. కేవలం 57 నిమిషాల్లో పూర్తయిన మ్యాచ్‌లో 24 ఏళ్ల స్వియటెక్ ధాటికి అనిసిమోవా ఎదురు నిలవలేకపోయింది. తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన 23 ఏళ్ల అనిసిమోవా పూర్తిగా తడబాటుకు లోనైంది. ఏకంగా 28 తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది.

1 వింబుల్డన్ విజేతగా నిలిచిన తొలి పోలెండ్ ప్లేయర్ (మహిళలు, పురుషులు) స్వియటెక్. మోనికా సెలెస్ (1992 లో) తర్వాత ఫైనల్ చేరిన ఆరు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ గెలిచిన తొలి క్రీడాకారిణి స్వియటెక్. అలాగే మూడు కోర్టుల (హార్డ్, క్లే, పచ్చిక)పై టైటిళ్లు నెగ్గిన తొలి ప్లేయర్ కూడా.

2 1988 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో నటాషా జ్వెరేవాపై 6-0, 6-0తో స్టెఫీ గ్రాఫ్ గెలిచాక..ఇదే స్కోరుతో మళ్లీ గ్రాండ్‌స్లామ్ తుదిపోరు నెగ్గిన రెండో ప్లేయర్ స్వియటెక్.

100 స్వియటెక్ కెరీర్‌లో 100వ గ్రాండ్‌స్లామ్ గెలుపు ఇది.సెరెనా విలియమ్స్ (116 మ్యాచ్‌లు) తర్వాత అత్యంత వేగంగా (120 మ్యాచ్‌లు) 100 గ్రాండ్‌స్లామ్ విజయాలు సాధించిన ప్లేయర్ స్వియటెక్.

జీఎస్టీలో నిరంతర సరఫరా (కంటిన్యుయస్ సప్లయ్) అనే కాన్సెప్ట్ ఉంది. ఏదేనీ ఒక వ్యక్తి లేదా సంస్థ నుంచి ఒక్కసారి కాకుండా నిరంతరంగా కొంతకాలం పాటు ఏదేనీ వస్తువులు లేదా సేవలను పొందితే దానిని నిరంతర సరఫరా అంటారు. ఒక సరఫరా నిరంతర సరఫరా కిందకు రావాలంటే కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి.

నిరంతర సరఫరా అంటే ?

ఇదీ GST



రాంబాబు గొండాల

ఇందులో మొదటిది కొనుగోలుదారునికి, అమ్మకందారునికి మధ్య ఆ సరఫరాకు సంబంధించి ఒక కాంట్రాక్ట్ ఉండాలి. ఉదాహరణకు ఒక పరిశ్రమకు సంబంధించి ముడి పదార్థాలు సరఫరా చేయటం, ఒక కంపెనీకి కారు లేదా సెక్యూరిటీ సేవలు ఇవ్వటంతో పాటు పైప్ ద్వారా చేసే గ్యాస్ సరఫరా ఈ కోవలోకి వస్తాయి. అలాగే ఆ సరఫరా అనేది సేవలకు సంబంధించినది అయితే సరఫరా అనేది మూడు నెలలకు మించి ఉండాలి.

మరి కంటిన్యుయస్ సప్లయ్, సాధారణ సరఫరాలో జీఎస్టీకి సంబంధించి ఏమైనా తేడాలు ఉన్నాయా అంటే.. అమ్మకపు విలువలోనూ, కట్టే పన్నులోనూ ఎలాంటి తేడా ఉండదు. కానీ ఇన్వాయిస్ ఇవ్వాల్సిన సమయం మారుతుంది. దీనివల్ల పన్ను కట్టాల్సిన సమయం మారుతుంది. అంటే 'టైమ్ ఆఫ్ సప్లయ్' మారుతుంది. దీన్ని వివరంగా తెలుసుకుందాం.

ఒక సరఫరాకు సంబంధించి పన్ను ఎప్పుడు కట్టాలనే విషయం టైమ్ ఆఫ్ సప్లయ్ తెలుపుతుంది. అంటే, ఒక వ్యక్తి తాను చేసిన సరఫరాకు పన్ను కట్టే ముందు ఆ సరఫరాకు సంబంధించి టైమ్ ఆఫ్ సప్లయ్ ఎప్పుడు వస్తుందో తెలుసుకోవాలి. ఉదాహరణకు సర్వీసుల విషయానికి వస్తే టైమ్ ఆఫ్ సప్లయ్ అనేది ఇన్వాయిస్ సకాలంలో ఇచ్చారా లేదా అనే దానిని బట్టి ఉంటుంది. ఇన్వాయిస్ నియమ నిబంధనల ప్రకారం ఒక సర్వీస్ పూర్తయిన తర్వాత గరిష్ఠంగా 30 రోజులలోపు ఇన్వాయిస్ ఇవ్వాలి. అలా ఇచ్చిన పక్షంలో ఇన్వాయిస్ తేదీ లేదా సరఫరాకు సబంధించిన సొమ్ము వచ్చిన తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్ కింద పరిగణించాలి. ఒకవేళ ఇన్వాయిస్ సకాలంలో అంటే నెలలోపు ఇవ్వకుంటే అప్పుడు సర్వీస్ పూర్తయిన తేదీ లేదా పైకం వచ్చిన తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది.

ఉదాహరణకు ఒక సర్వీస్ మార్చి 30న పూర్తయింది. దానికి సంబంధించిన అమౌంట్ జూన్ 10న వచ్చిందనుకుందాం. అలాగే ఇన్వాయిస్ ఏప్రిల్ 25న జారీ చేశాడనుకుందాం. అప్పుడు ఇన్వాయిస్ సకాలంలో అంటే 30 రోజుల లోపు ఇచ్చాడు కాబట్టి ఏప్రిల్ 25 (ఇన్వాయిస్ తేదీ), జూన్ 10 (సొమ్ము పొందిన తేదీ).. ఈ రెండింటిలో ఏది ముందయితే అది. అంటే ఏప్రిల్ 25 టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. కాబట్టి ఏప్రిల్ నెల రిటర్నులో కట్టాల్సిన పన్నును చెల్లించాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇన్వాయిస్ 30 రోజుల తర్వాత అంటే ఏ మే నెలలోనో ఇచ్చి ఉంటే అప్పుడు అమౌంట్ వచ్చిన తేదీ లేదా సర్వీస్ పూర్తయిన తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందయితే అది టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. ఈ విధంగా చూసినప్పుడు మార్చి 30 అనేది టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. కాబట్టి మార్చి నెలకు సంబంధించిన రిటర్నులో చెల్లించాల్సిన మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇది సాధారణ సరఫరాకు సంబంధించిన నియమం.

కంటిన్యుయస్ సప్లయ్‌లో కూడా ఇవే నిబంధనలు ఉన్నప్పటికీ ఇన్వాయిస్ జారీ చేయాల్సిన సమయంలో తేడా ఉంది. ఇక్కడ 30 రోజుల నిబంధన అమలు కాదు. సర్వీసులకు సంబంధించి కంటిన్యుయస్ సప్లయ్‌లో ఇన్వాయిస్ జారీ చేయటానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఇందులో కాంట్రాక్ట్ అనేది కచ్చితంగా ఉండాలని చెప్పుకున్నాం. ఒకవేళ ఇన్వాయిస్‌లో నిర్ధారిత తేదీలలో డబ్బులు చెల్లించాలనే ఒప్పందం ఉంటే ఆ తేదీల నాడు ఇన్వాయిస్‌లు జారీ చేయాలి (డబ్బు అందినా, లేకున్నా). అలా నిర్ధారిత తేదీ లేకుంటే డబ్బులు ఎప్పుడైతే వస్తాయో ఆ తేదీ నాటికి ఇన్వాయిస్ జారీ చేసి ఉండాలి. పైన చెప్పిన ఉదాహరణ కంటిన్యుయెస్ సప్లయ్ అనుకుంటే.. కాంట్రాక్ట్‌లో డబ్బులకు సంబంధించి నిర్ధారిత తేదీ లేకుంటే అప్పుడు జూన్ 10 వరకు ఇన్వాయిస్ జారీ చేయవచ్చు. ఎందుకంటే, జూన్ 10న తనకు డబ్బులు అందాయి కాబట్టి. అంటే సర్వీస్ పూర్తయిన 30 రోజుల లోపు ఇన్వాయిస్ ఇవ్వకున్నా అది సకాలంలో ఇచ్చినట్లే భావించాలి. అప్పుడు టైమ్ ఆఫ్ సప్లయ్ జూన్ నెల అవుతుంది. అదే సాధారణ సరఫరా అయితే పైన చెప్పినట్లు మార్చి నెలలోనే టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది.

ఇక సర్వీసులకు సంబంధించిన కంటిన్యుయస్ సప్లయ్ ఇన్వాయిస్ జారీ చేయటానికి మూడో పద్ధతి కూడా ఉంది. కొన్ని కాంట్రాక్టుల్లో నిర్ధారిత పని పూర్తయినప్పుడే డబ్బు చెల్లించేటట్లు ఒప్పందం చేసుకుంటారు. ఉదాహరణకు బిల్డింగ్ కాంట్రాక్టర్లు ఏయే పనులు పూర్తయినప్పుడు ఎంతెంత చెల్లించాలో అని కాంట్రాక్ట్‌లో పొందుపరుస్తారు. అంటే ఇక్కడ చెల్లింపు అనేది సమయాన్ని బట్టి కాకుండా పనిని బట్టి ఉంటుంది. దీన్ని ఈవెంట్‌ను బట్టి చెల్లింపు చేయటం అంటారు. ఇలాంటి సందర్భంలో ఆ ఈవెంట్ పూర్తయిన తేదీ నాటికి ఆ ఈవెంట్ వరకు ఎంత మొత్తం అవుతుందో అంత మేర ఇన్వాయిస్ ఇవ్వాల్సి ఉంటుంది (డబ్బు అందినా, లేకున్నా). అంటే సర్వీసులకు సంబంధించిన కంటిన్యుయస్ సప్లయ్‌లో ఈ మూడు సందర్భాల్లో ఇచ్చిన ఇన్వాయిస్‌లు 30 రోజులలోపు ఇవ్వనప్పటికీ సకాలంలో ఇచ్చినట్లే గుర్తించాలి. కాబట్టి టైమ్ ఆఫ్ సప్లయ్ అనేది దీని ప్రకారం మారుతుంది.

అలాగే కంటిన్యుయస్ సప్లయ్ అనేది వస్తు సరఫరాకు సంబంధించినదైతే ఇన్వాయిస్‌ల నియమ నిబంధనలు వేరే విధంగా ఉంటాయి. తదనుగుణంగా టైమ్ ఆఫ్ సప్లయ్ కూడా మారుతుంది. కాబట్టి కంటిన్యుయస్ సప్లయ్‌లో ఉండే కాంట్రాక్టర్లు ఈ విషయాలు గమనించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



అయినా.. పన్ను ప్రయోజనాలున్నాయ్

ఏ వ్యక్తికైనా ఆరోగ్య బీమా తప్పనిసరి. దేశంలో హెల్త్‌కేర్ వ్యయాలు ఏటా 14% వంతున పెరుగుతున్నాయని అంచనా. అయితే వయోవృద్ధులు లేదా సీనియర్ సిటిజన్లు పెరుగుతున్న వయసు, ముందు నుంచి ఉన్న వ్యాధుల కారణంగా అందుబాటు ప్రీమియంలలో ఆరోగ్య బీమా పొందలేక పోతున్నారు. ఈ కారణంగా ఆస్పత్రి, వైద్య పరీక్షలు, డాక్టర్ కన్సల్టేషన్ వ్యయాలన్నీ తాము పొదుపు చేసుకున్న సొమ్ము నుంచే చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి అంశాలన్నీ దృష్టిలో ఉంచుకునే ఆదాయపు పన్ను చట్టం 80డి సెక్షన్.. 60 సంవత్సరాల వయసు పైబడిన వారందరికీ ఆరోగ్య సంబంధిత వ్యయాలపై కొన్ని రాయితీలు అందిస్తోంది. పాత ఆదాయపు పన్ను విధానాన్ని ఎంపిక చేసుకున్న వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు పరిమితం. దీని కింద ఆరోగ్య బీమా పాలసీ లేకపోయినా సీనియర్ సిటిజన్లు ఆరోగ్య సంబంధిత వ్యయాలపై పన్ను మినహాయింపులు కోరవచ్చు.

బీమా కవరేజీ లేని వారి మాటేమిటి?

ఆరోగ్య బీమా కవరేజీ లేని సీనియర్ సిటిజన్లకు కూడా ఈ సెక్షన్ రాయితీలు కల్పిస్తోంది. అలాంటి వారు వైద్య వ్యయాలపై ఏడాదికి గరిష్ఠంగా రూ.50,000 వరకు మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ వ్యయాలను మీ పిల్లలు భరించినట్టయితే వారు కూడా పన్ను మినహాయింపులు పొందేందుకు అర్హులవుతారు. కేవలం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు మాత్రమే ఈ ప్రయోజనాలు పరిమితం అన్న విషయం గుర్తుంచుకోవాలి. అంతే కాదు...నూతన, సరళీకృత ఆదాయపు పన్ను విధానం ఎంచుకున్న వారికి ఇది వర్తించదు.

80డి సెక్షన్ ఏమిటి?

పన్ను చెల్లింపుదారుల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఈ సెక్షన్ ఆరోగ్య బీమా లేదా ఆరోగ్య సంబంధిత వ్యయాలపై రాయితీలు, మినహాయింపులు అందిస్తుంది. తద్వారా పన్ను చెల్లింపు మొత్తం ఆదా చేస్తుంది.

- ఈ సెక్షన్ కింద పన్ను చెల్లింపుదారు తనతో పాటుగా కుటుంబ సభ్యుల (భార్య లేదా భర్త, తనపై ఆధారపడిన సంతానం) ఆరోగ్య సంరక్షణకు చేసిన వ్యయాలపై లేదా ఆరోగ్య బీమా ప్రీమియంపై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.25,000 వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు.
- దీనికి తోడు వయోవృద్ధులైన తల్లిదండ్రుల కోసం చేసిన ఆరోగ్య సంబంధిత వ్యయాలు, ఆరోగ్య బీమా ప్రీమియంపై మరో రూ.25,000 పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయవచ్చు.
- అలాగే ప్రీమియం చెల్లిస్తున్న వ్యక్తి (స్వయంగా లేదా కుటుంబ సభ్యుల కోసం) సీనియర్ సిటిజన్ అయినట్టయితే ఈ మినహాయింపు పరిమితి గరిష్ఠంగా రూ.50,000 వరకు ఉంటుంది. అంటే మీరు సీనియర్ సిటిజన్ అయి ఉండి మీ కోసం, మీ తల్లిదండ్రుల కోసం కూడా ప్రీమియం చెల్లిస్తున్నట్టయితే రూ.1 లక్ష వరకు ఆదాయపు పన్ను మినహాయింపునకు క్లెయిమ్ చేసుకోవచ్చు.
- ప్రివెంటివ్ హెల్త్ చెకప్ చెల్లింపుల (గరిష్ఠంగా రూ.5,000) కోసం చేసే వ్యయాలైతే నగదు రూపంలో చెల్లించవచ్చు. మిగతా వ్యయాలేవైనా నగదేతర రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది.

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	88	విజయవాడ	97
వరంగల్	88	గుంటూరు	102
కరీంనగర్	88	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	88	చిత్తూరు	100
కర్నూలు	88	నెల్లూరు	105
విశాఖపట్నం	81	అనంతపురం	105
గోదావరి	97		





బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,710 ▲	91,400 ▲	1,25,000 ▲
విజయవాడ	1,01,000 ▲	95,000 ▲	1,15,000 ▲
విశాఖపట్నం	99,710 ▲	91,400 ▲	1,25,000 ▲
రాజమండ్రి	99,710 ▲	91,400 ▲	1,15,600 ▲
ప్రొద్దుటూరు	98,000 ▲	90,160 ▲	1,12,800 ▲
ముంబై	97,511 ▲	89 ,320 ▲	1,10,290 ▲

ఇక ఏఐ సహాయంతో తెలుగులోనే ట్యాక్స్ ఫైలింగ్

పన్ను చెల్లింపుదారులు కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో తమ మాతృభాషలోనే పన్ను రిటర్నులు దాఖలు చేసే సదుపాయాన్ని ఫిన్‌టెక్ సంస్థ క్లియర్ టాక్స్ అందుబాటులోకి తెచ్చింది. దేశంలో ఇలాంటి సదుపాయం అందుబాటులోకి తేవడం ఇదే ప్రథమం. ఇందుకుగాను ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కర్ణాటక, బెంగాలీ భాషల్లో ఏఐ శక్తితో పని చేసే ట్యాక్స్ అసిస్టెంట్‌ను క్లియర్ టాక్స్ డిజైన్ చేసింది. పన్ను చెల్లింపుదారులు తమ మాతృభాషలో వాట్సప్, స్లాక్, మైక్రోసాఫ్ట్ టీమ్స్ లేదా క్లియర్ టాక్స్ వెబ్‌సైట్ ద్వారా చాట్ చేస్తూ రిటర్న్ దాఖలు చేయవచ్చు.

వేతన జీవులు, సాధారణ ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, తొలి సారి పన్ను రిటర్న్ దాఖలు చేస్తున్న వారు అందరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు. పన్ను చెల్లింపుదారులు తమ పాన్ నంబర్ ఇచ్చి ఫారం-16 జత చేస్తే చాలు.. మిగతా తతంగం అంతా ఏఐ చూసుకుంటుంది. వారికి సంబంధించిన 95% డేటాను ఐటీ శాఖ నుంచి సేకరించి ఆ వ్యక్తికి చెందిన అన్ని రకాల రాయితీలు, కోతలు వర్తింప చేసి రిటర్న్ దాఖలు చేస్తుంది.

ఐసీఐసీఐ ప్రు యాక్టివ్ మూమెంటమ్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. యాక్టివ్ మూమెంటమ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ ధర, ట్రెండ్స్, లాభాలు తదితర అంశాల ఆధారంగా పెట్టుబడుల అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. నిఫ్టీ 500 టీఆర్ఐ ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ ఈ నెల 22.

- టాటా ఎంటర్‌ప్రైజ్‌కు చెందిన క్విక్ డెలివరీ సంస్థ బిగ్‌బాస్కెట్.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా పర్సనల్ కేర్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ సహా దాదాపు 10వేలకు పైగా ఉత్పత్తులను పది నిమిషాల్లోనే వినియోగదారులకు డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	490
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	



హింసను ప్రేరేపించేలా మాట్లాడతారా?

» పేర్ని వ్యాఖ్యలపై బోడె, కొనకళ్ల ఆగ్రహం



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'చీకట్లో కన్ను కొడితే తలలు నరికే యండి' అంటూ మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ మండిపడింది. హింస, విధ్వంసం.. వైసీపీ పాలసీ అని ఆయన వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమైందంటూ విమర్శించింది. ఆ పార్టీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. 'రెంటపాళ్ల పర్యటనలో వైసీపీ కార్యకర్తలు రప్పా, రప్పా అని ప్లకార్డులు పట్టుకుంటే మీడియా సమక్షంలో దానిని జగన్ సమర్థించారంటే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది. చంద్రబాబు అభివృద్ధి - సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలని పదే పదే చెబుతూ ఉంటారు. వైసీపీ వారు మాత్రం హత్యలు చేయండి... తలలు నరకండి అని చెబుతున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని ఎమ్మెల్యే బోడె అన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ... 'అధికారంలో ఉన్నప్పుడు పేదల రేషన్ బియ్యాన్ని బొక్కేసిన చరిత్ర నానిది. రంగనాయకులు గుడికి చెందిన 10 ఎకరాల స్థలాన్ని మాయం చేసిన ఘనుడు ఆయన. రప్పా రప్పా అని టీవీల ముందు కాదు... మచిలీపట్నంలో ఆక్రమించిన వెయ్యి గజాల తమ్మిన వారి సత్రం దగ్గర లేదా కబ్జా చేసిన కోటా జయరాం పొలం వద్ద అనాలి' అని నారాయణ సవాల్ చేశారు.

వైసీపీ నాయకుల బ్రోకర్ పేర్ని

» ఉగ్రవాదుల్లా మారిన ఆ పార్టీ ముఖ్య నేతలు: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'దోచుకోవడం, దాచుకోవడం కోసం వైసీపీ నాయకులకు మాజీ మంత్రి పేర్ని నాని బ్రోకర్‌లా పనిచేశారు' అని మంత్రి సవిత విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'పేదలకు అందాల్సిన 7,580 కేజీల రేషన్ బియ్యం బస్తాలను స్వాహా చేసిన పంది కొక్కు. తన అవినీతి బయటపడుతుందన్న భయంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. చీకట్లో జరిగే పనుల గురించి మాజీ మంత్రి పేర్ని నాని పట్టపగలు చెప్పడం దేనికి సంకేతం? వైసీపీ కార్యకర్తలే ఆ పార్టీ నాయకులను చీ కొడుతున్నారు' అని మంత్రి విమర్శించారు.

దాడులకు ఉసిగొల్పుతున్న పేర్ని నాని

» మచిలీపట్నం, అవనిగడ్డ పోలీస్ స్టేషన్లలో టీడీపీ ఫిర్యాదు

మచిలీపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు శనివారం మచిలీపట్నంలోని రాబర్ట్‌సన్‌పేట, అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. కృష్ణా జిల్లాలో జరిగే వైసీపీ సమావేశాల్లో పాల్గొంటున్న పేర్ని నాని తీరుతో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, విచారణ చేసి చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

శాంతిభద్రతల భగ్నానికి జగన్ యత్నం

» 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం: మంత్రి డోలా

పార్వతీపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. శనివారం పార్వతీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తన పర్యటనలో పెద్ద ఎత్తున గుంపుగా వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాత విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం దారుణమని అన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌కు మంత్రి పరామర్శ

» రూ. 2 లక్షల చెక్కు అందజేత



శివకుమార్‌ను పరామర్శిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో బుధవారం వైసీపీ మూకల దాడిలో గాయపడిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు.ఆయనకు అందించిన వైద్య పరీక్షల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శివకుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం శివకుమార్‌కు ప్రభుత్వం తరపున రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.

రాష్ట్రానికి మరో

39,602 కోట్ల పెట్టుబడులు

» 31,399 మందికి ఉద్యోగాలు

» తిరుపతిలో ఒకటి.. విశాఖలో రెండు స్టార్ హోటళ్లు

» 12,682 కోట్లతో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు

» 5,720 ఉద్యోగాలు కల్పించే లక్ష్యం

» ఎస్ఐపీసీ సమావేశంలో ఆమోదం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో రూ.39,602 కోట్ల పెట్టుబడులు తెచ్చి.. 31,399 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రణాళికకు రాష్ట్రస్థాయి పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) ఆమోదం తెలిపింది. తిరుపతిలో ఒకటి, విశాఖలో రెండు స్టార్ హోటళ్లతోపాటు, రూ.12,682 కోట్ల పెట్టుబడులతో 5,720 మందికి ఉద్యోగాలు కల్పించే రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన శనివారం జరిగిన ఎస్ఐపీసీ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్, న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కమలాకరబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలివి..

- విశాఖపట్నంలో ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ రూ.328 కోట్లతో 5 స్టార్ హోటల్‌ను నిర్మిస్తుంది. దీనిలో 1100 మందికి ఉపాధి లభిస్తుంది.
- విశాఖలో లాన్సమ్ లీజర్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రూ.88 కోట్లతో 5 స్టార్ హోటల్‌ను నిర్మిస్తుంది. 720 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- తిరుపతిలో స్టార్‌టర్న్ హోటల్స్ రూ.165 కోట్లతో 5 స్టార్ హోటల్‌ను నిర్మిస్తుంది. ఇందులో 280 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- చిత్తూరులో శ్రీజా మహిళా ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ రూ.202 కోట్లతో 1400 మందికి ఉద్యోగాలు కల్పించే ఇంటిగ్రేటెడ్ డెయిరీని స్థాపిస్తుంది.
- విశాఖ మధురవాడలో ఫినమ్ పీపుల్ ప్రైవేటు లిమిటెడ్ రూ.205 కోట్లతో 2500 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఐటీ సర్వీసెస్ ఇంప్లిమెంటేషన్ కింద ప్రతిభావంతులకు శిక్షణ ఇచ్చే ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేస్తుంది.
- తిరుపతిలో గ్రీన్‌లాన్ లిమిటెడ్ రూ.1147 కోట్లతో 1478 మందికి ఉద్యోగాలు. ఏక్సింట్ ఫార్మా రూ.1350 కోట్లతో 1779 మందికి ఉద్యోగాలు. కర్నూలులో అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ రూ.6990 కోట్లతో 2138 మందికి ఉద్యోగాలు. కడపలో జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్స్ రూ.4500 కోట్లతో 2700 మందికి ఉద్యోగాలు. అనకాపల్లిలో రెన్యూ ఫొటో వోల్టాక్స్ రూ.3700 కోట్లతో 1200 మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయం.
- అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో లారస్ ల్యాబ్స్ రూ.5630 కోట్ల పెట్టుబడితో 6350 మందికి ఉద్యోగాలు కల్పించే సంస్థకు 600 ఎకరాలు కేటాయింపు.
- విశాఖ, విజయవాడల్లో లులూ గ్రూప్ రూ.1222 కోట్లతో 1500 మందికి ఉద్యోగాలు, చిత్తూరు జిల్లా కుప్పంలో ఏస్ ఇంటర్నేషనల్ రూ.1000 కోట్లతో 2000 మందికి ఉద్యోగాలు. శ్రీకాకుళంలో వీఎస్ఆర్ సర్కన్ రూ.39.32 కోట్లతో 246 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టుకు భూ కేటాయింపు చేయాలని నిర్ణయం.



- మల్లవల్లిలో అవిస ఫుడ్స్ రూ.8,391 కోట్లతో 16,596 మందికి ఉద్యోగాలు కల్పించే మెగా ఫుడ్‌పార్కుకు 115 ఎకరాల కేటాయింపు.
- కర్నూలు, నంద్యాలలో రెన్యూ వయోమన్ పవర్ లిమిటెడ్ రూ.1800 కోట్లతో 300 మందికి ఉద్యోగాలు కల్పించే విండ్ పవర్ ప్రాజెక్టుకు ఆమోదం
- కర్నూలు, నంద్యాలలో రెన్యూ విక్రమ్‌శక్తి రూ.3600 కోట్లతో 760 మందికి ఉద్యోగాలు కల్పించే 600 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టుకు ఆమోదం
- కడపలో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ రూ.2000 కోట్లతో 1380 మందికి ఉద్యోగాలు కల్పించే 400 మెగావాట్ల సోలార్ పార్కుకు 2400 ఎకరాలు కేటాయింపు.
- శ్రీకాకుళంలో వీవీఎస్ రామ్మోహన్ కంపెనీ రూ.204 కోట్లతో 1000 ఉద్యోగాలు కల్పించే రోజుకు 30 టన్నుల కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు ఆమోదం.
- నంద్యాలలో ఆర్వీఆర్ ప్రాజెక్టు రూ.4709 కోట్లతో 1200 మందికి ఉద్యోగాలు కల్పించే 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టుకు ఆమోదం.
- అమరావతిలో కేపీ గ్రూప్ రూ.25 కోట్లతో 500 మందికి ఉద్యోగాలు ఇచ్చే గ్లోబల్ రెన్యువబుల్ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆమోదం.

కూటమి ఏడాది పాలనలో

రాష్ట్రం అస్తవ్యస్తం

» డ్రగ్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో విశాఖ

» పీ 4 ఎందుకో ఎవరికీ అర్థం కావడం లేదు: బొత్స



విశాఖపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. బీచ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కూటమి నేతల అరాచక పాలనతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారింది. రాష్ట్రప్రభుత్వం పనితీరు పట్ల ఏ వర్గమూ సంతృప్తిగా లేదు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడేంత వరకూ రైతుల సమస్యలు ప్రభుత్వానికి గుర్తుకు రాకపోవడం శోచనీయం. రూ.4 మద్దతు ధరతో 2.3 లక్షల టన్నుల మామిడి కొనుగోలు చేశామని చెబుతున్నారు. ఎక్కడ చేశారో చెప్పాలి. విశాఖ అభివృద్ధిలో కాకుండా డ్రగ్స్‌లో అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనట్టు చిన్నారుల హత్యలు, మహిళలపై అకృత్యాలు, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయి. దీనికి కారణం పోలీస్ వ్యవస్థ అంటే భయం లేకపోవడమే. టీడీఆర్ బాండ్‌లు ఇష్టారాజ్యంగా జారీ చేయడంతోపాటు భూకబ్జాలపై పత్రికల్లో నిత్యం కథనాలు వస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే రూ.1.5 లక్షల కోట్లు అప్పు చేసింది. ఆ డబ్బు ఏం చేశారు? పీ-4 కార్యక్రమం ఎందుకనేది ఎవరికీ అర్థం కావడం లేదు. యోగాంధ్ర కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ రికార్డు కోసం రూ.300 కోట్లతో అట్టహాసంగా నిర్వహించారు. దీనివల్ల విశాఖకు కలిగిన ప్రయోజనం ఏమిటి? కూటమి పాలన పూర్తిగా పడకేసింది' అని బొత్స విమర్శించారు.

లాజిస్టిక్స్ హబ్‌గా ఉత్తరాంధ్ర

» భోగాపురం-మూలపేట కోస్టల్ కారిడార్‌తో మహర్దశ

» విశాఖలో కేంద్ర మంత్రి రామ్మోహన్



విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వరకూ ఉత్తరాంధ్ర ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మారనుందని పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. విశాఖలో శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న ఆయన 52 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి భోగాపురం నుంచి మూలపేట వరకూ కోస్టల్ కారిడార్ మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఇంతకు ముందు విశాఖ నుంచి భోగాపురం వరకూ కోస్టల్ కారిడార్ మంజూరైన సంగతి తెలిసిందేనన్నారు. మూలపేటలో పోర్టు నిర్మాణమవుతోందని, అక్కడే విమానాశ్రయం కూడా వస్తుందని, ఇప్పటికే భోగాపురం విమానాశ్రయం పనులు చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు. ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు కోస్టల్ కారిడార్ రావడం, రైల్వే లైన్ల విస్తరణ కూడా జరుగుతుండడం వల్ల పోర్టులు, విమానాశ్రయాలకు కనెక్టివిటీ పెరుగుతుందని, దీంతో ఈ ప్రాంతం లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందన్నారు. రోజ్‌గార్ మేళాలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, విశాఖ రైల్వే డీఎం బొహ్రా పాల్గొన్నారు.

వైద్యుల నియామకంపై అభ్యంతరాలు

» నోటిఫికేషన్ రద్దుకు జీడీఏ డిమాండ్

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. డీఎంఈ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ మాత్రమే చేపట్టాలి. కానీ, డీఎంఈ అధికారులు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 17వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూల నిర్వహణకు నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దీనిపై ప్రభుత్వ వైద్యుల సంఘం(జీడీఏ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకుంటే భవిష్యత్తులో సీనియార్టీ సమస్యలు వస్తాయని సంఘం సభ్యులు చెబుతున్నారు. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగుల మెడికల్ పాలసీకి సీఎస్ ఆమోదం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు మెడికల్ పాలసీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశం ఆమోదం తెలిపింది. విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారంవిద్యుత్ సంస్థల జేఏసీతో ఏపీ జెన్కో ఎండీ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి సమక్షంలో చర్చలు జరిగాయి. వచ్చే నెలాఖరు నాటికి మెడికల్ పాలసీపై నిర్ణయం తీసుకుని, అమలు చేసేందుకు ఈ చర్చల్లో యాజమాన్యం అంగీకరించింది. 2021 నుంచి ఇప్పటిదాకా కారుణ్య నియామకాలకూ ఏపీఎస్ఈబీ నిబంధన మేరకు చర్యలు చేపట్టేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. తండ్రి మరణంతో కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు మైనర్ పిల్లలకు ఆరోగ్య సేవలకూ ఆమోదం తెలిపింది. డిపార్టుమెంట్‌లో ఉన్న అన్ని కన్వర్షన్సూ ఇస్తామని యాజమాన్యం ఆమోదించింది. అన్ని విభాగాల్లో ఖాళీలను త్వరలోనే భర్తీ చేయడానికి యాజమాన్యం అంగీకరించింది. యాజమాన్యం నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

14, 15ల్లో బిమ్స్ టెక్ సదస్సు

విశాఖపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరగనుంది. బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కో-ఆపరేషన్ (బిమ్స్ టెక్) పేరుతో ఈ నెల 14, 15 తేదీల్లో సదస్సు నిర్వహించడానికి విశాఖపట్నం పోర్టు ఏర్పాట్లు చేసింది. ఈ సదస్సుకు బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌ల్యాండ్ నుంచి నౌకాయాన శాఖల ప్రతినిధులు, నిపుణులు, పారిశ్రామిక ప్రతినిధులు హాజరవుతున్నారు.


ఆర్ట్‌కు మంచి మార్కెట్



రాజా రవివర్మ చిత్రం 35 కోట్ల రూపాయలు... ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ 3.5 కోట్లు... ఇలా మన దేశంలో లబ్ధ ప్రతిష్ఠులైన ఆర్టిస్టుల పెయింటింగ్స్‌ను విక్రయిస్తోంది 'ఆర్ట్ గ్యాలరీ జీ'. సోషల్ మీడియా యుగం ప్రారంభమయిన తర్వాత కళాకారులకు మంచి రోజులు వచ్చాయని, పెయింటింగ్‌లు అందరి దగ్గరకు చేరుతున్నాయని అంటారు 'గ్యాలరీ జీ' ఫౌండర్ గీతాంజలి. హైదరాబాద్‌లో జరుగుతున్న 'గ్యాలరీ జీ' ప్రదర్శన నేపథ్యంలో ఆమె 'నవ్య'తో సంభాషించారు.

ప్రస్తుతం మన దేశంలో ఆర్ట్ మార్కెట్ పరిస్థితి ఏమిటి?

ప్రజలకు ఏది కావాలో అది అందించినప్పుడే ఏ కళకైనా మనుగడ ఉంటుంది. ఆర్ట్ మార్కెట్ కూడా అంతే! ఒక ఆర్టిస్టు తన భావనను కేన్వాస్‌పై చిత్రీకరిస్తాడు. దాన్ని కావాలనుకొనేవారు కొందరు ఉంటారు. వారిద్దరికీ మధ్య వారధిగా గ్యాలరీలు ఉంటాయి. మన దేశంలో పెయింటింగ్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. అనధికార అంచనాల ప్రకారం ప్రస్తుతం ఆర్ట్ మార్కెట్ విలువ ఏడాదికి సుమారు 800 కోట్ల రూపాయలు ఉంటుంది. ఒక విధంగా చూస్తే ఇది చాలా తక్కువనే చెప్పాలి. మనకు అద్భుతమైన ఆర్టిస్టులు ఉన్నారు. మన దగ్గర ఉన్న కొద్దిమంది ఆర్టిస్టులకు మాత్రమే ఇప్పటి దాకా గుర్తింపు వచ్చింది. ఇంకా అనేకమంది ఉన్నారు. వీరందరికీ రావాల్సినంత పేరు వస్తే మార్కెట్ విలువ మరింతగా పెరుగుతుంది.



ఒక ఆర్టిస్టు పెయింటింగ్‌ల విలువను ఎలా బేరీజు వేస్తారు?

దీనికి అనేక కోణాలు ఉంటాయి. ఆర్టిస్టు ప్రతిభతో పాటుగా.... ఎలాంటి షోలలో ఆయన ప్రదర్శిస్తున్నాడు, ఏఏ గ్యాలరీలతో ఆయన అనుబంధంగా పనిచేస్తున్నాడు? అనే విషయాలు కూడా పెయింటింగ్‌ల విలువను పెంచుతాయి. ఆర్ట్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే కొన్ని పద్ధతులు పాటించాలి. 'నేను మంచి పెయింటింగ్‌లు వేస్తున్నాను. నా దగ్గరకు వచ్చిన వారికి అమ్ముతాను' అనుకుంటే కుదరదు. రీసెర్చ్ చేయాలి. మంచి గ్యాలరీలకు అనుబంధంగా పనిచేయాలి.

ఎవ్వరికీ తెలియని స్థితి నుంచి ప్రపంచం స్థాయి గుర్తింపు వచ్చిన ఆర్టిస్టులు మీ ఎరుకలో ఎవరైనా ఉన్నారా?

నేను 'రాజా రవివర్మ హెరిటేజ్ ఫౌండేషన్'కు మేనేజింగ్ ట్రస్టీని. ఆయన డైరీలను చదివితే ప్రతిభావంతుడైన ఒక ఆర్టిస్టు ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో అర్థమవుతుంది. ఇప్పుడైతే రాజా రవివర్మ గురించి అందరికీ తెలుసు. ఒక్కప్పుడు ఆయన అతి కొద్దిమందికే తెలుసు. ఆయన చిన్నప్పుడు తన బొమ్మలను అందరూ గుర్తించాలనుకొనేవారు. రకరకాలుగా చిత్రాలను వేయటానికి ప్రయత్నించేవారు. రంగుల విషయంలో ప్రయోగాలు చేసేవారు. అలా కృషి చేయగా చేయగా ఆయనకు పేరు వచ్చింది. ఎంఎఫ్ హుస్సేన్ కూడా అంతే! ఆయన వాల్‌పోస్టర్లు పెయింట్ చేసేవారు. ఇప్పుడు వారి పెయింటింగ్స్ కోట్ల రూపాయలకు అమ్ముడుపోతున్నాయి. వారి పేరు వెనక చాలా కృషి దాగి ఉంది.

ఒక మంచి పెయింటర్ తన పెయింటింగ్‌లను ఎలా మార్కెట్ చేసుకోవాలి?

ఆర్ట్ మార్కెట్‌కు సోషల్ మీడియా ఒక వరంలాంటిది. ఎవరైనా తమ పెయింటింగ్‌ల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియచెప్పాలనుకుంటే ఇన్‌స్టాగ్రామ్ పేజీని ప్రారంభిస్తే చాలు. దాని ద్వారా పెయింటింగ్ ప్రేమికులకు దగ్గర కావచ్చు. అంతేకాదు... గ్యాలరీల నిర్వాహకులు కూడా చూస్తూ ఉంటారు. నేరుగా కొనేవాళ్లు కూడా ఉంటారు. ఒక విధంగా చెప్పాలంటే- సోషల్ మీడియా పెయింటింగ్‌ను అందరి దగ్గరకు తీసుకువచ్చింది. మనకు నచ్చిన పెయింటింగ్‌ను కొనుగోలు చేసే స్వేచ్ఛని కలిగించింది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. మేము కూడా మా గ్యాలరీని ఇలాగే నడుపుతున్నాం. ఎవరైనా రావచ్చు. పెయింటింగ్‌ను కొనుగోలు చేయవచ్చు.

> రవివర్మ మొదట్లో కొద్దికాలం కేవలం రాజకుటుంబాల వారి కోసమే చిత్రాలు వేసేవారు. ఆ తర్వాత ఆయన ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. తన పెయింటింగ్స్ ప్రపంచంలో అందరి దగ్గరకు చేరాలనుకున్నారు. లిథోగ్రాఫిక్ ప్రెస్‌ను ప్రారంభించి చిత్రాలు ముద్రించారు. ఆయన ఈ ప్రెస్‌ను ప్రారంభించి ఉండకపోతే ఆయన పెయింటింగ్స్ కొందరి దగ్గరే మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఆయన పెయింటింగ్ ప్రతి ఇంట్లో ఏదో ఒక రూపంలో కనిపిస్తూ ఉంటుంది. ”





తెలుగు పరిశ్రమ గర్వించదగిన కళాదర్శకులలో పద్మశ్రీ తోట తరణి ఒకరు. 'అమావాస్య చంద్రుడు', 'నాయకన్', 'సాగరసంగమం', 'చూడాలని ఉంది'... ఇలా వైవిధ్యభరితమైన అనేక కథాంశాలకు ఆయన పనిచేశారు. తాజాగా ఆయన కళాదర్శకత్వం వహించిన 'హరిహర వీరమల్లు' సినిమా అతి త్వరలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలలోకి వెళ్తే...

ఒక్కో సినిమా వెనుకా ఒక్కో కథ

'హరిహర వీరమల్లు' సినిమా ఎలాంటి అనుభవాన్ని మిగిల్చింది?

ఇది నేను కల్యాణ్‌గారితో కలిసి చేస్తున్న తొలి సినిమా. చిరంజీవిగారితో అనేక సినిమాలు చేశా. కల్యాణ్‌గారు నాకు చాలాకాలంగా తెలుసు. కానీ తొలిసారి కలిసి పనిచేస్తున్నా. ఆయన షూటింగ్‌లో చిన్న చిన్న విషయాలమీద కూడా చాలా శ్రద్ధ చూపిస్తారు. ఈ సినిమా అనుకున్న సమయం కన్నా ఆలస్యమయింది. కొన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు కూడా ఎదుర్కొన్నాం. అయినా మా శక్తియుక్తులన్నీ పెట్టి పనిచేశాం. ఇక్కడ నిర్మాత ఏ.ఎం.రత్నంగారి గురించి కూడా చెప్పాలి. షూటింగ్ ఆలస్యమయినా తట్టుకొని నిలబడ్డారు. అందుకే ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా.

ఈ సినిమాకు సంబంధించి మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏవైనా ఉన్నాయా?

సాధారణంగా నేను దేన్నీ సవాలుగా భావించను. దీనికి ఒక కారణం ఉంది. చాలా సందర్భాలలో సెట్‌ను పూర్తిచేయకపోవటం అనేది తగినంత సమయం లేకపోవటం వల్ల జరుగుతుంది. అదేమిటో తెలియదు కానీ... నేను పనిచేసే సినిమాలకు ఎక్కువ సమయం ఇచ్చేవారు కాదు. దీంతో తక్కువ సమయంలోనే సినిమా పూర్తి చేయాల్సి వచ్చేది. అది అలవాటు అయిపోయింది. ఈ సినిమా విషయానికి వస్తే - ఒక్క రోజులో మొత్తం సెట్‌ను మార్చేయాల్సి వచ్చింది. రత్నంగారు కూడా ఆ రోజంతా నాతో పాటే ఉన్నారు.

కళాదర్శకుడిగా మీరు సవాల్‌గా భావించిన సినిమా ఏదైనా ఉందా?

లేదు. అలాంటి సినిమా గురించే ఎదురు చూస్తున్నా. 'హరిహర వీరమల్లు' పూర్తయింది కాబట్టి నాలుగు నెలలు ఖాళీగా ఉందామనుకుంటున్నా. ఈ సమయంలో నాకు నచ్చిన పెయింటింగ్స్ నేను వేసుకుంటా. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నేను ఒక పెయింటింగ్ వేస్తే కొద్దిమందిని మాత్రమే ఆనందపరచగలుగుతాను. కానీ ఆర్ట్ డైరక్టర్‌గా వందలమందికి ఉపాధి కల్పించగలుగుతాను అందుకే నేను చిన్న సినిమాలూ చేస్తాను, పెద్ద సినిమాలూ చేస్తాను. బడ్జెట్ గురించి పట్టించుకోను.

సినీ పరిశ్రమకు వచ్చిన తర్వాత మీరు మరచిపోలేని వ్యక్తులు ఎవరైనా ఉన్నారా?

సింగీతం శ్రీనివాసరావు గారిని మర్చిపోలేను. ఆయన దర్శకత్వం వహించిన ఒక సినిమాకు మా నాన్నగారు తోట వెంకటేశ్వరరావు గారు కళాదర్శకులు. దాని కోసం రెండు సెట్స్ వేసి పాటలు చిత్రీకరించారు. నేను అప్పుడు 'హ్యాండ్‌లూమ్ బోర్డు'లో 'ఏ-గ్రేడ్ డిజైనర్'గా పనిచేసేవాణ్ణి. మంచి ఉద్యోగం. ఒక రోజు నాన్నగారు, తమ్ముడు ఊర్లో లేకపోతే... సెట్ పనులు చూసుకుందామని షూటింగ్‌కు వెళ్లాను. అక్కడ సింగీతం గారు నన్ను చూసి- "నువ్వెందుకు వచ్చావు? నువ్వు పెయింటర్‌వి. వెళ్లి ఉద్యోగం చేసుకో" అన్నారు. నాకు చాలా కోపం వచ్చింది. ఆ సినిమా పూర్తయిన తర్వాత ఒక రోజు ఆయన- "నేను, కమల్ వస్తాం. నీతో మాట్లాడాలి" అని కబురు పెట్టారు. అసలే కోపం మీద ఉన్నా కదా.. "నేను కలవను" అని తిరిగి కబురు పంపించా. ఆ తర్వాత కొందరు నాకు సర్దిచెప్పాక... మేము కలుసుకున్నాం. అప్పుడు వాళ్లిద్దరూ కలిసి చేసిన సినిమాయే... 'అమావాస్య చంద్రుడు. దీనిలో హీరో పెయింటర్. అందుకే ఆయన నన్ను ఎంపిక చేసుకున్నారు. ఈ సినిమా షూటింగ్ రెండేళ్లు సాగింది. ఆ తర్వాత ఏడిద నాగేశ్వరరావుగారు వచ్చి అడిగారు. ముందు చేయనన్నాను. ఆ తర్వాత చేశాను. ఇలా నేను చేసిన ఒకో సినిమాకు ఒకో కథ ఉంది. 'అల్లూరి సీతారామరాజు' సినిమాకు మొత్తం పనిచేసినందుకు నాకు వెయ్యి రూపాయలు ఇచ్చారు. ఇప్పుడు చాలామంది రోజుకు ఐదువేల రూపాయలు తీసుకుంటున్నారు. అప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

వారందరిదీ సూక్ష్మ దృష్టి

పెద్ద నటులందరూ సూక్ష్మమైన విషయాలను వెంటనే పట్టుకుంటారు. వారికి అంత ఏకాగ్రత, నిబద్ధత ఉంటుంది. రజనీకాంత్, చిరంజీవిగారు, కమల్‌హాసన్, దిలీప్‌కుమార్, ఇప్పుడు పవన్‌కల్యాణ్... ఇలా చెప్పుకుంటూ పోతే అగ్రనటులందరికీ సూక్ష్మ దృష్టి ఉంటుంది. 'చూడాలని ఉంది' సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరిస్తున్నారు. పాట కోసం ఒక స్టేజ్ వేశాం. దానిపై కొన్ని కుర్చీలు ఉండాలి. కానీ అక్కడ ఉన్న కుర్చీలు వాటిపై అమరటం లేదు. దర్శకుడు గుణశేఖర్ వచ్చి "ఈ కుర్చీలను ఏమైనా చేయవచ్చా?" అని అడిగాడు. నేను వెంటనే కార్పెంటర్‌ను పిలిచి జపనీస్ స్టైల్‌లో కుర్చీని చేయించాను. దాన్ని స్టేజ్‌కి అమర్చాం. దానివెనుక అల్యూమినియం రేకుతో కొన్ని అక్షరాలు చెక్కించి పెట్టాం. చిరంజీవిగారు వచ్చారు. ఆయనతో పాటు కల్యాణ్‌గారు కూడా వచ్చారు. అల్యూమినియం అక్షరాలు చిరంజీవిగారి దృష్టిలో పడ్డాయి. కల్యాణ్‌గారితో- "చూడు. ఎంత డిటైల్డ్‌గా వెళ్లాడో చూడు... అక్షరాలు కూడా అల్యూమినియంతోనే చెక్కించాడు" అన్నారు. నేను మర్చిపోలేని సంఘటన అది.

రాజ్‌కపూర్‌తో...

'సాగర సంగమం' విజయోత్సవాలకు రాజ్‌కపూర్ వచ్చారు. ఆ చిత్రానికి నేను కళాదర్శకుడిని. నాన్నగారి స్నేహితుడు ఒకరు నన్ను రాజ్‌కపూర్ దగ్గరకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. ఆ సమయంలో అక్కడ పార్టీ జరుగుతోంది. మమ్మల్ని పిలవకపోయినా- నేను, కొద్దిమంది స్నేహితులం ఆ పార్టీలో దూరేసి- రాజ్‌కపూర్‌గారి సమీపంలో కూర్చున్నాం. ఆయన ఆ కబురు, ఈ కబురు చెబుతూ- "కమల్ డ్యాన్స్ చేసిన నుయ్యి నిజమైనదేనా? దాని వెనక మోటర్‌షెడ్ ఎందుకు పెట్టారు?" అని అడిగారు. "14 అడుగుల నుయ్యి తవ్వించాం. పైన రెండు ఎలక్ట్రికల్ పైపులు ఉన్నాయి. అందుకోసం వెనక మోటార్ షెడ్ పెట్టాం" అని చెప్పాను. ఈ తరం వారికి ఇలాంటి వారిని కలిసే అదృష్టం లేదనే చెప్పాలి.

పని ఉంది.. పది రోజుల్లో వస్తా..

- సిట్ విచారణకు సాయిరెడ్డి డుమ్మా
- శరత్‌చంద్రారెడ్డి, రోహిత్‌రెడ్డి కూడా గైర్హాజరు



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కీలక వ్యక్తి, వైసీపీ మాజీ నేత విజయసాయి రెడ్డి సిట్ విచారణకు డుమ్మా కొట్టారు. రూ. 3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడు(ఏ-5) సాయిరెడ్డిని శనివారం విచారణకు హాజరుకావాలంటూ దర్యాప్తు బృందం ఇటీవల నోటీసులు ఇచ్చింది. సాక్షిగా ఆయన్ను పిలిచినట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత పని ఉందని, ఢిల్లీ నుంచి వచ్చేందుకు పది రోజులు పడుతుందని సాయిరెడ్డి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. సాయిరెడ్డితో పాటు విచారణకు రావాల్సిన ఆయన అల్లుడు రోహిత్ రెడ్డి, అల్లుడి అన్న శరత్ చంద్రారెడ్డి సైతం గైర్హాజరు అయ్యారు. ఈనెల 24న వస్తామంటూ సమాచారం ఇచ్చారు.

విజయసాయి.. కర్మ ఫలం

విజయసాయి శనివారం ఎక్స్‌వేదికగా భగవద్గీతలోని ఓ శ్లోకాన్ని, దాని అర్థాన్ని పోస్టు చేసి అందర్నీ ఆశ్చర్యంలో ముంచేశారు. "కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన!" శ్లోకాన్ని ఆయన పోస్టు చేయడం చూసి దానిలోని అంతరార్థం ఏమై ఉంటుందోనని వైసీపీ నేతలూ.. రాజకీయవర్గాలూ పలురకాలుగా విశ్లేషించుకుంటున్నారు.

విజయవాడలో డ్రగ్స్ కలకలం

- టెకీ, ఇంజనీరింగ్ విద్యార్థి సహా ముగ్గురు యువకుల అరెస్టు

విజయవాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి డ్రగ్‌ను తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులతోపాటు కొనుగోలు చేస్తున్న యువకుడ్ని విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామానికి చెందిన గవర శ్రీరామ వెంకట మణికంఠ అమరావతి విట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదివాడు. విట్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన హైదరాబాద్‌కు చెందిన దేశబోయిన ఆకాష్ అక్కడే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ బెంగళూరులో ఉన్న ఓ వ్యక్తిని పరిచయం చేసుకుని అక్కడి నుంచి డ్రగ్‌ను తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి వారం క్రితం డ్రగ్ కొనుగోలు చేశాడు. అంబాపురంలో శివకుమార్ కౌశిక్ అనే యువకుడికి డ్రగ్‌ను విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఆ ముగ్గురు యువకులను అరెస్టు చేసి ఐదు గ్రాముల మెథాంఫెటమిన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు అప్పగించారు. బెంగళూరులో గ్రాము రూ. 4 వేలకు కొని విజయవాడలో రూ. 9-12 వేలకు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

గుడివాడలో హైటెన్షన్

- పేర్ని ఉన్మాద వ్యాఖ్యలపై టీడీపీ కార్యకర్తల ఆగ్రహం
- వైసీపీ సమావేశంపై ఎటాక్
- మచిలీపట్నంలో నానీ గృహ నిర్బంధం
- ఉద్రిక్తత నేపథ్యంలో కొడాలి డుమ్మా
- కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్ హారిక కారుపై దేశం శ్రేణుల దాడి.. పగిలిన అద్దాలు



కొడాలి నానిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



దెబ్బతిన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారు(ఇన్‌సెట్)

విజయవాడ/గుడివాడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): "ఎన్నిసార్లు రప్పా రప్పా అంటార్రా.. అధికారం రాగానే.. చీకట్లో కన్ను కొడితే నరికెయ్యాలి" అంటూ.. వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ ఉన్మాద వ్యాఖ్యలు చేసిన ఆ పార్టీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై ఉమ్మడి కృష్ణా జిల్లా టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. శనివారం గుడివాడ 'కే' కన్వెన్షన్‌లో వైసీపీ నిర్వహించ తలపెట్టిన 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' సమావేశానికి పేర్ని నానీ వస్తున్నట్టు తెలుసుకుని.. అడ్డుకునేందుకు టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అప్రమత్తమైన పోలీసులు టీడీపీ కార్యకర్తలను అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దింపారు. మరోవైపు, మచిలీపట్నం నుంచి పేర్ని నాని గుడివాడకు రాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. తీవ్ర ఉద్రిక్తత నేపథ్యంలో కొడాలి నాని డుమ్మా కొట్టారు. పేర్ని నాని బయలుదేరే ప్రయత్నం చేసినా.. పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మరోవైపు మచిలీపట్నం, అవనిగడ్డ పోలీసు స్టేషన్లలో పేర్నిపై కేసులు నమోదయ్యాయి.

పోలీసుల మాట బేఖాతరు

'బాబు ష్యూరిటీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారును టీడీపీ శ్రేణులు అడ్డగించారు. పోలీసులు కూడా ఆమెను వెనక్కి వెళ్లిపోవాలని సూచించారు. అయినా, ఆమె లెక్కచేయకపోవడంతో ఈలోగా టీడీపీ శ్రేణులు హారిక కారు అద్దాలు ధ్వంసం చేశారు.

గతం గుర్తు చేస్తూ..: 'కుప్పంలో చంద్రబాబు గెలిస్తే రాజకీయాలు వదిలేసి ఆయన బూట్లు పాలిష్ చేస్తూ ఆయన దగ్గరే పడుంటా.' అంటూ గత ఎన్నికల ముందు కొడాలి నానీ చేసిన వ్యాఖ్యలను టీడీపీ కార్యకర్తలు గుర్తు చేశారు. 'ఓటమి తర్వాత ఈ సవాల్‌ను మరిచిపోయారు' అంటూ గుడివాడలో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. నాని ఎక్కడ దాక్కున్నా బయటకు రావాలని శ్రేణులు నినాదాలు చేశారు.

మా కారునే ఆపుతారా.. కొడకల్లారా!

- పోలీసులపై రెచ్చిపోయిన జెడ్పీ చైర్‌పర్సన్ భర్త
- మీడియా ముందు హారిక మొసలి కన్నీరు



పోలీస్ స్టేషన్‌లో హారిక, ఉప్పాల రాము

గుడివాడలో పరిస్థితి ఉద్రిక్తతంగా ఉందని.. వెనక్కి వెళ్లిపోవాలని నచ్చజెప్పిన పోలీసులపై వైసీపీ నాయకురాలు, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఆమె భర్త ఉప్పాల రాములు రెచ్చిపోయారు. నాగవరప్పాడు వంతెన వద్ద వారి కారును నిలిపివేయడంతో "మా కారునే ఆపుతారా.. కొడకల్లారా?" అంటూ ఉప్పాల రాము వేలు పెట్టి చూపిస్తూ పోలీసులను హెచ్చరించారు. 'పోలీసు లం.. కొడకడా ఏం పీకుతున్నావ్ రా!?' అంటూ హారిక సైతం ఓ పోలీసుపై విరుచుకుపడ్డారు. పోలీసులు సంయమనంతో వ్యవహరించారు. హారిక అసభ్య పదజాలంతో టీడీపీ శ్రేణులను సైతం రెచ్చగొట్టారు. అనంతరం.. గుడివాడ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని టీడీపీ నాయకులు తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. తమ తప్పేమీ లేదన్నట్టు హారిక మొసలి కన్నీరు కార్చారు.

లిక్కర్ సొమ్ముతో దుబాయ్‌లో టెక్కర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి పది, పదిహేను రోజులకు ఒకసారి కనీసం రెండు కోట్ల నుంచి ఆరు కోట్ల రూపాయల వరకూ విదేశాలకు పంపినట్టు గుర్తించింది. ఇలా పదుల సార్లు లిక్కర్ ముడుపులు అక్రమంగా తరలించినట్లు పసిగట్టింది. ఈ డబ్బుతో కిరణ్ అక్కడ రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్టు, ట్రక్, ట్రేడింగ్, ఫర్నీచర్ తదితర వ్యాపారాలు ప్రారంభించాడు.

ఇదీ నేరప్రస్థానం...

శ్రీకాళహస్తికి చెందిన ఒక పోలీసు కానిస్టేబుల్ కుమారుడైన కిరణ్ కుమార్ రెడ్డి చెన్నైలో ఐఐటీ పూర్తి చేశాడు. ఆ తర్వాత బెంగళూరు కేంద్రంగా డికార్ట్ లాజిస్టిక్స్ పేరుతో వ్యాపారం ప్రారంభించాడు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం జగన్ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి చెంతకు చేరాడు. లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియ అయిన రాజ్ కసిరెడ్డి(ఏ-1) ముడుపుల సేకరణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అందులో తెలివైన యువకుల్ని నియమించుకున్నాడు. అప్పటికే డికార్ట్ లాజిస్టిక్స్ నిర్వహిస్తున్న కిరణ్ కుమార్ రెడ్డి తన వద్దకు ఉద్యోగం కోసం వచ్చే యువకుల్లో మెరికల్లాంటి వారిని ఎంపిక చేసి మద్యం ముడుపుల సేకరణకు అప్పగించాడు. పనిలో పనిగా తన వాటాతో పాటు మరి కొంత నొక్కేశాడు. గత వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడాన్ని ముందే గ్రహించిన కిరణ్ తన 'భవిష్యత్తు' చూసుకున్నాడు. దుబాయ్‌లో సెటిల్ అయ్యేందుకు 2022 నుంచే ప్లాన్ చేసుకున్నాడు. అందులో భాగంగా మద్యం కుంభకోణంలో తన వాటా, కాజేసిన సొమ్మును దేశం దాటించేశాడు. 2024లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో లిక్కర్ స్కామ్‌లో కొందరు సహ నిందితులతో పాటు మరికొందరిని తీసుకుని దుబాయ్ వెళ్లిపోయాడు. దుబాయ్‌లో ఎలాంటి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయో ముందే అంచనా వేసుకున్నాడు. ఇక్కడ లాజిస్టిక్స్ వ్యాపారంలో అనుభవం ఉండటంతో అక్కడ కూడా అదే చేద్దామనుకుని ఆరా తీశాడు. దుబాయ్‌లో లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ లాభసాటిగా ఉంటుందని తెలుసుకున్నాడు. 'టెక్కర్' పేరుతో ట్రాన్స్‌పోర్ట్, ట్రేడింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు మొదలు పెట్టాడు. దుబాయ్‌తో పాటు లండన్, నెదర్లాండ్స్, యూఏఈలోనూ వ్యాపారాలు ప్రారంభించాడు.

ట్రక్కర్.. టెక్కర్

దుబాయ్‌లో ట్రక్కర్ (TRUKKER) అనే లాజిస్టిక్స్ సంస్థ ఫేమస్. ఈ పేరుకు దగ్గరగా ఉండేలా కిరణ్ తన సంస్థకు టెక్కర్ (TEKKAR) అనే పేరు పెట్టాడు. సిట్ అధికారులు ఆరా తీయగా... ఇది తుతేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి(టీఈకేకేఏఆర్) కంపెనీ అని తేలింది. కిరణ్ వ్యాపారాలతో పాటు అందులో కీలక వ్యక్తుల వివరాలు కూపీ లాగారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో నిందితులు, అనుమానితులు ఆరుగురికి పైగా ఉన్నట్లు గుర్తించారు. కిరణ్ కుమార్ రెడ్డితో పాటు సైఫ్ అహ్మద్, అవినాశ్ రెడ్డి, వరుణ్ కుమార్, బొల్లారం శివకుమార్, సైమన్ ప్రసన్, ప్రద్యుమ్న దుబాయ్‌కి చేరినట్లు ఆధారాలు సేకరించారు. మరో పదిహేను మందికి పైగా దక్షిణాది రాష్ట్రాలకు(ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు) చెందిన యువకులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుసుకున్నారు.

విదేశాల్లో కిరణ్ వ్యాపారాలు..



- టెక్కర్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సీ- దుబాయ్
- టెక్కర్ ట్రక్ సర్వీస్- యూఏఈ
- టెక్కర్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్- లండన్
- టెక్కర్ రియల్ ఎస్టేట్స్- దుబాయ్
- హోమ్ హ్యాప్స్ ఫర్నీచర్ ఫ్రాంఛైజీ- నెదర్లాండ్స్

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి అరెస్టు

- మాజీ పీఏ హత్య కేసులో వినుతతో పాటు ఆమె భర్త, మరో ముగ్గురు కూడా..
- అదుపులోకి తీసుకున్న తమిళనాడు పోలీసులు
- వినుతపై జనసేన బహిష్కరణ వేటు

చెన్నై/తిరుపతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుత మాజీ డ్రైవరు, వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసులు (25) హత్యకు గురయ్యాడు. రేణిగుంటలో చంపేసి.. శవాన్ని తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని బేసిన్‌బ్రిడ్జ్ సమీప కూవం కాలువలో పడేశారు. హత్య ఈనెల 7న జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హత్యకు సంబంధించి వినుత, ఆమె భర్త చంద్రశేఖర్ (చంద్రబాబు), వారి ఇద్దరు డ్రైవర్లు గోపి, షేక్ తసన్, అనుచరుడు శివకుమార్‌లను చెన్నై పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రేణిగుంటలో శుక్రవారం వారిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాసులును నిందితులు రేణిగుంటలోని ఒక గోడౌన్‌లో చిత్రహింసలకు గురిచేసి.. అతని మెడకు తాడు, ఇనుప చైన్ బిగించి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. విచారణలో నిందితులు హత్య చేసినట్లు అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం.

హత్యకు దారితీసిన కారణాలేంటి?

శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెంకు చెందిన శ్రీనివాసులు అలియాస్ రాయుడు 2019 నుంచి వినుత దంపతుల వద్ద కారు డ్రైవర్‌గా, పీఏగా పనిచేస్తున్నాడు. ఇటీవల పలు విషయాలపై వినుత దంపతులు, శ్రీనివాసులుకు మధ్య విభేదాలు వచ్చినట్లు సమాచారం. వినుతకు అన్నీ తానై వ్యవహరించిన శ్రీనివాసులు.. ఆమె వ్యక్తిగత వ్యవహారాల వీడియోలు తీశాడు. డబ్బు డిమాండ్ చేయడంతో గత నెల అతడ్ని తీవ్రంగా కొట్టారు. ఫోన్‌లోని వీడియోలు, ఫోటోలను తొలగించి, పంపించేశారు. ఈ వీడియోలతో పాటు ఇతర రహస్య సమాచారాన్ని నియోజకవర్గ కీలక నేతకు చేరవేశాడని వినుత దంపతులు అనుమానించారు. ఆ తర్వాత తన వద్ద పీఏగా పనిచేస్తున్న శ్రీనివాసులును తొలగిస్తున్నట్టు వినుత గత నెల 22న సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో పోస్టు పెట్టారు. రాజకీయ ప్రత్యర్థుల ప్రలోభాలకు లొంగిపోయి ప్రాణ, గౌరవ అంశాలలో భంగం కలిగించిన కారణంగా తొలగించినట్టు పేర్కొన్నారు. కాగా, హత్య కేసులో వినుత అరెస్టు కావడంతో ఆమెపై జనసేన పార్టీ బహిష్కరణ వేటు వేసింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేసింది.



వినుత, చంద్రబాబు దంపతుల మధ్యలో మాజీ పీఏ శ్రీనివాసులు (ఫైల్)



ట్రైబ్యునల్ పరిధిలోకి బనకచర్ల రాదు

- పూర్తి వరద జలాలతోనే బనకచర్ల పథకం
- 15 ఏళ్ల హైడ్రాలజీ డేటా సిద్ధం చేసిన వాప్కోస్
- కేంద్రానికి నివేదించనున్న జల వనరుల శాఖ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను తీసుకెళ్లి కృష్ణానదిలో కలిపే అంశం పోలవరం - బనకచర్ల అనుసంధాన పథకంలో లేదని కేంద్రానికి వివరించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రతిపాదనను వెనక్కి పంపుతూ.. జలశక్తి శాఖ, ఇతర సంస్థలు లేవనెత్తిన అభ్యంతరాలపై 'వాప్కోస్'తో సమగ్ర నివేదికను తయారుచేయించింది. ఈ నివేదిక రెండు రోజుల కిందట (గురువారం) జల వనరుల శాఖకు వాప్కోస్ అందజేసింది. ఈ నివేదికనూ .. కేంద్ర సంస్థలు వేసిన క్వెరీలనూ జల వనరుల శాఖ సమగ్రంగా పరిశీలన చేస్తోంది. ప్రతి క్వెరీకీ ఆచి తూచి సమాధానం చెప్పేలా సమగ్ర నివేదికను తయారు చేస్తోంది. ఆ నివేదికను సోమవారం లేక మంగళవారం కేంద్రానికి సమర్పించాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. రుతుపవనాల సమయంలోను, గోదావరికి వరదలు వచ్చేసమయంలోను పోలవరం దిగువన తీసిన 15సంవత్సరాల డేటా ఆధారంగా 2,842 టీఎంసీలు వరద జలాలేనని గణాంకాలతో సహా తెలియజేయనుంది. 75శాతం నికర జలాల కింద కాళేశ్వరం జీ-0 దాకా 932 టీఎంసీలు, ఇంద్రావతి జీ-11 దాకా 737 టీఎంసీలు , లోయర్ గోదావరి జీ-10 దాకా 231 టీఎంసీలు, శబరి దాకా జీ-12లో 383 టీఎంసీలు.... మొత్తం 2,194 టీఎంసీల జలాలు అందుబాటులో ఉంటాయని వివరించనుంది.

కృష్ణాలోకి గోదావరి రాదు..

గోదావరి జలాలు కృష్ణానదిలో కలిస్తే .. గోదావరి వివాద ట్రైబ్యునల్ తీర్పునకు లోబడి కృష్ణా జలాల్లో కర్ణాటక, మహారాష్ట్రలకు ఉమ్మడి ఏపీ వాటా ఇవ్వాల్సి వస్తుందని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సహా.. పోలవరం అథారిటీ, గోదావరి నదీ యాజమాన్య సంస్థ పేర్కొంది. దీనిపై రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బనకచర్ల పథకంలో గోదావరి జలాలు కృష్ణా నదిలోకి వెళ్లకుండా సాగర్ కుడికాలువపై అక్విడెక్టును నిర్మించి .. బొల్లాపల్లి రిజర్వాయరులోకి.. ఆ తర్వాత బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలిస్తామని స్పష్టం చేయనున్నది. పెన్నా బేసిన్‌కు గోదావరి జలాలు వెళ్తున్నందున కృష్ణా-గోదావరి జలాల సంగమానికి ఆస్కారమే ఉండదని, అందువల్ల పొరుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ జలాల్లో వాటా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేయాలని నిర్ణయించింది. అదేవిధంగా 75 శాతం నికర జలాల వినియోగానికి మించి గోదావరి వరద జలాలు ఉన్నాయని తెలపనుంది. అందువల్లే రోజుకు 2టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని భావిస్తున్నామని వివరించనుంది. డీపీఆర్‌ను సమర్పించే సమయంలో హైడ్రాలజీ మెథడాలజీకి సంబంధించి 40 ఏళ్ల గణాంకాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ఫీజుబిలిటీ రిపోర్టును మాత్రమే సమర్పించినందున .. వాప్కోస్ రూపొందించిన రిపోర్టులో 15 ఏళ్ల లెక్కలను సిద్ధం చేశారు. డీపీఆర్‌ను సమర్పించే సమయంలో 40ఏళ్ల నీటి ప్రవాహ లెక్కలను ఇస్తామని కేంద్రానికి వెల్లడించాలని నిర్ణయించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి.. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి మధ్య ఎలాంటి సంబంధం లేదని కేంద్రానికి జలవనరుల శాఖ స్పష్టం చేయనుంది. పోలవరం పూర్తయ్యాకే బనకచర్లకు అనుమతిస్తామంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చెప్పడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వివరణను సిద్ధం చేసుకుంది. పోలవరం నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు మాత్రమే పీపీఏ బాధ్యత వహించాల్సి ఉంటుందని .. అంతకు మించి పీపీఏకు ఎలాంటి అధికారాలూ ఉండవని కూడా స్పష్టంచేస్తోంది.

సబ్‌బేసిన్	75% నికర జలాలు (టీఎంసీ)	ఏపీ, తెలంగాణ వాటా(టీఎంసీ)	ఇతర రాష్ట్రాల వాటా (టీఎంసీ)	మొత్తం వినియోగం (టీఎంసీ)	సగటు నికర జలాలు(టీఎంసీ)
కాళేశ్వరం దాకా	832	284	545	829	1049
ఇంద్రావతి	737	280	457	737	981
లోవర్ గోదావరి	231	211	20	231	316
శబరి	393	148	245	393	495
మొత్తం	2,194	924	1,268	2,191	2,842

శ్రీశైలంలో పుష్కలంగా జలాలు...

1984 నుంచి 2024 వరకు అంటే 40 ఏళ్లలో శ్రీశైలం జలాశయానికి చేరిన నీటి రికార్డులు పరిశీలిస్తే.. 12 ఏళ్లు 1501 నుంచి 2 వేల టీఎంసీలు వచ్చాయి. తొమ్మిదేళ్లు వెయ్యి నుంచి 1500 టీఎంసీలు, 14 ఏళ్లు 500 నుంచి వెయ్యి టీఎంసీల వరకు వరద చేరింది. రెండేళ్లు మాత్రమే 250 నుంచి 500 టీఎంసీలు వచ్చాయి. మూడేళ్లు మాత్రం కనిష్ఠంగా 250 టీఎంసీల కంటే తక్కువ వరద నమోదైంది. వెరసి... 40 ఏళ్లలో 35 సంవత్సరాలు శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద నమోదైందని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.



'బనకచర్ల'కూ కాలువలు కావాల్సిందే!

గోదావరి - బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా... గోదావరి వరద జలాలు రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోస్తామంటున్నారు. ఈ జలాలను సద్వినియోగం చేసుకోవాలన్నా... కాలువల నిర్మాణం పూర్తి చేయాల్సిందే. దీనికోసం గాలేరు నగరి (జీఎన్‌ఎస్‌ఎస్), తెలుగుగంగ కాలువలు త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కులు, గోరకల్లు రిజర్వాయర్ నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ ద్వారా 10 వేల క్యూసెక్కులకు మించి తీసుకోలేని పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ కాలువకు లైనింగ్ చేయకపోవడం, అవుకు ట్విన్ టన్నెల్స్ పనులు, కాలువ పనులు అసంపూర్తిగా ఉండడమే ఇందుకు కారణం. డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువలు సరేసరి. వీటిని పూర్తి చేయకుండా గోదావరి వరద జలాలు బనకచర్ల ఎగువన పోసినా, ఎస్కేప్ చానల్ ద్వారా నిప్పులవాగు, కుందు నది ద్వారా పెన్నా నదిలోకి మళ్లించి అక్కడి నుంచి సోమశిల, కండలేరుకు పంపడం తప్పా మరో మార్గం లేదు. రెండు మూడేళ్లలో తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులను ప్రధాన కాలువల మొదలుకొని పంట చేలకు సాగునీరందించే డిస్ట్రిబ్యూటరీ కాలువలు, పంట కాలువలు (సబ్ మైనర్).. వంటి వివిధ పనులు పూర్తి చేయాల్సిన అవసరముంది. అదే జరిగితే... 'గోదావరి - బనకచర్ల' పూర్తయ్యేదాకా వేచి చూడాల్సిన అవసరమూ ఉండదు.

గోదావరి-బనకచర్ల వరమా.. భారమా?

(మొదటి పేజీ తరువాయి)

పంటకాలువలు నిర్మించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏమిటీ బనకచర్ల?

చంద్రబాబు పాతికేళ్ల ముందుచూపుతో ఎన్నో ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అందులో... గోదావరి - బనచకర్ల అనుసంధానం ప్రాజెక్టు ఒకటి. ఏటా కడలిపాలవుతున్న వేల టీఎంసీల గోదావరి జలాల్లో... 200 టీఎంసీలను మూడు దశల్లో ఎత్తిపోసి, నంద్యాల జిల్లా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ఎగువన కలపాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80వేల కోట్లు! మన ప్రభుత్వాల ట్రాక్ రికార్డును గమనిస్తే... ఏ పాతికేళ్లకో గానీ గోదావరి- బనకచర్ల అనుసంధానం పూర్తయ్యే అవకాశం లేదు. అదికూడా... అంతర్రాష్ట్ర వివాదాలు తలెత్తకుండా ఉంటే! బనకచర్లపైనే దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న సీమ ప్రాజెక్టులను వదిలేస్తారా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

వీటిని పూర్తి చేస్తే..

దశాబ్దాల కిందట మొదలుపెట్టిన తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాలేదు. ఏటేటా నిర్మాణ వ్యయం పెరుగుతోందే తప్ప లక్ష్యాలను చేరుకోవడం లేదు. వీటిని పూర్తిచేసి... ఇతర ప్రాజెక్టుల కింద పంటకాలువలను పూర్తిస్థాయిలో తవ్వితే కృష్ణా వరద జలాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చు. గోదావరి-బనకచర్ల సాకారమయ్యే దాకా ఆగాల్సిన అవసరమే లేదు. గరిష్ఠంగా రూ.5వేల కోట్లు ఖర్చు చేయగలిగితే ఒకటి రెండేళ్లలోనే సీమ మొత్తం సస్యశామలమవుతుంది.

ఏదీ తెలుగుగంగ..

40 ఏళ్లైనా తెలుగుగంగ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం పూర్తి కాలేదు. శ్రీశైలం ఎగువన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 29 టీఎంసీలు మళ్లించి ఉమ్మడి కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల్లో 5.29 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. మెయిన్ కెనాల్‌ను 5 వేల క్యూసెక్కుల ప్రవాహానికి విస్తరించడం, నంద్యాల జిల్లాలో అసంపూర్తిగా ఉన్న పంట కాలువలు, కడప జిల్లా బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాలువల లైనింగ్, పంట కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు పూర్తిచేస్తే 2.75లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కానీ... 1.25 లక్షల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. రూ.850 కోట్లు ఖర్చుపెడితే... మరో లక్ష ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

గాలేరు-నగరి 'గోడు'

గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుద్వారా కడప, చిత్తూరు జిల్లాల్లో 2.60లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 5 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని లక్ష్యం. 2005లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీనికింద కర్నూలు, కడప జిల్లాల్లో 62.64 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు పూర్తిచేశారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల బ్రాంచి కెనాల్, లింగాల కాలువ ద్వారా చెరువులు, వాగులు, కుంటలకు నీటిని వదులుతున్నారు. పంట కాలువలు, డిస్ట్రిబ్యూటర్లు అసంపూర్తిగా ఉండటంతో ఆయకట్టుకు నీరివ్వడం లేదు. రూ.950కోట్లతో ఈ పనులు పూర్తి చేయగలిగితే ఉమ్మడి కడప జిల్లాలో 3.37లక్షల ఎకరాలకు నీరందుతుంది. ఫేజ్-2లో భాగంగా తిరుపతి జిల్లాలో బాలాజీ, అడవికొత్తూరు, వేణుగోపాల సాగర్, వేపగుంట, మల్లెమడుగు రిజర్వాయర్లకు 10 టీఎంసీలు మళ్లించి 1.03 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. రైల్వే కోడూరు నుంచి తిరుపతి జిల్లాకు కృష్ణా జలాలు పారాలంటే దాదాపు 24 కిలోమీటర్ల పొడవునా రెండు ప్రధాన టన్నెల్స్ తవ్వాల్సి ఉంది. ఈ ప్రాంతంలో అభయారణ్యాలు ఉండడంతో అనుమతులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి.

హంద్రీనీవా విస్తరణ సరే.. పంట కాలువలు ఏవీ?

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకానికి 1989లో ఆనాటి సీఎం ఎన్టీఆర్ శ్రీకారంచుట్టారు. దీనిని శ్రీశైలం జలాశయంలో 834 అడుగుల లెవెల్ నుంచి నీటిని తీసుకునేలా డిజైన్ చేశారు. మల్యాల నుంచి 40 టీఎంసీల కృష్ణా వరదజలాలు ఎత్తిపోసి ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం. 2012 నవంబరులో ట్రయల్‌రన్ పూర్తిచేశారు. అప్పటినుంచి ఏటా కృష్ణాజలాలు ఎత్తిపోస్తున్నా ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పంట కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, సంబంధిత నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకుగాను 25వేల ఎకరాలకే నీరందుతోంది. రూ.210 కోట్లు ఖర్చుచేసి పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తిచేస్తే 45వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా.. ఆ దిశగా చర్యలు శూన్యం. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. రూ.1,250 కోట్లతో పంటల కాలువలు పూర్తి చేస్తే ప్రాజెక్టు ఫలాలు పూర్తి స్థాయిలో అందుకోవచ్చు.

'బనకచర్ల'... బృహత్తర ప్రాజెక్టు

వృథాగా కడలి పాలవుతున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మళ్లించాలనే లక్ష్యంతో గోదావరి-బనకచర్లను తెరపైకి తెచ్చారు. ఖర్చు, నిర్మాణం కోణంలో చూస్తే... ఇదో భారీ, సంక్లిష్టమైన ప్రాజెక్టు అని చెప్పక తప్పదు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80,112 కోట్లు అవసరమని అంచనా చేసి.. నిధుల సేకరణకు 'జల హారతి కార్పొరేషన్' ఏర్పాటు చేశారు.

- దీనిద్వారా 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 22.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చని ప్రభుత్వం చెబుతోంది.
- గోదావరి-బనకచర్ల ఫేజ్-1లో పోలవరం కుడి కాలువ ద్వారా గోదావరి వరద జలాలు కృష్ణా నదిలోకి మళ్లిస్తారు. ఫేజ్-2లో సాగర్ కుడి కాలువ దాటి కొత్తగా 150టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే బొల్లాపల్లి జలాశయంలోకి మళ్లిస్తారు. ఫేజ్-3లో భాగంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి నంద్యాల జిల్లా పాములపాడు వద్ద బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ఎగువన శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాలువలో పోస్తారు.
- కాలువలు, జలాశయాల నిర్మాణం కోసం 47,999 ఎకరాల భూసేకరణ చేయాలి.
- 400.4 కి.మీ. గ్రావిటీ కెనాల్, 10 లిఫ్టులు, 38.01 కి.మీ. 3భారీ టన్నెల్స్, 16.7 కి.మీ. పైపు లైన్ కెనాల్ నిర్మించాల్సి ఉంటుంది.

సీమ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


రాయలసీమను సస్యశామలం చేసేందుకు ఏ ప్రాజెక్టు చేపట్టినా కాదనం. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులకు విభజన చట్టంలో నీటి హక్కులు కల్పించారు. కాలువలు అసంపూర్తిగా ఉండడం, సరైన నిర్వహణ లేకపోవడంతో కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. బనకచర్ల ప్రాజెక్టుపై మాకు ఏ అభ్యంతరం లేదు. అదే క్రమంలో తొలిప్రాధాన్యతగా అసంపూర్తిగా ఉన్న సీమ కాలువలు, పంట కాలువలను పూర్తి చేయాలి.

- బొజ్జ దశరథరామిరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు, నంద్యాల

రెండో దశ భూసమీకరణపై హడావుడి వద్దు

- సీఆర్‌డీఏకు సీఎం చంద్రబాబు సూచన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



రాజధాని అమరావతి రెండో విడత భూ సమీకరణ విషయంలో హడావుడి వద్దని సీఆర్‌డీఏ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించింది. మొదటి దశలో భూములు ఇచ్చిన రైతుల సమస్యలు ఇంకా అపరిష్కృతంగా ఉండటంపై రెండో దశలో భూములు ఇవ్వాల్సిన రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ప్రణాళికలు ఏమిటనే అంశాలపై అవగాహన కల్పించకపోవడం, హడావిడిగా గ్రామసభల నిర్వహణతో వారిలో ఆగ్రహం నెలకొంటోంది. రైతుల సందేహాలను పూర్తిస్థాయిలో తీర్చే ప్రయత్నాలు జరగలేదని ప్రభుత్వం కూడా అంగీకరిస్తోంది. రెండో దశ భూ సమీకరణపై మంత్రుల కమిటీని నియమించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే రైతులను ఒప్పించి ముందుకు అడుగు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఈ ప్రక్రియను నిదానంగా ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు నిర్దేశించింది.

ఇప్పటికిప్పుడు 20 వేల ఎకరాలే

కొత్తగా సమీకరించే భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్‌తో పాటు స్మార్ట్ ఇండ్రస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ వంటి వాటిని నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతోంది. రెండోదశలో అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెద మద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాలతో పాటు తుళ్లూరు మండలంలో వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెదపరిమి గ్రామాల్లో కలిపి 20,494 ఎకరాలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని భావిస్తున్నారు. వీటికి ల్యాండ్ పూలింగ్ నిబంధనలు అమలు చేస్తూ చట్టసవరణ చేశారు. కాగా, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం భూ సమీకరణ ప్రక్రియను నిదానంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రైతుల అభ్యంతరాల అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ప్రస్తావించిన కొందరు మంత్రులు.. తొందరపడకూడదని సూచించినట్టు సమాచారం. రైతులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, వారి ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పినట్టు భోగట్టా. దీంతో ఈ విషయంలో హడావుడి వద్దని సీఆర్‌డీఏ అధికారులకు సీఎం సూచించినట్టు తెలుస్తోంది.

15, 16 తేదీల్లో సీఎం ఢిల్లీ పర్యటన

- అమిత్‌షాతో సహా పలువురు కేంద్రమంత్రులతో భేటీ
- బనకచర్లపై జలశక్తి మంత్రితో సమావేశం

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం 15, 16 తేదీల్లో ఢిల్లీ వెళుతున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో సీఎం సమావేశం కానున్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర గ్రాంట్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన అంశాలను ఆయా మంత్రిత్వ శాఖలతో సీఎం చర్చించనున్నారు. 15వ తేదీ ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న చంద్రబాబు అదే రోజు మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నారు. అదే రోజు కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీ డాక్టర్ వికాస్ కుమార్‌తో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. సాయంత్రం 4.30కు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు. 16న కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో సీఎం సమావేశమవుతారు. అనంతరం నార్త్ బ్లాక్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అవుతారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయనతో చర్చించనున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు సీఎం హాజరవుతారు. 17 ఉదయం 9.30కు సీఎం ఢిల్లీ నుంచి అమరావతి బయలుదేరి వస్తారు.

'జలం'పై నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రయోజనాలు గోదాట్లోకి.. విభజన జరిగి పదేళ్లు దాటినా ఇంకా తెలంగాణలోనే కృష్ణా బోర్డు

- బోర్డుల మార్గదర్శకాలపైనా అలసత్వం
- తెలంగాణ ఇంజనీర్ల మాటకే విలువ
- పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నిర్ణయాల్లో ఏపీ అధికారుల పాత్ర నామమాత్రమే
- జలవనరుల శాఖ తీరుపై విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులను రాష్ట్ర జలవనరుల శాఖ పట్టించుకోవడం లేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా బోర్డుల మార్గదర్శకాలపై అంతులేని నిర్లక్ష్యం చూపుతోంది. రాష్ట్ర జల ప్రయోజనాలను కాపాడటంలోనూ జల వనరుల శాఖ ఇలాగే వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంలో గోదావరి నదీ జలాల యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టుపై అనుసరిస్తున్న తీరునే ఇందుకు ఉదాహరణ అని నిపుణులు పేర్కొంటున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సమర్పించాల్సిన సమయంలో లేవనెత్తాల్సిన సందేహాలను ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు సమయంలో వ్యక్తం చేయడం వెనుక బోర్డుల్లోనూ, పీపీఏలోనూ తెలంగాణ ఇంజనీరింగ్ అధికారుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని చెబుతున్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఆ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా జలాలపై హక్కుల సాధన కోసం ప్రభుత్వంతో పాటు ప్రతిపక్ష పార్టీలు నిరంతరం నదీ యాజమాన్య బోర్డులపై ఒత్తిడి పెంచుతున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోర్డుల విషయంలో ఉదాసీనతను, ప్రతిపక్ష పార్టీ వైసీపీ పూర్తి నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి. దీని ఫలితంగా రాష్ట్రానికి కృష్ణా, గోదావరి నదీ జలాల్లో రావాల్సిన న్యాయమైన హక్కులను కోల్పోవాల్సి వస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏపీకి రాని కేఆర్ఎంబీ..

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తెలంగాణలో, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఉండాలి. బోర్డులకు వర్కింగ్ మాన్యువల్‌ను రూపొందించాలి. బోర్డులలో డిప్యూటేషన్‌పై పని చేసే ఇంజనీరింగ్ అధికారుల కోసం రాష్ట్రాలు నియమ నిబంధనలతో మార్గదర్శకాలను రూపొందించాలి. కానీ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా ఇప్పటి దాకా కార్యరూపం దాల్చలేదు. కేఆర్ఎంబీని 2014-19 మధ్యకాలంలో విజయవాడకు రప్పించాలని ప్రయత్నాలు చేశారు. కానీ గట్టిగా ఒత్తిడి తీసుకురాలేకపోవడంతో రాష్ట్రానికి కేఆర్ఎంబీ తరలిరాలేదు. ఆ తర్వాత జగన్ పాలనలో కేఆర్ఎంబీ విషయంలో డొంకతిరుగుడుగా వ్యవహరించారు. విభజన చట్టంలో రాష్ట్ర రాజధాని నగరంలో కేఆర్ఎంబీ ఏర్పాటు చేయాలని ఉంటే.. కృష్ణా పరీవాహక ప్రాంతంతో ఏమాత్రం సంబంధం లేని విశాఖపట్నంలో బోర్డు ప్రధాన కార్యాలయం కోసం జగన్ స్థలం, భవనం చూపించారు. ఈ నిర్ణయాన్ని నాడు జల వనరుల నిపుణులు తీవ్రంగా వ్యతిరేకించినా జగన్ పట్టించుకోలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సువిశాలమైన భవంతిని చూపించారు. ఇక్కడికి కేఆర్ఎంబీ తరలించేందుకు ఆమోదించినా, హైదరాబాద్ మహానగరాన్ని వీడి విశాఖకు రాలేదు. 2024లో జగన్ ప్రభుత్వం ఓడిపోయాక.. కూటమి సర్కారు కేఆర్ఎంబీని విజయవాడకు తరలించేందుకు ప్రతిపాదించింది. అయితే.. విభజన చట్టం ప్రకారం అమరావతిలో కేఆర్ఎంబీ ఉండాలని, విజయవాడలో కాదంటూ బోర్డు తిరకాసు పెడుతోంది. దీంతో హైదరాబాద్‌ను వీడి కేఆర్ఎంబీ రాష్ట్ర రాజధానికి తరలిరావడం ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.

తెలంగాణలో అలా.. ఏపీలో ఇలా..

కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీలతో పొరుగు రాష్ట్రం తెలంగాణ నిత్యం టచ్‌లో ఉంటోంది. డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులకు భరోసా ఇస్తోంది. జలాల విషయంలో ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఒక్కటిగా నిలుస్తున్నాయి. కానీ ఏపీలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. నదీ యాజమాన్య బోర్డులను రాష్ట్ర జలవనరుల శాఖ పట్టించుకోవడం లేదు. బోర్డులకు అవసరమైన ఇంజనీరింగ్ సిబ్బందిని సకాలంలో డిప్యూటేషన్‌పై పంపడం లేదు. నీటి కేటాయింపుల్లో కీలకంగా వ్యవహరించే సూపరింటెండెంట్ ఇంజనీరు స్థాయి అధికారిని డిప్యూటేషన్‌పై పంపాలంటూ కేఆర్ఎంబీ చైర్మన్ రాష్ట్ర జలవనరుల శాఖను పదేపదే కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. నాలుగు నెలల క్రితం కేఆర్ఎంబీ సభ్యకార్యదర్శి విజయవాడకు వచ్చి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌ను కలిసి కోరారు. ఈ అభ్యర్థనపైనా రాష్ట్ర జలవనరుల శాఖ నుంచి స్పందన లేదు. కీలకమైన ఖరీఫ్ పంటలకు జలాలు విడుదల చేసే సమయం దాటిపోతున్నా ఇప్పటిదాకా ఎలాంటి కదలికా లేదు. దీంతో రాష్ట్ర వాటా మేరకు నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకునే వీల్లేకుండా పోతోందని నిపుణులు అంటున్నారు. బోర్డు సమావేశాలకు తెలంగాణ నుంచి నీటి పారుదల శాఖ కార్యదర్శుల స్థాయి నుంచి ఇంజనీర్ల దాకా హాజరవుతుంటే.. ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గైర్హాజరవుతున్నారు. కేవలం ఒక్కసారే బోర్డు సమావేశానికి హాజరు కావడం విమర్శలకు తావిస్తోంది.

లాబీయింగ్ ఏదీ?

నదీ జలాల్లో రాష్ట్ర వాటాపై జలవనరుల శాఖ నదీ యాజమాన్య బోర్డులపై ఒత్తిడి కానీ, లాబీయింగ్ కానీ చేయలేకపోతోంది. కృష్ణా నదీ జలాల వాటా విషయంలో, గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకంపై బోర్డులు తీసుకుంటున్న నిర్ణయాల్లో తెలంగాణ ఇంజనీరింగ్ అధికారుల మాటకే విలువ ఇస్తున్నారు. పోలవరం-బనకచర్ల పథకంపై గోదావరి నదీ యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ తీసుకున్న నిర్ణయాల్లో ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన ఇంజనీరింగ్ అధికారుల ప్రమేయం నామమాత్రమే. ఈ పథకంపై జీఆర్ఎంబీ, పీపీఏ క్వెరీలు వేశాయన్న అభిప్రాయం ఏర్పడింది. బోర్డుల్లో విధులు నిర్వహిస్తున్న ఏపీ డిప్యూటేషన్ ఇంజనీర్లతో జలవనరుల శాఖ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెలాఖరుకు కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ చైర్మన్లు మారనున్నారు. ఏపీ ప్రయోజనాలతో సంబంధం లేదన్నట్లుగా జలవనరుల శాఖ వ్యవహరిస్తోందని నిపుణులు విమర్శిస్తున్నారు.

ఇంజనీరింగ్ అధికారులపై వేధింపులు

ఏపీకి చెందిన ఇంజనీరింగ్ సిబ్బందిని జీఆర్ఎంబీ సభ్యకార్యదర్శి వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నా రాష్ట్ర జలవనరుల శాఖ పట్టించుకోవడం లేదు. అదే తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులకు ఇలాంటి వేధింపులు ఎదురైతే ప్రభుత్వం, రాజకీయపక్షాలు అండగా నిలుస్తున్నాయి.



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం

ఉరకలేస్తున్న గోదావరి

- గొమ్ముగూడెం చుట్టూ వరద.. ముంపు మండలాలకు పొంచి ఉన్న ముప్పు
- భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం

ఏలూరు/పోలవరం, ధవళేశ్వరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉరకలేస్తోంది. శనివారం సాయంత్రం నాటికి భద్రాచలం వద్ద 41.20 అడుగులకు వరదనీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువవుతోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నిండుకుండను తలపిస్తోంది. ఇప్పటికే రెండు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ఎగువన ముంపు మండలాలైన కుక్కునూరు, వే లేరుపాడు మండలాల్లో సుమారు 25 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగులోకి వరదనీరు చేరడంతో ఎగువన ఉన్న గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం చుట్టూ వరదనీరు చేరడంతో ఆ గ్రామంలోని 250కు పైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. దాచారం పునరావాస కాలనీలో నిరాశ్రయులందరికీ భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. అప్పటికప్పుడు సమీపంలో బోరు తవ్వి తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీహరి ముంపు మండలాల్లోనే మకాం వేసి ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గోదావరి వరద మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండడంతో సాధ్యమైనంత మేర పునరావాస కేంద్రాలకు తరలి రావాల్సిందిగా శనివారంనాడంతా ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

●6,98,782 క్యూసెక్కులు విడుదల

పోలవరం వద్ద గోదావరి వరద జలాలు ఉధృతంగా ప్రవహిసున్నాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 6,98,782 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 31.200 మీటర్లు, దిగువన 22.360 మీటర్ల నీటిమట్టం నమోదయ్యింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి. గోదావరి లంక భూములు నీటమునిగాయి. గండిపోశమ్మ ఆలయం నీటమునగడంతో ఆలయానికి రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

●ధవళేశ్వరం వద్ద.. సముద్రంలోకి 5,29,209 క్యూసెక్కులు

ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 3.5 లక్షల క్యూసెక్కులు సముద్రంలో కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి వెళుతోంది. ఇక్కడ గోదావరి నీటి మట్టం 10.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి మరింత పెరిగి సుమారు 7లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ నుంచి రావచ్చని ఫ్లడ్ సెక్షన్ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ఎగువన భద్రాచలం వద్ద 41.40 అడుగులకు పెరిగిన నీటి మట్టం ఆపై నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఒక పాయింట్ తగ్గి 41.30 అడుగులకు చేరుకుంది.

నేటి నుంచి వరద తగ్గుముఖం: విపత్తుల సంస్థ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా ప్రకారం గోదావరి వరద ఆదివారం నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. అయినా పూర్తి స్థాయిలో వరద తగ్గే వరకు నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహాయక చర్యల కోసం కోనసీమలో ఒకటి, వేలేరుపాడు, కుక్కునూరులో ఒక్కొక్క ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ నుంచి గోదావరి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నదీ పరీవాహక జిల్లాల అధికారులకు సూచనలు జారీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

రైతు నేస్తం పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు
- వినూత్న ఆవిష్కర్తలకు ప్రదానం
- ఆగస్టు 31లోగా పంపాలని నిర్వాహకుల సూచన

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతునేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఐవీ సుబ్బారావు స్మారక పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి దరఖాస్తులు కోరుతూ రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు, విస్తరణ అధికారులతో పాటు వినూత్న వ్యవసాయ ఆవిష్కరణల రూపకర్తలు... దరఖాస్తులతో పాటు వారి పరిశోధన వ్యాసాలు, సాగు అనుభవాలను జత చేసి ఆగస్టు 31లోగా 'ఎడిటర్, రైతునేస్తం, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ భవనం, ఖైరతాబాద్, హైదరాబాద్-500004 చిరునామాకు పంపించాలి. రైతునేస్తం, డోర్‌నెంబరు 8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 522017 చిరునామాకు కూడా పంపించవచ్చని నిర్వాహకులు తెలిపారు. పురస్కారాలకు ఎంపిక చేసిన వ్యక్తులకు సెప్టెంబరులో నిర్వహించే రైతునేస్తం వార్షికోత్సవ సభలో అవార్డులు ప్రదానం చేస్తామని వెంకటేశ్వరరావు వెల్లడించారు. మిగతా వివరాలకు 9676797777, 9705383666 నెంబర్లలో సంప్రదించవచ్చు. దరఖాస్తులను రైతునేస్తం డాట్ ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఎరువుల కోసం రైతులు క్యూకట్టే పరిస్థితి తేవద్దు

- వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎరువులు లేవనే అపోహలు గానీ, ఎరువుల కోసం ఎక్కడా రైతులు క్యూలో వేచి ఉండే పరిస్థితులు గానీ ఉండకూడదని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ జిల్లా అధికారులకు స్పష్టం చేశారు. కర్నూలు, శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో రైతులు బారులు తీరిన పరిస్థితుల్లో శనివారం ఆయన జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎరువుల కోసం రైతులు క్యూలో ఉండాల్సిన పరిస్థితులు తేవొద్దన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో ఎరువుల లభ్యతపై వాస్తవ పరిస్థితులను రాజశేఖర్ వాకబు చేశారు. రానున్న రెండు నెలలు ఎరువుల పంపిణీ అత్యంత కీలకమని, సాగు విస్తీర్ణం, పంటలకు అవసరమైన ఎరువులు, జిల్లాల్లో నిల్వలపై బేరీజు వేసుకుని, వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో అంతర్గత యాజమాన్యంపై శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. మన్యం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు శ్యాంప్రసాద్, స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ తమ జిల్లాల్లో పంటల సాగు విస్తీర్ణానికి తగ్గ ఎరువుల నిల్వలున్నాయని, రైతులకు ఎరువులు అందవనే అపోహ అవసరం లేదని స్పష్టం చేశారు. కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా స్పందిస్తూ.. గత ఐదేళ్లు సొసైటీల్లో ఎరువుల పంపిణీ అలవాటు తప్పిందని, ఇప్పుడు రైతులంతా డీసీఎంఎస్ ఎరువుల పాయింట్‌కు రావడంతో క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. మార్క్‌ఫెడ్‌కు ఇచ్చే 50% కోటా నుంచి రైతుసేవా కేంద్రాలకు ఎరువుల వికేంద్రీకరణ జరిగితే రైతులు క్యూలో ఉండాల్సిన అవసరం ఉండదని సూచించారు. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న ఎరువులు, జూలై, ఆగస్టులో రానున్న ఎరువుల వివరాలను వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు వివరించారు.

టీటీడీలో అన్యమత ఉద్యోగులు నిజమే!

- ఎంతమంది ఉన్నారో టీటీడీని నివేదిక కోరాం
- సర్వీసు రూల్స్ ప్రకారం వారి బదిలీపై నిర్ణయం
- ఆగస్టులో 1,014 దేవాలయాలకు పాలకవర్గాలు
- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- తిరుమలలో వివిధ అంశాలపై సమన్వయ సమావేశం
- 599 మంది వేద పండితులకు సంభావనపైనా చర్చ



సమన్వయ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో మంత్రి ఆనం

తిరుమల, జూలై 12(ఆంధ్రజ్యోతి): టీటీడీలో అన్యమత ఉద్యోగులు ఉన్నది వాస్తవమేనని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో టీటీడీ కాలేజీలు, స్కూళ్లు, పరిపాలన విభాగాల్లో హిందూయేతరులను ఉద్యోగులుగా నియమించారని చెప్పారు. వీరు ఎంతమంది ఉన్నారనే దానికి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని టీటీడీని కోరామని తెలిపారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌ను దృష్టిలో పెట్టుకుని, న్యాయపరమైన చిక్కులు ఏమైనా ఉంటాయా అనే విషయం క్షుణ్ణంగా తెలుసుకున్న తర్వాతే వారిని ఏ విభాగాలకు బదిలీ చేయాలో త్వరలోనే నిర్ణయిస్తామని చెప్పారు. టీటీడీ నుంచి దేవదాయ శాఖకు ఎంత సీజీఎఫ్ రావాలనే అంశంపై సమావేశంలో చర్చించామని, సీఎంతో మరోమారు చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 599మంది నిరుద్యోగ వేద పండితులకు రూ.3వేల చొప్పున సంభావన ఇచ్చే అంశంపై కూడా చర్చించామని చెప్పారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే మార్గం పక్కనే ఉన్న 2.10 ఎకరాల భూమిని అమ్మవారి ఆలయానికి లీజుకు ఇవ్వాలని కోరగా, టీటీడీ సానుకూలంగా స్పందించిందని చెప్పారు. ఈ స్థలం అందుబాటులోకి వస్తే బహుళ అంతస్థుల కార్ పార్కింగ్, వసతి సముదాయాలతో పాటు మరో నూతన రోడ్డు భక్తులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీంతో ఒక మార్గంలో భక్తులు పైకి వెళితే మరో మార్గంలో కిందకు వస్తారని వివరించారు. దేవదాయ శాఖ పరిధిలో రూ.5లక్షలకు పైబడి, రూ.25లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్న ఆలయాలు మొత్తం 1,014 ఉన్నాయని, వీటికి ఆగస్టులో నూతన పాలకవర్గాలను నియమిస్తామని వెల్లడించారు. అలాగే రూ.25లక్షల నుంచి రూ.5కోట్ల పైబడి ఆదాయం ఉన్న 500 ఆలయాలకూ రెండు, మూడు నెలల్లోనే పాలకవర్గాలను నియమిస్తామని మంత్రి చెప్పారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆలయాల నిర్మాణాలకు రూ.147 కోట్లు విడుదల కాక నిలిచిపోయాయని, ఖర్చుల వివరాలు అందగానే ఆ నిధులు విడుదల చేస్తామని టీటీడీ తెలిపిందని ఆనం పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, దేవదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ పాల్గొన్నారు.



వర్జీనియా రాష్ట్ర కాంగ్రెస్ మెన్ సుహాస్‌తో రఘురామ, రవి

వర్జీనియా కాంగ్రెస్‌మెన్ సుహాస్‌తో రఘురామ భేటీ

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సుహాస్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన వర్జీనియా రాష్ట్ర కాంగ్రెస్‌మెన్ సుహాస్ సుబ్రహ్మణ్యంతో సమావేశమయ్యారు. వాషింగ్టన్ డీసీలో జరిగిన ఓ కార్యక్రమంలో వీరు భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి అనిమిని కూడా పాల్గొన్నారు. దక్షిణ భారతీయ మూలాలు ఉన్న సుహాస్ అటార్నీగా పనిచేశారు. 38 ఏళ్ల వయస్సులోనే అమెరికా దిగువ సభ 'దిగువ సభ'కు ఎన్నికయ్యారు. ఆయన తండ్రి సికింద్రాబాద్‌లో కొంతకాలం పనిచేశారు.

మండుతున్న రాష్ట్రం

విశాఖపట్నం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మేఘాల జాడ లేకపోవడంతో వేసవిలో మాదిరిగా రాష్ట్రంలో వేడి వాతావరణం కొనసాగుతోంది. వారం, పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. శనివారం నరసాపురంలో 39.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరులో 39.4, కావలిలో 39.1, తునిలో 38.5 డిగ్రీలు నమోదయ్యాయి. దేశంలో తమిళనాడు, కోస్తా, రాయలసీమల్లోనే ఎండలు, వేడి వాతావరణం కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితి మరో రెండు రోజులు ఉంటుందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఈనెల 16న పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో 17వ తేదీ నుంచి కోస్తాలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే తప్ప కోస్తాలో గట్టి వర్షాలు కురిసే పరిస్థితి లేదని, లేదంటే.. రుతుపవనద్రోణి తూర్పుభాగం దక్షిణాది వైపుగా రావాలని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

ఈఏపీసెట్.. అంతా గందరగోళం!

- నేడు వెబ్ ఆప్షన్లు ప్రారంభం కావాలి
- అర్ధరాత్రి వరకూ విడుదల కాని సీట్ల జీవోలు

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కావాలి. కానీ శనివారం అర్ధరాత్రి వరకూ ఏ కాలేజీలో ఎన్ని సీట్లు ఉన్నాయి.. అనే జీవోలే విడుదల కాలేదు!.. ఈఏపీసెట్ కౌన్సెలింగ్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యాశాఖ ఇటీవల షెడ్యూలు విడుదల చేసింది. తొలుత 10వ తేదీ నుంచి ఆప్షన్ల ఎంపిక ఉంటుందని ప్రకటించి, తర్వాత 13 తేదీకి వాయిదా వేసింది. దీంతో ఆప్షన్ల ఎంపికకు విద్యార్థులకు 6 రోజులే మిగిలాయి. అది కూడా నేడు ఆప్షన్లు ప్రారంభమైతేనే. ఉన్నత విద్యాశాఖ ఏఐసీటీఈ కేటాయింపులకు అనుగుణంగా అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేయాలి. 2025-26కు ఫీజులపై జీవో కూడా ఇవ్వాలి. కానీ.. శనివారం అర్ధరాత్రి వరకు జీవో రాలేదు.

నేను జాతీయవాదిని

- తెలంగాణ, ఆ రాష్ట్ర సంస్కృతి పట్ల గౌరవం ఉంది
- ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్



హైదరాబాద్ వచ్చిన మాధవ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావును కలుసుకున్నారు.

హైదరాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): "నేను జాతీయవాదిని. తెలంగాణ పట్ల, ఇక్కడి గొప్ప సంస్కృతి పట్ల నాకున్న గౌరవం రాజకీయ విమర్శలకు అతీతం. తెలంగాణ పట్ల నాకున్న గౌరవాన్ని ఎవరూ తగ్గించలేరు." అని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. రజాకార్లను పొగిడే నిజాం వారసుల ముందు తలవంచిన వారికి తెలంగాణ ప్రజల హృదయాల్లో ప్రతిఫలించే సంస్కృతి, జాతీయత, సమానత్వం అనే విలువలు ఎప్పటికీ అర్థం కావని అన్నారు. ఏపీ మంత్రి లోకేశ్‌కు బహూకరించిన అఖండ భారత్ చిత్రపటంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. శనివారం హైదరాబాద్ వచ్చిన మాధవ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావును కలుసుకున్నారు. భారతీయ సాంస్కృతిక వైభవానికి సంబంధించిన చిత్రాన్ని మాధవ్.. రాంచందర్‌రావుకు బహూకరించారు. "తెలుగు వారి ఐక్యతపై రాజకీయ గీతలు వేసేవారు చరిత్ర ముందు లొంగాల్సిందే. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ప్రజలు జ్ఞాపకం ఉంచుకుంటారు. తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య బంధాన్ని చీల్చే ప్రయత్నాలు వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం" అన్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*